


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 25 శుక్రవారం | జూలై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 309

Navabhoomi daily fallows..


Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## తెలంగాణలో కుండపోత వానలు..

- బంగాళాఖాతంలో అల్పపీడనంతో వర్షాల ఉధృతి
- రాష్ట్రవ్యాప్తంగా ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు
- ఉత్తర, మధ్య తెలంగాణలో భారీ వర్షాల సూచన
- లోతట్టు ప్రాంతాలు జలమయం జనజీవనం స్తవ్యస్తం
- ములుగు జిల్లా వెంకటాపురంలో రికార్డు వర్షపాతం
- హైదరాబాద్‌లో జల్లులు -రహదారులపై నీటి నిల్వలు
- వాగులు, వంకలు పొంగి పొర్లి రహదారి కట్టడాలు దెబ్బతినే పరిస్థితి

2




హైదరాబాద్-నవభూమి బ్యూరో

తెలంగాణలో గత వారం రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తాజాగా రాష్ట్రానికి హైదరాబాద్ వాతావరణశాఖ మరోసారి వర్షం హెచ్చరికలు జారీ చేసింది. తూర్పు, పశ్చిమ ద్రోణుల ప్రభావంతో తెలంగాణలో నేడు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది.నేడు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.హైదరాబాద్‌తో పాటు

## జర్నలిస్ట్‌లకు గుడ్ న్యూస్

- అక్రిడిటేషన్ కార్డులు వచ్చే వారంలో అందుబాటులోకి
- హెల్త్ కార్డుల పంపిణీ త్వరలో ప్రారంభం
- ఇళ్ల స్థలాల విషయంలో చట్టపరమైన చర్చలు
- జర్నలిస్టుల సమస్యలు ఒక్కొటిగా పరిష్కారం
- కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి ఉంది
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త అక్రిడిటేషన్ల ప్రక్రియ
- యూనియన్లతో సంప్రదింపులు ప్రారంభం
- సుప్రీంకోర్టు తీర్పుల దృష్టిలో ఇళ్ల పంపిణీ
- అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వ అండ
- ఐజేయూ మహాసభలో కీలక ప్రకటనలు



హైదరాబాద్-నవభూమి బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన జర్నలిస్టులకు సంబంధించి కీలకమైన మూడు ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే జర్నలిస్ట్‌లకు కొత్త అక్రిడిటేషన్లు ఇస్తామని ప్రకటించారు.ఖమ్మం జిల్లా: జర్నలిస్టులకు సంబంధించి కీలకమైన 3 ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరి స్తామని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే జర్నలిస్ట్‌లకు కొత్త అక్రిడిటేషన్లు ఇస్తామని ప్రకటించారు. గురువారం ఖమ్మం జిల్లాలోని వైరాలో టీయూడబ్ల్యూ జే (ఐజేయూ) నాల్గో జిల్లా మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వచ్చేవారంలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో యూనియన్ నాయకులతో చర్చించి ఫైనల్ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చిన తర్వాత వెంటనే హెల్త్ కార్డులు ఇస్తామని వెల్లడించారు.

ఇళ్ల స్థలాలకు సంబంధించి సుప్రీంకోర్టులో ఉండటంతో న్యాయ నిపుణులతో చర్చించి ఎలాంటి ఆటంకం కలగకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని మాటిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఉద్ఘాటించారు. జర్నలిస్టులకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## యూకే-భారత్ వాణిజ్య ఒప్పందం

- పన్నులేని ఎగుమతులకు యూకే గ్రీన్‌సిగ్నల్
- భారత పండ్లకు యూరప్‌లో కొత్త బజార్
- సేంద్రియ మసాలాలకు విదేశీ గుర్తింపు
- రెడీ టు ఈట్ ఫుడ్స్‌కి ఎగుమతి ఊరట
- మరింత సులభం కానున్న సర్టిఫికేషన్ ప్రక్రియ
- డైరీ ఉత్పత్తులకు మినహాయింపు నిల్
- చేపల, రొయ్యల విక్రయాలకు గ్రీన్ ఛాన్స్
- భారత టీ, కాఫీ బ్రాండ్లకు స్థిర స్థానం
- నూనె విత్తనాల రైతులకు మేలు దారి

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ డీల్‌తో అసోం పర్వత ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల దాకా, పంజాబ్ పొలాల నుంచి కేరళ మసాలా క్షేత్రాల వరకు యావత్తు భారత రైతులకు భారీ ప్రయోజనం కలగనుంది. ఈ ఒప్పందం వల్ల వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి? పన్ను రహితంగా యూకేకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు ఏవి? ఈ డీల్ ద్వారా ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడులోని 'ఫిషరీస్'కు ఎగుమతులకు ఉన్న అపార అవకాశాలను ఏంటి? కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్, యూకే చర్చలు 2025 మే 6న కొలిక్కి వచ్చాయి. ఇక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని ఆనాడే ఇరుదేశాలు అంగీకారానికి వచ్చాయి. గురువారం రోజు (జులై 24న) ఈ ఒప్పందంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో

### తెలంగాణలో చేపట్టిన సర్వే దేశానికి ఆదర్శం : ఖర్గే

2

### నిజాం కాలం నాటి భూ సమస్యలకు చెక్

## మాజీ మంత్రి మల్లారెడ్డికి బిగ్ షాక్.. ఐటీ సోదాలు !

- మల్లారెడ్డి ఇంటిపై ఐటీ దాడులు
- కుటుంబ సభ్యుల ఇళ్లలో సోదాలు
- డొనేషన్ల పేరుతో భారీగా వసూళ్లు?
- మేనేజ్‌మెంట్ కోటాలో అధిక వసూళ్లు
- డబ్బుల లావాదేవీలపై అధికారుల దృష్టి
- ఆదాయ వివరాల్లో హెచ్చుతగ్గుల అనుమానాలు
- కోడలు ప్రీతి, కొడుకు భద్రా రెడ్డి ఇళ్లు టార్గెట్
- విద్యాసంస్థల ఆర్థిక వివరాల పరిశీలన



2

హైదరాబాద్-నవభూమి బ్యూరో

తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ఆదాయ పన్ను అధికారులు షాక్ ఇచ్చారు. ఆయన ఇంటితో పాటు కుటుంబ సభ్యుల ఇళ్లలో ఐటీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల సీట్ల కేటాయింపులో భారీగా డొనేషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలతో ఈ తనిఖీలు జరుగుతున్నాయని సమాచారం. అలానే మేనేజ్‌మెంట్ కోటాలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును మించి విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు పలు ఫిర్యాదులు అందినట్టు చెబుతున్నారు. విద్యార్థుల నుంచి డొనేషన్ల పేరుతో వచ్చిన ఆదాయాన్ని సరిగా చూపకపోవడం..

## ముగ్గురు పిల్లలను కంటే కూటమి బంపర్ ఆఫర్!

- జనాభా పెంపుపై కూటమి దృష్టి
- నిన్న 'వద్దు', నేడు 'కావాలి'
- ముగ్గురు పిల్లలకు బంపర్ ఆఫర్
- ఐవీఎఫ్ ఖర్చు ప్రభుత్వ భాద్యత
- మాతృత్వ సెలవు ఏడాది దాకా!
- జనాభా కోసం ఆస్తిపన్ను మినహాయింపు
- ఎన్నికల అర్హతకు పిల్లల పరిమితి తొలగింపు
- వర్క్‌ఫ్రం హెూం తల్లులకు ఊరట



2


అమరావతి-నవభూమి ప్రతినిధి

ఏపీలో జనాభా పెరుగుదల విషయంలో ఏమి చేయాలో అంతా చేసేందుకు కూటమి సర్కార్ సిద్ధపడుతోంది అంటున్నారు. జనాభా రేటింగ్ విషయంలో ఉత్తరాది కంటే దక్షిణాది రాష్ట్రాలు చాలా వెనకబడి ఉన్నాయి. అందులోనూ ఏపీ మరింతగా వెనకబడి ఉంది. దీని మీద ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే అనేక సభలలో జనాలకు మోటివేట్ చేస్తూనే ఉన్నారు. జనాభా పెంచండి అని ఆయన నినాదం ఇస్తున్నారు. అంతే కాదు ఒకనాడు తానే జనాభా వద్దు అని చెప్పేవాడిని అని ఆయన గుర్తు చేస్తున్నారు. అప్పటికి అది అవసరం ఇప్పటికి ఇది అవసరం కాబట్టి జనాభాను

## లక్ష ఉద్యోగాల లక్ష్యం

### కేబినెట్ సమావేశం కీలక నిర్ణయం

- రూ.70వేలకోట్లపెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్
- లక్ష ఉద్యోగాల టార్గెట్ విధింపు
- ఐటీ-డ్రోన్ రంగాల్లో కొత్త పరిశ్రమలు
- హరిత హైడ్రోజన్ వ్యాలీ దిశగా అడుగులు
- సింగపూర్‌తో పునర్ సంబంధాల పిలుపు
- స్టార్టప్ ఏరియాలో గత ప్రభుత్వ వైఫల్యం
- నీటి పన్నులపై వడ్డీ మాఫీ:ఏపీ సీఎం వెల్లడి



అమరావతి-నవభూమి ప్రతినిధి


ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మొత్తం రూ.70 వేల కోట్లు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో, లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు. క్వాంటం వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని.. దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తో సంబంధాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మన చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి మనకు సహాయం చేసిందని గుర్తుచేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు.

## భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వొద్దు

### ట్రంప్ మరో బాంబు

- ట్రంప్ మళ్లీ సంచలనం
- భారత్‌పై నేరుగా టార్గెట్
- విదేశీ నియామకాలపై ఆగ్రహం
- గ్లోబలిజానికి వ్యతిరేకం
- భారత్, చైనాలపై విరుచుకుపడటం
- ఏఐ అభివృద్ధికి కొత్త ఉత్తర్వులు
- అమెరికా ఉద్యోగాలకే ప్రాధాన్యం


2



## విజయ్ దేవరకొండకు మరోసారి ఈడీ నోటీసులు

- ఆగస్టు 11న విచారణకు హాజరు కావాలన్న ఆదేశం
- బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి కేసు
- విజయ్ ముందుగా ఇచ్చిన షెడ్యూల్ కారణంగా వాయిదా
- రానా దగ్గుబాటికి కూడా అదే తేదీ నోటీసు
- ప్రకాశ్ రాజ్‌ను ఈ నెల 30న విచారించనున్న ఈడీ
- మంచు లక్ష్మికి ఆగస్టు 13న విచారణకు హాజరు ఆదేశం
- కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలపై అనుమానాలు

12



## 6 పాకిస్థాన్ డ్రోన్లను కూల్చేసిన భారత్!

- డ్రోన్‌లతో ఆయుధ రవాణా యత్నం
- బీఎస్ఎఫ్ అప్రమత్తతతో ప్రణాళిక భగ్నం
- వారాయిన్, తుపాకుల స్వాధీనం
- అమృత్‌సర్ సరిహద్దుల్లో పాక్ కుట్ర
- పహల్గాం దాడికి ప్రతిస్పందన ఇదేనా?
- మోథే వద్ద నేలకొరిగిన ఐదు డ్రోన్లు

2



న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలతో పాకిస్థాన్ జ్ఞానం వస్తుందని చాలామంది భావించి ఉంటారు! కానీ.. నాడు భారత్ దూకుడు తట్టుకోలేక, కాల్పుల విరమణ అంటూ కాళ్ల బేరానికి వచ్చిన పాక్.. తెర వెనుక ఆగడాలు మాత్రం ఆపడం లేదు. ఈ క్రమంలో తాజాగా డ్రోన్ లతో కవ్వింపు చర్యలకు పాల్పడింది. అయితే... భారత్ మాత్రం గట్టిగా బుద్ధి చెప్పింది.అవును... పాకిస్థాన్ మరోసారి తన వక్ర బుద్ధిని బయటపెట్టింది. భారత్ పై కుట్రలు పన్నే విషయంలో తన వైఖరి మారదని చెప్పకనే చెప్పింది. ఇందులో భాగంగా... తాజాగా పంజాబ్ రాష్ట్రంలోని అమృత్ సర్ సమీపంలోని సరిహద్దు గుండా ఆయుధాలను, మత్తు పదార్థాలను మన దేశంలోకి డ్రోన్ ల ద్వారా పంపేందుకు కుట్ర పన్నింది. అయితే... భారత సరిహద్దు దళం (బీఎస్ఎఫ్) ఆ కుట్రను భగ్నం చేసింది.ఇందులో భాగంగా.. పాక్ నుంచి భారత్ సరిహద్దుల్లోకి ప్రవేశించిన ఆరు డ్రోన్లను కుప్పకూల్చింది. ఈ సందర్భంగా వాటితో రవాణా చేయబడుతోన్న మూడు తుపాకీలు, మేగజీన్లతోపాటు ఒక కిలో హెరాయిన్ ను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు ఈ

## లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు

- ఏసీబీ కోర్టు ఆశ్రయించిన మిథున్
- రాజమండ్రి జైల్లో రిమాండ్‌లో మిథున్
- హైకోర్టు, సుప్రీం కోర్టుల నుంచి నొప్పి
- వైఎస్సార్‌సీపీ హయాంలో కీలక పాత్ర?
- మద్యం విధానాల్లో మిథున్ సునామి!
- ఏ4గా కేసులో చోటు సంపాదించిన ఎంపీ



2

అమరావతి-నవభూమి ప్రతినిధి

లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్ రెడ్డి గురువారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మిథున్ రెడ్డిని ఏ4గా సిట్ చేర్చింది. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డి బెయిల్‌పై విడుదల చేయాలంటూ ఆయన తరఫు లాయర్లు ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు.ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేస్తోన్న సిట్ కార్యాలయంలో ఈ నెల 19న మిథున్ రెడ్డి హాజరయ్యారు. సుమారు ఏడు గంటల పాటు మిథున్ రెడ్డిని విచారించిన సిట్ అధికారులు, అనంతరం ఆయన్ను అరెస్టు చేశారు. అయితే, ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టు, సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను ఆయా కోర్టులు కొట్టివేశాయి. దాంతో మళ్లీ ఇప్పుడు మిథున్ రెడ్డి లాయర్లు బెయిల్ కోసం ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. వైఎస్సార్ సీపీ హయాంలో మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థను మాన్యువల్ విధానంలోకి తీసుకువచ్చారని, ఇందులో మిథున్ రెడ్డి పాత్రే కీలకమనే ఆరోపణలు ఉన్నాయి.ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. ఏ1 ధనుంజయ రెడ్డి, ఏ32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ 33 బాలాజీ గోవిందప్ప ఇప్పటికే బెయిల్ కోసం పిటిషన్లు దాఖలు చేశారు. అయితే ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలంటూ సిట్‌కు ఆదేశాలు జారీ చేసి,

## మెట్రో ప్రాజెక్టులకు నేడు టెండర్లు

- మెట్రో టెండర్లకు పచ్చజెండా
- విశాఖలో మూడు కారిడార్లు
- 2 నగరాలకూ భారీ ప్రాజెక్టు
- తొలి దశకు 40% పనుల టెండర్లు
- విశాఖ మెట్రోకు రూ.11,498 కోట్లు
- విజయవాడ మెట్రోకు రూ.10,118 కోట్లు
- కేంద్ర-రాష్ట్ర 50:50 వాటా

2



అమరావతి-నవభూమి ప్రతినిధి

ఏపీలో కీలక మెట్రో ప్రాజెక్టులకు మరో ముందడుగు పడింది. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు శుక్రవారం టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం పనులకు తొలుత టెండర్లు పిలవనుంది. మొత్తం రూ.21,616 కోట్లతో ఈ రెండు ప్రాజెక్టులకు టెండర్లు ఆహ్వానించనున్నారు.విశాఖ మెట్రో రైలుకు రూ.11,498 కోట్లతో, విజయవాడ మెట్రోకు రూ.10,118 కోట్లతో టెండర్లు పిలవనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు జరగనున్నాయి. విశాఖ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద వీఎంఆర్డీఏ నుంచి రూ.4,101 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. విజయవాడ మెట్రోకు సీఆర్డీఏ నుంచి రూ.3,497 కోట్లు కేటాయించనున్నారు.తొలిదశ డీపీఆర్?కు ప్రభుత్వం ఆమోదం : విశాఖ, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుల తొలిదశ డీపీఆర్?కు ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖ తొలిదశలో 46 కిలోమీటర్ల మేర 3 కారిడార్లను నిర్మించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఒకటో కారిడార్, గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు 2వ కారిడార్, తాడిచెట్లపాలెం నుంచి చినవాల్తేర్



# తెలంగాణలో చేపట్టిన సర్వే దేశానికి ఆదర్శం కావాలి: ఖర్గే

ఢిల్లీ: తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి కృతజ్ఞతలు తెలిపారు మల్లికార్జున ఖర్గే. కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్(%ఆ%)లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని స్పష్టం చేశారు మల్లికార్జున ఖర్గే.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా%ూ% కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్గహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు

## నవ వార్త




# నిజాం కాలం నాటి భూ సమస్యలకు చెక్..

### ఆ 5 గ్రామాలకు త్వరలో నక్షా మ్యాపులు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షా మ్యాపులు లేని 413 గ్రామాలకు శుభవార్త. ఈ గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వే విజయవంతంగా పూర్తయిందని, త్వరలోనే ఆయా గ్రామాలకు సర్వే బౌండరీ చట్టం ప్రకారం నక్షా మ్యాపులు సిద్ధం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయంతో దశాబ్దాలుగా నక్షా లేని భూములకు స్పష్టమైన హద్దులు ఏర్పడనున్నాయి. బుధవారం సచివాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి లోకేశ్‌కుమార్, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ విభాగం కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతులతో కలిసి మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రీసర్వే చేపట్టిందని తెలిపారు. జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్‌నగర్, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ గ్రామాల్లో డ్రోన్/ఏరియల్ వ్యూ, 'ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్' పద్ధతుల్లో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం భూయజమానులకు నోటీసులు జారీ చేసి, గ్రామసభల ద్వారా యజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులు ఖరారు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. తొలి విడతగా.. పై ఐదు గ్రామాలకు నక్షా మ్యాపులు రూపొందిస్తామన్నారు. భూముల అమ్మకం, కొనుగోలు సమయంలో సర్వే మ్యాప్‌ను కచ్చితంగా జత చేయాలన్న నిబంధనతో పాటు, భూభారతి చట్టం ప్రకారం భూములకు భూధార్ నంబరు కేటాయింపును ఈ ఐదు గ్రామాల్లో అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఐదు గుంటలకు పైగా ఉన్న భూములకు కొత్త సర్వే నంబర్లు ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలను కూడా నమోదు చేస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ చర్యలన్నీ భూ రికార్డుల ప్రక్షాళనకు, భూ లావాదేవీలలో పారదర్శకతకు దోహదపడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# కేటీఆర్‌కు సీఎం రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ) హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అన్నయ్యకు జన్మదిన శుభాకాంక్షలు..కేటీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. అన్నయ్య.. కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# 6 పాకిస్థాన్ డ్రోన్లను కూల్చేసిన భారత్!

**(1వపేజీ తరువాయి**విషయాలను మీడియాకు వెల్లడించారు. బుధవారం రాత్రి భారత్ భూభాగంలోకవస్తున్నట్లు అనుమానాస్పద వస్తువులు ఎగిరివస్తున్న గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది.. వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ సమయంలోనే పాకిస్థాన్ కు చెందిన డ్రోన్లు భారత్ వైపు దూసుకొస్తున్నట్లు గుర్తించారు. అనంతరం కౌంటర్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా.. మోథే సమీపంలో 5 డ్రోన్లను నేల కూల్చారు. మరోవైపు గురువారం తెల్లవారు జామున అట్టారీ గ్రామానికి సమీపంలో మరో డ్రోన్ ను కూల్చివేసినట్లు తెలిపారు. దీని నుంచి రెండు మ్యాగజైన్స్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం తర్న్ తరన్ జిల్లాలోని దాల్ గ్రామం సమీపంలో జరిగిన మరొక సంఘటనలో వరి పొలం నుండి ఒక పిస్టల్, ఒక మ్యాగజైన్ ను స్వాధీనం చేసుకున్నారు!

# ముగ్గురు పిల్లలను కంటే కూటమి బంపర్ ఆఫర్!

**(1వపేజీ తరువాయి)** అమెరికా తర్వాత ఆంధ్రప్రదేశ్ లోనే.. కూటమి సర్కారు ప్రయత్నాలు ఫలిస్తున్నట్లే... ఇక గతంలో అయితే ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు అని చట్టం చేశారు. దానికి ఇపుడు ఏపీ సర్కార్ సవరించింది. పైగా ఎందరు పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చు అంది. ఇపుడు మరిన్ని ప్రోత్సాహకాలు కూడా ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఎవరు ఎక్కువ మంది పిల్లలను కంటే వారే దేశభక్తులు అని కూడా చంద్రబాబు చెబుతున్నారు అంతే కాదు ఎక్కువ మంది పిల్లలు కనేలా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ముసాయిదా మీద ప్రభుత్వ గట్టిగానే కసరత్తు చేస్తోంది. ఈ ముసాయిదా చూస్తే అనేక అంశాలు ఉన్నాయి. ముగ్గురు పిల్లలను కంటే ఏకంగా ఆస్తి పన్ను నుంచి మినహాయించాలని ప్రభుత్వం ప్రోత్సాహం తేబోతోంది. అంతే కాదు రాష్ట్రంలో సంతానోత్పత్తి విషయంలో ఇబ్బంది పడుతున్న దంపతులు 12 శాతంగా ఉన్నారని అంటున్నారు. అలాంటి వారికి ఐవీఎఫ్ చికిత్స ఖర్చును ప్రభుత్వమే తానుగా భరించాలని నిర్ణయించింది దాంతో వారు కూడా బిడ్డలను కనేందుకు ఆస్కారం ఉంటుంది. అంతే కాదు మాతృత్వ సెలవులను ఏకంగా ఆరు నెలల నుంచి పన్నెండు నెలలకు పెంచాలని కూడా ముసాయిదాలో సిఫార్సు చేస్తున్నారు. అలాగే తల్లులకు వర్క్ ఫ్రం హెూం సౌకర్యం కల్పించాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది అని అంటున్నారు ఇక మూడవ బిడ్డను కంటే వారి పేరున యాభై వేల రూపాయలను ఇస్తారు. నాలుగో బిడ్డను కంటే కూడా ఇదే విధంగా సొమ్ము చెల్లిస్తారు, ఆర్థికంగా ఆదుకుంటారు. పిల్లల కోసం క్రెచ్‌లు పెట్టాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం మీద ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రజలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలైన నిర్ణయాలను తీసుకుంటోంది. ఏపీలో చూస్తే దారుణంగా సంతానోత్పత్తి రేటు పడిపోయింది. గతంలో 2.1గా ఉన్న సంతానోత్పత్తి రేటు కాస్తా 1.5కి దిగజారింది. ఇది ఆందోళన కలిగించే విషయంగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరో పాతికేళ్ళకు అంటే 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధులు మాత్రమే ఎక్కువ మంది ఉంటారు. ఏకంగా వారి సంఖ్య 23 శాతంకి చేరే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంటే ప్రతీ నలుగురులో ఒకరు వృద్ధులు అన్న మాట. దాంతోనే కూటమి ప్రభుత్వం ఈ రకమైన చర్యలకు దిగుతోంది అని అంటున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భారీ షాక్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదవారి సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళు మంజూరు చేశారు. ఇవన్ని ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఓ వార్త లబ్ధిదారులకు ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం ఇప్పటి వరకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో.. సుమారుగా 20 వేల ఇండ్లను రద్దు చేశారని తెలుస్తోంది. మరి ఎందుకు ఇంత భారీ సంఖ్యలో ఇళ్లను రద్దు చేశారంటే..ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రోజుకొక నిబంధనను అమలు చేస్తుందంటున్నారు లబ్ధిదారులు. ఇప్పటికే ఆగస్టు 1 నాటికి ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే.. అలాంటి లబ్ధిదారులు ఇళ్లను రద్దు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు అధికారులు కూడా క్షేత్రస్థాయిలో మార్గదర్శకాలను పట్టించుకోకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నియమాల ప్రకారం.. నిర్మాణ వైశాల్యం (బిల్టప్ ఏరియా) గరిష్ఠంగా 650 చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఉండాలని చెబుతుంది. అంతకన్నా తక్కువ వైశాల్యంలో ఇంటి నిర్మాణం చేపడితే.. అలాంటి వారికి నిధులు మంజూరు చేసేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణం ప్రారంభించాక రద్దు.. అయితే ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చినప్పుడు వీటిని పట్టించుకోని అధికారులు.. ఇప్పుడు నిర్మాణాలు మొదలు పెట్టాక.. నియమాలు పాటించడం లేదని చెప్పి నిర్మాణం మొదలు పెట్టిన ఇళ్లను రద్దు చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు రాష్ట్రంలో సుమారు 20 వేల ఇండ్లను రద్దు చేశారని తెలుస్తోంది. ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని చాలా మంది ఉన్న ఇంటిని కూల్చి.. కొత్తింటి నిర్మాణం మొదలుపెట్టారు. పనులు మధ్యలో ఉండగా.. ఇప్పుడు అధికారులు.. వారి ఇల్లు నిబంధనలకు అనుగుణంగా లేదని చెప్పి.. రద్దు చేస్తుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు లక్షల ఇండ్లను మంజూరు చేయగా.. సుమారు సగం మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. వీరిలో కొందరికి మొదటి విడత నిధులను కూడా విడుదల చేశారు. ఇలా ఇప్పటివరకు అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ.120 కోట్ల వరకు జమ చేశారు. ఇలా ఉండగానే.. నిర్మాణాలు చేపట్టిన వాటిలో దాదాపు 20 వేలకు పైగా ఇండ్లు నిబంధనలకు అనుగుణంగా లేవంటూ రద్దు చేశారు.

కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన పీఎంఏవై పథకంతో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్‌ను అనుసంధానం చేసుకొని ఇండ్లను మంజూరు చేయాల్సి ఉంది. కానీ అధికారులు హడావుడిగా ఇంటి మంజూరు పత్రాలు జారీ చేశారు. తీరా నిర్మాణం మొదలు పెట్టాక.. నిబంధనలు పాటించడం లేదని రద్దు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపం వల్ల ఈ సమస్య తలెత్తింది అంటున్నారు. అలానే కేంద్ర నిబంధనలు పట్టించుకోకుండా ఇళ్లను రద్దు చేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్ర నిబంధనలు ఎలా ఉన్నాయంటే..

ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) నిబంధనల ప్రకారం.. కార్పెట్ ఏరియా (గోడలు, బాల్కనీలు తప్ప లివింగ్ ఏరియా) కనీసం 30-45 చదరపు మీటర్ల వరకు ఉండాలని చెబుతుంది. దీని ప్రకారం చూసుకుంటే 322-484 చదరపు అడుగల వరకు ఇంటిని నిర్మించుకోవచ్చు. స్థలం తక్కువుంటే పైఅంతస్తులో ఒక గది నిర్మించుకునే అవకాశం ఉన్నది. కానీ అధికారులు వీటిని పట్టించుకోకపోవడం వల్ల లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

# తెలంగాణలో మరో కొత్త రైల్వే లైన్..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ట్రైన్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్. రాష్ట్రంలో మరో ట్రైన్ లైన్ అందుబాటులోకి రానుంది. రాజధాని హైదరాబాద్‌కు ట్రైన్ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివారు పటాన్‌చెరు-ఆర్మూర్-ఆదిలాబాద్ నూతన రైల్వే లైన్ పనుల ప్రారంభానికి కేంద్ర రైల్వే శాఖ రెడీ అయింది. ఈ కొత్త లైన్ మంజూరైందని, దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (%ఞూ=%) తుది దశకు చేరుకుందని తాజాగా కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ వాసులు హైదరాబాద్ నగరానికి చేరుకోవడానికి డిచ్‌పల్లి, కామారెడ్డి, అక్కన్నపేట, మీర్జాపల్లి, బొల్లారం, సికింద్రాబాద్ మీదుగా సుదీర్ఘంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. అలాగే, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రలోని కిన్వట్, సహస్రకుండ్, హిమాయత్‌నగర్, ముద్కేడ్, ఉమ్రి మీదుగా తిరిగి నిజామాబాద్ చేరుకోవడానికి 231 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఆదిలాబాద్-ఆర్మూర్ మీదుగా కొత్త మార్గం నిర్మిస్తే సుమారు 72 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనివల్ల ప్రయాణ సమయం, ఖర్చు గణనీయంగా ఆదా అవుతుంది. ఈ నూతన ప్రాజెక్టు గత రెండు, మూడేళ్లుగా చర్చలో ఉన్నా, తాజాగా రైల్వే శాఖ మంత్రి లేఖతో ఆశలు మళ్లీ చిగురించాయి. పూర్తయిన తర్వాత రైల్వేబోర్డు, కేంద్ర కేబినెట్ ప్రాజెక్టును ఆమోదించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించిన అనంతరం పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఆదిలాబాద్-ఆర్మూర్-పటాన్‌చెరు వరకు నిర్మించనున్న ఈ కొత్త ట్రైన్ మార్గం మొత్తం పొడవు 250 కిలోమీటర్లు కాగా... ఇది నిర్మల్, నిజామాబాద్, బోధన్, సంగారెడ్డి ప్రాంతాలను కలుపుకొని వెళ్లనుంది. ఈ మార్గంలో కొత్త రైల్వే స్టేషన్లను కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ నూతన రైలు మార్గం ఆయా ప్రాంతాలతో పాటు, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర వాసులకు కూడా హైదరాబాద్ ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తుంది. దాంతో పాటుగా ఆయా ప్రాంతాలు పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందుతాయి.

# యూకే-భారత్ వాణిజ్య ఒప్పందం

**(1వపేజీ తరువాయి)**సరళతరమైన వాణిజ్య విధానాలతో ఇరుదేశాలు పరస్పరం ఎగుమతి, దిగుమతులను ప్రోత్సహించనున్నాయి. ఈ డీల్? దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు రెక్కలు తొడుగుతుందని భారత్ భావిస్తోంది. ఈ డీల్‌తో ప్రధానంగా భారత్‌లోని చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరుతుందని పరిశీలకులు అంటున్నారు. పన్నుల బాధ లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేసేందుకు భారత్‌కు అవకాశం లభిస్తుంది. దీనివల్ల భారతీయ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మెరుగైన రేట్లు దక్కుతాయి. నాణ్యతతో పాటు నిల్వకాలం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు, ధాన్యాలను పండించే అన్నదాతలకు లాభాలు పండుతాయి. రసాయనాలు, క్రిమి సంహారకాలు లేకుండా, సంప్రదాయక పద్ధతులతో పండించే పంటలకు యూకే మార్కెట్‌లో ఆకర్షణీయమైన రేట్లు లభిస్తాయి. ఈ గొప్ప అవకాశాన్ని భారతీయ రైతులు, ఎగుమతిదారులు అందిపుచ్చుకోవచ్చు. ఇప్పటికే పలు ఈయూ దేశాలు, జర్మనీ, నెదర్లాండ్స్‌కు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసి భారత వ్యాపారులు మంచి లాభాలను గడిస్తున్నారు. ఈ జాబితాలో ఇక నుంచి యూకే కూడా చేరనుంది.

**ఈ పంటలపై సుంకాల్లేవ్**

ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పసుపు, మిరియాలు, యాలకులు, మామిడి గుజ్జు, పచ్చళ్లు, పప్పులు వంటి వాటిపై ఇక నుంచి యూకే సుంకాలు విధించదు. దీనివల్ల ఆయా ఉత్పత్తులపై భారత రైతులు, ఎగుమతి వ్యాపారులకు ఆకర్షణీయ లాభాలు లభిస్తాయి. ఈ విభాగాల్లో వీలైనంత మేర ఎగుమతులను పెంచుకొని, లాభాలను పెంచుకునే అవకాశం దక్కుతుంది.

**పెద్ద మార్కెట్, భారీ ప్రయోజనం**

భారత్‌కు చెందిన దాదాపు 95 శాతానికిపైగా వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి సుంకాన్ని యూకే విధించదు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పచ్చళ్లు, మసాలా పొడులు, పండ్ల గుజ్జులు, రెడీ టు ఈట్ మీల్స్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్ వంటివన్నీ ఈ కేటగిరిలోకి వస్తాయి. పన్నులు లేకపోవడంతో, వీటిని యూకేకు ఎగుమతి చేసే ఖర్చు తగ్గిపోతుంది. ఫలితంగా వీలైనంత తక్కువ రేటుకే వాటిని యూకే మార్కెట్‌లో విక్రయించే అవకాశం కలుగుతుంది. తద్వారా యూకే వ్యాపారులు, రిటైల్ చైన్ల నుంచి భారత్‌కు ఆర్డర్లు పెరిగిపోతాయి. ఈ మార్పు భారత్‌లో వ్యవసాయ రంగానికి దన్నుగా నిలుస్తుంది. గ్రామీణ స్థాయిలో ఎంతోమందికి కొత్తగా ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి.

**ఈ ఉత్పత్తులకు ఒప్పందం నుంచి మినహాయింపు**

యూకేతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే క్రమంలో భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. భారత రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పలు ఉత్పత్తులను ఈ డీల్ నుంచి మినహాయించింది. అంటే వాటిపై ఇకపైనా ఇరుదేశాలు పరస్పరం పన్నులను విధించుకోవచ్చు. ఈ జాబితాలో డైరీ ఉత్పత్తులు, యాపిల్స్, ఓట్స్, వంట నూనెలు వంటివి ఉన్నాయి. వీటిపై పన్నుల విధింపు విషయంలో ఎలాంటి మినహాయింపులూ ఉండవు. దేశంలో ఆహార భద్రత, ధరల నియంత్రణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ వ్యూహాన్ని భారత్ అనుసరించింది. ఉదాహరణకు భారత్ నుంచి యూకేకు యాపిల్స్ ఎగుమతి అవుతుంటాయి. వీటిపై పన్నులను కొనసాగించడం వల్ల భారత ప్రభుత్వానికి ఏటా నిర్దిష్ట ఆదాయం లభిస్తుంది. యాపిల్స్‌పై ఎగుమతి సుంకాన్ని ఎత్తేస్తే, ప్రభుత్వానికి ఇక ఆదాయం రాదు. దీంతోపాటు భారత్‌లో యాపిల్స్ కొరత ఏర్పడి, ధరలు పెరిగిపోతాయి. దీనివల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. ఇలాంటి ప్రతికూల పరిణామాలు జరగకూడదనే ఉద్దేశంతో పలు వ్యవసాయ ఉత్పత్తులను స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నుంచి భారత్ మినహాయించింది.

**100 బిలియన్ డాలర్ల లక్ష్యం సాకారం**

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల భారత్ నుంచి యూకేకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతులు చేయాలనే భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ డీల్ బాటలు వేస్తుంది. పన్నులు లేకపోవడంతో, రాబోయే మూడేళ్లలో యూకేకు భారత వ్యవసాయ ఎగుమతులు దాదాపు 20 శాతం మేర పెరిగే అవకాశం ఉంది.

**సర్టిఫికేషన్ ఇక ఈజీ**

ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇక నుంచి ఈజీగా యూకే మార్కెట్‌లోకి ఎంట్రీ లభిస్తుంది. ఆయా వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌లతో ముడిపడిన నిబంధనలను సరళతరం చేశారు. దీనివల్ల యూకేకు చేరాక వాటి తనిఖీ సమయం తగ్గిపోతుంది. పన్నులు లేకపోవడంతో ఎగుమతి వ్యయం దిగి వస్తుంది.

సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు భలే గిరాకీ

పనస పండు, మిల్లెట్లు, కూరగాయలతో పాటు సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పసుపు, మిరియాలు, అల్లం, కొత్తిమీర, మెంతికూర, జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, జాజికాయలకు యూకేలో భారీ డిమాండ్ ఉంది. వీటిని పండించే భారతీయ రైతులకు ఇక మంచి రోజులు మొదలైనట్టే. నిర్ణీత స్టాక్‌ను నిర్వహిస్తూ, యూకేకు వీటిని ఎగుమతి చేసి రైతులు, ఎగుమతి వ్యాపారులు లాభాలను గడించొచ్చు. దేశీయ మార్కెట్‌లో వీటి ధరలు తక్కువగా ఉన్నప్పుడు, యూకేకు ఎగుమతి చేసి లాభాలను అందుకోవచ్చు.

**ఫిషరీస్ రంగానికి అపార అవకాశాలు**

ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని ఫిషరీస్ రంగానికి మంచి రోజులు మొదలైనట్టే. విదేశాల నుంచి యూకే ఏటా 5.4 బిలియన్ డాలర్లు విలువైన సముద్ర ఆహారాన్ని దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుతం ఇందులో భారత్ ఎగుమతుల వాటా కేవలం 2.25 శాతమే. ఈ పెద్ద మార్కెట్‌లో ఇకపై పన్నులు లేకుండా, వ్యాపారాన్ని మరింతగా పెంచుకునే ఛాన్స్ భారత ఫిషరీస్ రంగానికి దక్కనుంది. ఇప్పటివరకు భారత్ నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలు, ట్యూనా చేపలపై యూకే 4.2 శాతం నుంచి 8.5 శాతం దాకా సుంకాలు విధించేది. ఇకపై ఈ ఉత్పత్తులపై సుంకాలేం ఉండవు. చేపలు, రొయ్యలు, కోళ్లకు దాణాగా వేసే ఫిష్ మీల్ పౌడర్‌పైనా ఇక నుంచి యూకే ట్యాక్స్ విధించదు. వీటి ఎగుమతులను పెంచుకొని రైతులు, వ్యాపారులు లాభపడొచ్చు.

# తెలంగాణలో కుండపోత వానలు..

**(1వపేజీ తరువాయి)**మిగిలిన జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా అప్పుడప్పుడు జల్లులు పడే అవకాశం ఉందన్నారు. బుధవారం ఉదయం నుంచే నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా హైదరాబాద్ నగరంలో వర్షం కురుస్తోంది. వాతావరణ శాఖ సూచనల మేరకు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూం అవకాశం కల్పించాలని పోలీసులు ఐటీ సంస్థలకు సూచించారు. తెలంగాణలో బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఖమ్మం, మెదక్, నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో భారీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో అనేక చోట్ల రోడ్లు తెగిపోయాయి. వరిపొలాలు నీటమునిగాయి. ముఖ్యంగా ములుగు జిల్లా వెంకటాపురంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఏకంగా 46.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

# మాజీ మంత్రి మల్లారెడ్డికి బిగ్ షాక్.. ఐటీ సోదాలు !

**(1వపేజీ తరువాయి)**ఆదాయ పన్నులో హెచ్చుతగ్గులను గుర్తించడం వంటి అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మల్లారెడ్డి కుటుంబానికి చెందిన పలు ప్రాపర్టీల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆయన కోడలు ప్రీతి రెడ్డి, కొడుకు భద్రారెడ్డి నివాసాల్లో ఐటీ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. అయితే ఈ సోదాలపై అధికారిక సమాచారం ఇంకా బయటకు రావాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని ప్రదేశాల్లో కూడా జరుగుతున్నట్టు తెలుస్తోంది. మల్లారెడ్డి కుటుంబానికి చెందిన విద్యాసంస్థల్లో నిధుల లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారని అంటున్నారు. కాగా గతంలో కూడా మల్లారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లు, ఆఫీసు లలో సోదాలు జరిగిన విషయం తెలిసిందే.

# మెట్రో ప్రాజెక్టులకు నేడు టెండర్లు

**(1వపేజీ తరువాయి)**వరకు 6 కిలోమీటర్లు 3వ కారిడార్ నిర్మించనున్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం వరకు 30 కిలోమీటర్లు మరో కారిడార్ నిర్మించనున్నారు. అలాగే విజయవాడ మెట్రో రైల్ రెండు దశలుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి దశలో రెండు కారిడార్?లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో కారిడార్ 1ఏగా గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ, కారిడార్ 1బిగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మెట్రోరైల్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కారిడార్ 3గా పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి వరకూ ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. మొదటి దశ కారిడార్ 1ఏ, 1బి లను 38.4 కిలోమీటర్ల మేర నిర్మించాలని డీపీఆర్?లో ప్రతిపాదించారు. ఇక రెండో దశలో నిర్మించే మూడో కారిడార్?ను 27.5 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించారు. విశాఖ మెట్రోకు రూ.6,100 కోట్లు, విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించారు. తక్కువ వడ్డీకి లోన్ ఇచ్చే బ్యాంకులతో మెట్రో కార్పొరేషన్ ఎండీ సంప్రదింపులు జరిపారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో విదేశీ బ్యాంకుల ప్రతినిధులు చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు శుక్రవారం టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# కేబినెట్ సమావేశం కీలక నిర్ణయం

## లక్ష ఉద్యోగాల లక్ష్యం

**(1వపేజీ తరువాయి)**గతంలో అమరావతి రాజధానిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం ముందుకు వచ్చిందని.. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఆ కంపెనీ నిర్వాహకులను అప్పటి సీఎం జగన్ వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కంపెనీ నిర్వాహకులపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసిందని ధ్వజమెత్తారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులపై కేసు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేశారని.. దీంతో వాళ్లు ఏపీపై పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సింగపూర్‌తో సంబంధాలు అన్నింటిని కూడా జగన్ చెడగొట్టారని.. అందుకనే వాళ్లతో మళ్లీ మన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు సీఎం చంద్రబాబు.

సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులు సీడ్ క్యాపిటల్ మినహా ఏ ప్రాజెక్ట్ అయినా చేపడతామని అంటున్నారని సీఎం గుర్తుచేశారు. 2024 నుంచి 2025 సంవత్సరానికి నీటి పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తిరుపతి తొక్కిసలాటపై జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఇచ్చిన కమిషన్ నివేదికపై చర్చించారు. ఇరువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రి మండలి ఆదేశాలు జారీ చేసింది. గో సంరక్షణ అధికారి, మరో డీఎస్పీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది. కాగా, అప్పటి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుకి క్లీన్ చిట్ ఇచ్చింది ఏక సభ్య కమిషన్. భవనాల క్రమబద్ధీకరణ విషయంలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని, అలాగే ఒక స్పష్టమైన చట్టం తేవాలని కేబినెట్ భావించింది. ఈ సారి క్రమబద్ధీకరణ చేసిన తర్వాత చట్టం తీసుకువచ్చి భవిష్యత్‌లో ఏలాంటి అక్రమ నిర్మాణాలు చేయకుండా చూడాలని నిర్ణయించింది కేబినెట్. ఇలా ఎన్ని రోజులు క్రమబద్ధీకరణ చేసుకుంటూ వెళ్తామని కేబినెట్‌లో వ్యాఖ్యానించారు మంత్రి నాదెండ్ల మనోహర్. అందువల్లే మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుందామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు

**(1వపేజీ తరువాయి)**తదుపరి విచారణను జూలై 29కి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో విచారణను వేగవంతం చేసిన సిట్ పలువురికి నోటీసులు కూడా పంపింది. ఈ క్రమంలోనే శ్రావణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి ఇవాళ నోటీసులు అందించారు. పీఎంఎల్ఏ చట్టం కింద కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జూలై 28 ఉదయం 10 గంటల 30 నిమిషాలకు హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో హాజరు కావాలంటూ స్పష్టం చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి ఆంధ్రా గోల్డ్ బ్రాండ్ భారీగా కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

# అది ఇస్తే.. నీ భార్యను తిరిగి తీసుకొస్తా.. తాంత్రికుడి మాటలు నమ్మి భర్త దారుణం.!






**అల్వార్-నవభూమి:**రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తన భార్య కోసం ఓ భర్త అతి దారుణానికి ఒడిగట్టాడు. తాంత్రికుడి మాటలు గుడ్డిగా నమ్మి సొంత మేనల్లుడిని హత్య చేశాడు. అసలేం జరిగిందంటే..ముండావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారాయ్ కాలా గ్రామంలో యువకుడు మనోజ్ కుమార్‌కు పెళ్లి అయింది. అయితే, అతడి భార్య కొంత కాలానికే అతడి నుండి విడిపోయి తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను తిరిగి ఇంటికి తీసుకొచ్చేందుకు భర్త ఎన్ని ప్రయత్నాలు చేసినా భార్య తన దగ్గరకు వెళ్లేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఎలాగైనా సరే తన భార్య తన దగ్గరకు వచ్చేలా చేయాలని భర్త స్థానిక తాంత్రికుడు సునీల్‌ను ఆశ్రయించాడు.అయితే, ఆ తాంత్రికుడు తనకు రక్తం, లివర్ ఇస్తే నీ భార్య నీ దగ్గరకు వచ్చేలా చేస్తానని భరోసా కల్పించాడు. దీంతో ఆ భర్త తాంత్రికుడి మాటలు గడ్డిగా నమ్మి తన 6 ఏళ్ల మేనల్లుడు లోకేష్‌ను బలి చేశాడు. మనోజ్, లోకేష్‌ను ఓ పాడుబడిన ఇంటికి తీసుకెళ్లి, ముందుగా గొంతు కోసి హత్య చేశాడు. తర్వాత ఇంజెక్షన్లతో శరీరం నుండి రక్తం, కాలేయాన్ని తీయడానికి ప్రయత్నించాడు కానీ కుదరలేదు. తరువాత, మృతదేహాన్ని గడ్డి కుప్పలో దాచి ఉంచాడు. తాంత్రికుడికి తర్వాత శరీర భాగాలు తీసుకెళ్లాలని ప్లాన్ చేశాడు. ఈ ఘటన జూలై 19 రాత్రి జరిగింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శుక్రవారం
25 । జులై । 2025

## చెన్నైలో 4 చోట్ల ఏసీ బస్‌స్టాప్‌లు



**చెన్నై-నవభూమి:**చెన్నై నగరంలో నాలుగు చోట్ల కొత్తగా ఏసీ బస్‌స్టాపులు నిర్మించనున్నట్లు సీఎండీఏ ఉన్నతాధికారులు తెలిపారు. కొళత్తూరు, రాయపురం, పెరంబూరు, వాల్‌టాక్స్‌రోడ్డు ప్రాంతంలో ఈ ఏసీ బస్‌స్టాపులను నిర్మిస్తామన్నారు. సిటీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎండవేడి తగలకుండా, అసౌకర్యానికి గురికాకుండా నగరంలోని కత్తిపారా జంక్షన్ సమీపం ఆలందూరు వద్ద, సెయింట్ థామస్ మౌంట్ తదితర ప్రాంతాల్లో ఏసీ బస్‌స్టాపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.8 కోట్లతో ఈ నాలుగు కొత్త బస్‌స్టాప్‌లను నిర్మించనున్నామని అధికారులు పేర్కొన్నారు. కొళత్తూరు, రాయపురం, వాల్‌టాక్స్ రోడ్డు ప్రాంతాల్లో నిర్మించనున్న ఏసీ బస్‌స్టాప్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు 78 సీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పెరంబూరు వద్ద నిర్మించే బస్‌స్టాప్‌లో 54 మంది ప్రయాణికులకు సీటింగ్ సదుపాయం కల్పించనున్నామని తెలిపారు. ఈ నాలుగు ఏసీ బస్‌స్టాప్?ల నిర్మాణం పూర్తయిన తర్వాత నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏసీ బస్‌స్టాప్‌లను నిర్మిస్తామని అధికారులు వివరించారు.

## భర్తను హత్య చేయించిన మరో భార్య.. బయటపెట్టిన మూడేళ్ల కూతురు..



**చెన్నై-నవభూమి:** నానాటికీ మానవ సంబం ధాలు తీసికట్టుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆలుమగల మధ్య అక్రమ సంబంధాలు చిచ్చు పెడుతున్నాయి. పరాయి వ్యక్తి మోజులో పడి భర్తను కడతేరుస్తున్న భార్యల సంఖ్యలు రోజుకు మూడు లేదా నాలుగైనా వెలుగు చూస్తున్నాయి. అలాంటి దారుణ ఘటనే తమిళనాడులో సంచలనం రేపుతోంది. మా నాన్నను అలా చేసింది ఆ అంకులే అని మూడేళ్ల కుమార్తె ఇచ్చిన సమాచారంతో తల్లి గుట్టు రట్టయ్యింది.వేలూరు జిల్లా కుప్పంపాళ్యానికి చెందిన భారత్(36)కు, ఐదేళ్ల కిందట బెంగళూరుకు చెందిన నందిని(26)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. భారత్ చెన్నైలో ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వారానికి ఒకరోజే ఇంటికొచ్చి వెళ్తుంటాడు. భర్త దూరంగా ఉండటంతో ఎదురింట్లో ఉన్న సంజయ్(21) అనే యువకుడి పట్ల ఆకర్షితురాలైంది నందిని. ఇద్దరూ గుట్టుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా.. ఒకనాడు భారత్ కు విషయం తెలిసింది. ఆ తర్వాత కూడా పలుమార్లు పద్ధతి మార్చుకోమని హెచ్చరించాడు. అయినా నందిని భర్త మాటలు తలకెక్కించుకోలేదు. ప్రేమ మత్తులో పడిన నందిని భర్తను చంపేందుకు ప్రియుడు సంజయ్ తో కలిసి కుట్ర పన్నింది.

## విజయం తర్వాతే.. సంకీర్ణ ప్రభుత్వంపై నిర్ణయం



**వేలూరు(చెన్నై)-నవభూమి:** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం సంకీర్ణ ప్రభుత్వంపై అమిత్ షా, ఎడప్పాడి పళనిస్వామి కలిసి నిర్ణయం తీసుకుంటారని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్‌తెలిపారు. స్థానికంగా ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం వచ్చిన తమిళిసై మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ నిధులు వెచ్చించి'ఉంగళుడన్ స్టాలిన్' పేరుతో డీఎంకే ఎన్నికల ప్రచారం చేపట్టిందని ఆరోపించారు. నాలుగేళ్లలో చేయని పనులు 45 రోజుల్లో చేస్తున్నట్లు ప్రచార ఆర్భాటంలో తెలుపుతున్నారన్నారు.ఉంగళుడన్ స్టాలిన్ కార్యక్రమంలో అవినీతి జరుగుతోందన్నారు. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రజల నుంచి లంచాలు ఆశిస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గంగై కొండ చోళవందాన్ రావడం గౌరవంగా భావిస్తున్నామన్నారు ప్రధాని పర్యటన బీజేపీ శ్రేణులకు మరింత ఉత్తేజం అందిస్తుందన్నారు. సీమాన్, విజయ్ తదితరులు కూటమిలోకి రావాలని పళనిస్వామి ఆశిస్తున్నారని, బీజేపీ-అన్నాడీఎంకే కూటమిలో ఎలాంటి భేధాభిప్రాయాలు లేవన్నారు.రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందని ఆమె తెలిపారు. డీఎంకే కూటమిలో తిరుమావళవన్, కార్తీ చిదంబరం, సెల్వపెరుందగై, కమ్యూనిస్ట్ నేతలు తమకు ఎన్ని సీట్లు ఇస్తారు అని బెదిరిస్తున్నారన్నారు. గ్రూప్-4 పరీక్షల్లో అవతవకలు జరిగాయని అన్నాడీఎంకేలాగే బీజేపీ కూడా అభిప్రాయ పడుతుందన్నారు. ఉప రాష్ట్రపతి రాజీనామాపై అభిప్రాయం తెలియజేయడం లేదని, రాష్ట్రానికి చెందిన వారు ఉప రాష్ట్రపతిగా రావాలని కోరుకుంటున్న తరుణంలో, ఈ రేసులో తాను లేనని తమిళిసై తెలిపారు.

## బై.. బై.. స్టాలిన్.. మిమ్మల్ని ప్రజలే ఇంటికి సాగనంపుతారు

**చెన్నై-నవభూమి:** రాష్ట్రంలో గత నాలుగేళ్ళకు పైగా కొనసాగుతున్న ప్రజావ్యతిరేక డీఎంకే ప్రభుత్వాన్ని మరో 9 నెలల్లో ప్రజలే ఇంటికి సాగనంపుతారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈ నెల 7వ తేదీన ప్రారంభించిన తొలి ప్రచారయాత్ర బుధవారం తంజావూరు జిల్లా వరత్తనాడులో ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈపీఎస్ ఆ ప్రాంతంలోని రైతులు, వ్యాపారులు, కులవృత్తుల సంఘాల నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అన్నాడీఎంకే రైతు సంఘం తరుపున కానుకగా సమర్పించిన నాగలి స్వీకరించారు. సాయంత్రం జరిగిన బహిరంగ సభలో కార్యకర్తలు బహూకరించిన టోపీ ధరించి ప్రసంగించారు. వరి సాగుకు పేరొందిన తంజావూరు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఓ రైతుగా తెలుసుకున్నానని, ఉత్పత్తి అధికంగావున్న సమయంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కలిసి వరిపంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, అయితే డీఎంకే ప్రభుత్వం ఈ వ్యవహారంలో కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించి అన్నదాతలకు న్యాయం చేయలేక చతికిలబడిందని విమర్శించారు.వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ప్రజల అండదండలతో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారం చేపడుతుందని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

# 12 మంది నిర్దోషులంటూ ఇచ్చిన తీర్పుపై సుప్రీం స్టే..



**ముంబయి-నవభూమి:** 2006 ముంబయి రైలు పేలుళ్ల కేసులో న్యాయం కోసం సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న బాధితుల ఆశలు చిగురించాయి. ఈ కేసులో 12 మంది నిందితులను నిర్దోషులుగా తేల్చి.. రెండ్రోజుల క్రితమే వారిని బాంబే హైకోర్టు విడుదల చేసింది. అయితే ఈ తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. ముఖ్యంగా హైకోర్టు ఆదేశాలతో విడుదల అయిన నిందితులను మళ్లీ అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూనే.. మహారాష్ట్ర సర్కారు అప్పీల్‌పై ప్రతిస్పందన ఇవ్వాలని తేల్చి చెప్పింది.

భారతదేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఉగ్రదాడులలో ఒకటిగా నిలిచి ముంబయి రైలు పేలుళ్ల కేసు గురించి అందరికీ తెలిసిందే. అయితే ఈ కేసులో మొత్తంగా 12 మంది నిందితులుగా ఉండగా.. వారిని రెండ్రోజుల క్రితమే బాంబై హైకోర్టు నిర్దోషులుగా తేలుస్తూ తీర్పును ఇచ్చింది. ఈ సంచలనాత్మక తీర్పుతో దేశం మొత్తం ఈ కేసుపై ఆసక్తి చూపించగా.. తాజాగా సుప్రీం కోర్టుకు వెళ్లింది. ఈక్రమంలోనే విచారణ జరిపిన న్యాయస్థానం బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న ఈ నిర్ణయంతో.. ఈ కేసు విచారణ మరోసారి కీలక మలుపు తిరిగింది.


2006లో ముంబై సబర్బన్ రైళ్లలో ఏడు చోట్ల ఏక కాలంలో బాంబు దాడులు జరిగాయి. ఈ ఘటన దేశం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ దుర్ఘటనలో మొత్తంగా 189 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అలాగే 800 మందికి పైగా ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన దేశంలోనే ఒక పెద్ద ఉగ్రవాద వ్యతిరేక దర్యాప్తునకు దారి తీసింది. ముఖ్యంగా ఈ దాడులకు సంబంధించి ఒక ప్రత్యేక ట్రయల్ కోర్టు.. 2015లో మొత్తం 12 మంది నిందితులను దోషులుగా నిర్ధారించింది. వారిలో ఐదుగురికి మరణశిక్ష విధించగా, ఏడుగురికి జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది. అయితే మరణశిక్ష పడిన వారిలో ఒకరు 2021లో మరణించారు.ఆ తర్వాత ఈ నిందితులు తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని కోరుతూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత అంటే 2025 జూలై 23వ తేదీన బాంబే హైకోర్టు విచారణ జరిపింది. ఈక్రమంలోనే ఇరువురు తరపు వాదనలు విన్న న్యాయస్థానం ఈ 12 మందిని నిర్దోషులుగా తేలుస్తూ తీర్పును ఇచ్చింది. ప్రాసిక్యూషన్ తమ కేసును "పూర్తిగా నిరూపించడంలో విఫలమైంది" అని చెబుతూ.. నిందితులను విడుదల చేసింది. అయితే ఈ తీర్పును వసాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది.ముఖ్యంగా జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ కేసులో నిందితులకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌పై వారి స్పందన ఇవ్వాలని తెలిపింది. అలాగే హైకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల అయిన నిందితులను మళ్లీ అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అంతేకాకుండా బాంబే హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును భవిష్యత్తులో ఏ కేసులోనూ ఒక ఆదర్శంగా (ప్రిసిడెంట్‌గా) పరిగణించకూడదని కూడా సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇది హైకోర్టు తీర్పులోని లోపాలను, తీవ్రతను నొక్కి చెబుతోంది.

# రైల్వే ప్రయాణికులకు అలర్ట్.. ఎమర్జెన్సీ కోటాకు అదే రోజు దరఖాస్తులు రద్దు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వే ప్రయాణికులకు అలర్ట్. రైలు ప్రయాణానికి సంబంధించిన అత్యవసర కోటా (ఎమర్జెన్సీ కోటా) నిబంధనలను భారత రైల్వేశాఖ ఇటీవల కఠినతరం చేసింది. వీటి ప్రకారం.. ఇకపై అన్ని అత్యవసర కోటా దరఖాస్తులను ప్రయాణానికి కనీసం ఒక రోజు ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో సైతం అదే రోజు దరఖాస్తు చేసుకునే పద్ధతిని పూర్తిగా రద్దు చేశారు. అయితే ఇలా చేయడానికి ఓ పెద్ద కారణమే ఉంది. అదే రోజు టికెట్లు బుక్ చేసుకోవడం వల్ల రైల్వే ఛార్ట్‌ల తయారీని సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. దీని వల్ల కార్యకలాపాల్లో జాప్యం జరుగుతోంది. వీటిని పూర్తిగా నిర్మూలించడానికే భారతీయ రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.కొత్త నిబంధనల ప్రకారం.. దరఖాస్తులకు నిర్దిష్ట గడువు సమయాలను (కటాఫ్ టైమ్స్) కూడా నిర్ణయించారు. ఉదయం 00:00 గంటల (12 గంటల) నుంచి మధ్యాహ్నం 14:00 (2 గంటల) మధ్య బయలుదేరే రైళ్లకు సంబంధించిన అత్యవసర కోటా దరఖాస్తులు.. అంతకు ముందు రోజు మధ్యాహ్నం 12 గంటలలోపు ఈక్యూ సెల్‌కు చేరాలి. అలాగే మధ్యాహ్నం 14:01 గంటల నుంచి రాత్రి 23:59 గంటల మధ్య బయలుదేరే రైళ్లకు.. అంతకు ముందు రోజు సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు అందాల్సి ఉంటుంది. ఆదివారాలు లేదా ప్రభుత్వ సెలవు దినాల్లో.. దరఖాస్తులను అంతకు ముందు పని దినం నాడే సమర్పించాలి.ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు భారతీయ రైల్వే శాఖ ఈ మధ్య అనేక నిర్ణయాలు తీసుకుంటోంది. నియమ, నిబంధనల్లో మార్పులు తెస్తూ.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా చేస్తోంది. ఇందులో భాగంగానే ఛార్ట్ తయారీ సమయాల సవరింపు, (వన్-టైమ్ పాస్‌వర్డ్) ఆధారిత ధ్రువీకరణతో తత్కాల్ బుకింగ్‌లను మరింత కఠినతరం చేయడం వంటివి ఉన్నాయి.ఇవి మాత్రమే కాదండోయ్.. కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్‌ను కూడా రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోంది. ఇది 2025 డిసెంబర్ నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా రద్దు చేయబడిన, నిర్ధారించబడని వెయిటింగ్ లిస్ట్ టికెట్లపై విధించే "క్లర్కేజ్" ఛార్జీలను తొలగించే అంశాన్ని కూడా భారత రైల్వే పరిశీలిస్తోంది. ఇది ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## సైబర్ పోలీస్, మహిళా ఎస్సై.. ఇద్దరూ దొంగలే



**న్యూఢిల్లీ-నవభూమి:** దొంగల నుంచి ప్రజల్ని రక్షించాల్సిన ఎస్సై దొంగతనానికి తెగబడ్డాడు. ఆయన ప్రియురాలైన మహిళా ఎస్సై ఈ పనిలో ఆయనకు సహకరించింది. ఇద్దరూ కలిసి దొంగసొమ్ముతో టూర్లకు వెళ్లారు. చివరికి పట్టుబడటంతో వారి అక్రమాలు బయటకొచ్చాయి. ఈ ఘటన ఢిల్లీలో జరిగింది. ఢిల్లీ పోలీస్ సైబర్ విభాగానికి చెందిన ఓ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేసే అంకుర్ మాలిక్.. సైబర్ నేరాల్లో జప్తు చేసిన నగదును కోర్టుకు అక్రమ పత్రాలు సమర్పించి తనకు తెలిసిన వాళ్ల ఖాతాల్లోకి మళ్లింపజేసేవాడు. అనంతరం వారి ఖాతాల్లోంచి ఆ డబ్బు తీసుకునేవాడు.ఇలా దాదాపు రూ.2 కోట్లు కొల్లగొట్టాడు. ఈ పనిలో ఆయన ప్రియురాలైన నేహాపూనియా అనే మహిళా ఎస్సై సహకరించేది. నేహా ఢిల్లీలోనే మరో పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తోంది. వివాహితులైన వీరిద్దరికీ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల వీరు వారం సెలవుపెట్టి గోవా, మనాలీ, జమ్మూకశ్మీర్‌ల టూర్‌కు వెళ్లారు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన అధికారులు దర్యాప్తునకు ఆదేశించగా.. ఈ జంట మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఉన్నట్లు తెలిసింది. చేతిలోని డబ్బుతో, కొత్త పేర్లు పెట్టుకొని అక్కడే స్థిరపడాలని వీరు నిర్ణయించుకున్నారు. పోలీసులు వారి ఆచూకీ గుర్తించి పట్టుకోవటంతో గుట్టురట్టయింది. ఇద్దరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు.

# భర్త నాలుక కొరికి.. నమిలి మింగేసిన భార్య



**గయా-నవభూమి:** వామ్మో.. రోజు రోజుకూ కొందరు మనుషులు మానవ మృగాళ్లలా తయారు అవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే విపరీతమైన కోపం తెచ్చుకుంటూ.. ఎంతటి దారుణాలకు అయినా పాల్పడుతున్నారు. ముఖ్యంగా భార్యభర్తల మధ్య వచ్చే గొడవలతో.. దంపతులు ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారు. తాజాగా భర్తతో జరిగిన చిన్న గొడవకే విపరీతమైన కోపం తెచ్చుకున్న ఓ భార్య.. అతడిపై దాడికి పాల్పడింది. ముఖ్యంగా అతడి మీద పడి నాలుకను అందుకుంది. దాన్ని కొరికేసి మరీ నమిలి మింగేసింది. ఆపై తీవ్ర రక్తస్రావం అవుతున్నా పట్టించుకోకుండా గొడవ పడుతూనే ఉంది. విషయం గుర్తించిన స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. అక్కడకు కూడా వెళ్లిన భార్య పిచ్చిగా ప్రవర్తించింది.సంఘటన వివరాల్లోకి వెళితే.. బీహార్ గయా జిల్లాలోని ఖిజ్రాసరాయ్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ గ్రామంలో ఛోటే దాస్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అయితే అతడికి చాలా రోజుల క్రితమే వివాహం కాగా.. వీరి కాపురం హాయిగానే సాగుతోంది. అయితే మొన్నటి వరకు ఇద్దరూ ప్రేమగానే ఉన్నా ఈ మధ్య కాలంలో వీరి మనస్పర్థలు వచ్చాయి. దీంతో తరచుగా గొడవలు పడుతున్నారు. ఎప్పటిలాగే మంగళవారం రోజు కూడా వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఇద్దరూ ఒకరినొకరు మాటా మాటా అనుకున్నారు. ఈక్రమంలోనే ఛోటే దాస్ భార్య తీవ్ర ఆగ్రహానికి గురైంది. కోపంతో ఊగిపోతూ.. భర్త నాలుకను తన నోటితో పట్టేసింది. పళ్లతో నాలుకను గట్టిగా కొరికేసింది.భర్త ఎంత వదిలించుకోవాలని చూసిన గట్టిగా పట్టుకున్న ఈమె నాలుక పూర్తిగా తెగిపోయే వరకు ఆగలేదు. ఆపై అతడి నాలుక ఆమె నోట్లోకి రాగా.. అతడి కళ్ల ముందే నమిలి మింగేసింది. భార్య నాలుక కొరికేయగానే.. తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో ఛోటే దాస్ బయటకు పరుగులు పెట్టాడు. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. భార్య కూడా అతడి వెంటే వెళ్లింది. అయితే ముందుగా సమీప ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా.. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మగధ్ వైద్య కళాశాలకు సిఫార్సు చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తమే.. అక్కడకు పంపినట్లు డాక్టర్ మీనారాణి తెలిపారు.అయితే ఇంత జరుగుతున్నా.. ఆస్పత్రిలో కూడా భార్యా భర్తలు గొడవ పడుతూనే ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఘటనపై ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని.. ఖిజర్సరాయ్ పోలీసులు తెలిపారు. ఒకవేళ బాధితుల వైపు నుంచి ఫిర్యాదు అందితే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పాక్ మిస్సైల్ విఫలం.. సొంత ప్రజల ఇళ్ల పైనే కూలిన క్షిపణి..



**కరాచీ-నవభూమి:**ప్రతి అంశంలోనూ భారత్ కంటే తామే గొప్ప అని ప్రగల్భాలు పలకుతూ.. విర్ర వీగే పాకిస్తాన్ .. రియాలిటీలోకి వస్తే మాత్రం సీన్ రివర్స్‌లో ఉంటుంది. గొప్పల కోసం ఏవో ప్రయోగాలు చేసి.. ఆఖరికి అవమానాల పాలువుతుంటుంది. తాజాగా మరోసారి దాయాది దేశానికి ఇదే పరిస్థితి ఎదురయ్యింది. తమ దేశ క్షిపణి వ్యవస్థ ఎంత బలంగా ఉంటుందో ప్రపంచానికి తెలియ చెప్పాలని భావించి దారుణంగా అభాసుపాలయ్యింది. పాక్ క్షిపణి ప్రయోగం విఫలం కావడమే కాక.. సొంత దేశ ప్రజల ఇళ్ల మీదనే కుప్పకూలిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు..ఆయుధ సంపత్తిలో కూడా భారత్ కంటే తామే గొప్ప అని గొప్పలు చెప్పుకునే పాకిస్తాన్‌కు భారీ ఎదురు దెబ్బ తగిలింది. అణ్వాయుధాలు మోసుకెళ్లే షాహీన్-3 క్షిపణి పరీక్ష విఫలమైంది. జులై 22న బలూచిస్తాన్ ప్రావిన్సులో ఈ ఘటన వెలుగు చూసింది. పాక్ ప్రయోగించిన షాహీన్-3 క్షిపణి దారి తప్పి పేలిపోయిందని జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో పాకిస్తాన్ పరువు కాస్త పోయింది. ఈ విషయం బయటకు రాకుండా దాయాది దేశం జాగ్రత్త పడినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిందంటున్నారు.

ఆయుధ సంపత్తిలో మన కంటే మెరుగ్గా.. ఇంకా చెప్పాలంటే అత్యాధునిక ఆయుధాలను కలిగి ఉన్నట్లు గొప్పలు చెప్పుకునే పాకిస్తాన్.. క్షిపణి పరీక్షల్లో మాత్రం విఫలమవుతునే ఉందని. తాజాగా షాహీన్-3 మీడియం రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించగా అది విఫలమైందని సమాచారం. ఇది అణ్వాయుధాలను కూడా మోసుకెళ్లగలదని ప్రచారం చేసుకున్న పాక్.. అది కాస్త ఫెయిల్ కావడంతో నోరు మెదపడం లేదని కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు వచ్చాయి.బలూచిస్తాన్‌లోని డేలా బుగ్టి అనే ప్రాంతంలో షాహీన్ 3 క్షిపణి పేలిపోయిందని వార్తలు వస్తున్నాయి.. పాకిస్తాన్ మీడియా, సైన్యం ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ, సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. క్షిపణి ప్రయోగం ఫెయిల్ కావడంతో.. ఈసమాచారం బయటకు రాకుండా పాకిస్తాన్ ఆ ప్రాంతంలో ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. జులై 22న జరిగిన ఈ ప్రమాదం డేరా ఘాజీ ఖాన్ సమీపంలో జరిగిందని వార్తలు వస్తున్నాయి. ఇక్కడ యురేనియం ప్రాసెసింగ్ ప్లాంట్ కూడా ఉంది. ఇది పాకిస్తాన్ అణ్వాయుధ కేంద్రంగా చెబుతారు.స్థానికులు చెప్పిన దాని ప్రకారం క్షిపణి గాలిలోనే పేలిపోయింది. దాని శిథిలాలు జనాలు ఉండే ప్రాంతాల్లో పడ్డాయి. పేలుడు శబ్దం దాదాపు 50 కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని చెప్పుకొచ్చారు. సైన్యం వెంటనే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. ప్రజలెవరూ బయటకు రావద్దని ఆదేశాలు జారీ చేసింది. దీని గురించి బయటకు పొక్కకుండా పాకిస్తాన్ అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ కూడా ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. గతంలో కూడా షాహీన్ క్షిపణి పరీక్షలు విఫలమయ్యాయి. ఈ సంఘటనపై నెటిజనులు ఓ రేంజ్‌లో విమర్శలు చేస్తున్నారు.అయితే డేరా ఘాజీ ఖాన్ ప్రాంతం బలూచిస్తాన్‌లో లేదని పంజాబ్‌లో ఉందని.. తాజాగా పాక్‌లో ఎలాంటి మిస్సైల్ ప్రయోగాలు జరగలేదని కొందరు చెబుతున్నారు. షాహీన్ 3 మిస్సైల్ ప్రయోగం ఫెయిల్ అంటూ వైరల్ అవుతోన్న ఫొటోలు, వీడియోల్లో ఉన్నది మిస్సైల్ కాదని కొందరు వాదిస్తున్నారు.

## మాజీ భర్తకు బహిరంగ క్షమాపణలు చెప్పండి!



**న్యూఢిల్లీ-నవభూమి:** తప్పుడు కేసులు పెట్టి మాజీ భర్త, అత్తింటి వారిని వేధింపులకు గురి చేసిన ఓ ఐపీఎస్ అధికారిపైసుప్రీంకోర్టు మండిపడింది. సదరు అధికారి, ఆమె తల్లిదండ్రులు.. మాజీ భర్తతో పాటు ఆయన కుటుంబీకులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ ఆదేశించింది. అలాగే పత్రికాముఖంగా క్షమాపణలు చెప్పాలని.. ప్రముఖ జాతీయ ఆంగ్ల, హిందీ దినపత్రికల్లో ఆ విషయాన్ని వెల్లడించాలని.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో కూడా తెలియజేయాలని స్పష్టంచేసింది. ప్రతీకారంతో భవిష్యత్తులో వారిని ఏరకంగానైనా ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించింది. కేసులను తగిన అధికార పరిధికి మార్చాలంటూ ఇరు పక్షాలు నమోదు చేసిన బదిలీ పిటిషన్లను పరిశీలించిన సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహాల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. శివంగికి 2015లో షాహిబ్ బన్సాల్‌తో వివాహమైంది.వారికి ఓ కూతురు పుట్టింది. విభేదాలతో వారు 2018 నుంచి విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరస్పరం కేసులు పెట్టుకున్నారు. శివంగి పెట్టిన కేసుల్లో గృహహింస, హత్యాయత్నం, అత్యాచారం తదితర అభియోగాలున్నాయని, భర్త షాహిబ్ 109 రోజులు, ఆయన తండ్రి 103రోజులు జైలు శిక్ష అనుభవించినట్లు ధర్మాసనం గుర్తించింది. దీంతో ఆ కుటుంబం ఎంతో మానసిక వేదనకు గురైందని.. దీనికి ఏరకంగానూ పరిహారం చెల్లించలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే ఇప్పుడు అందుతున్న భరణంతోపాటు మాజీ భర్త ఆస్తిలో హక్కు వదుకోవాలని శివంగికి షరతు విధించింది. ఈ వ్యవహారంలో నమోదైన అన్ని కేసులను కొట్టేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, అత్తింట్లో వేధింపులు ఎదుర్కొంటూనే శివంగి 2022లో యూపీఎస్సీకి ఎంపికయ్యారని అప్పట్లో పత్రికలు ప్రచురించాయి.

### ఆస్ట్రేలియాలో మరో జాత్యాహంకార ఘటన.. ఆలయంపై పిచ్చి రాతలు

**న్యూఢిల్లీ-నవభూమి:**ఆస్ట్రేలియాలో మరో జాత్యాహంకార ఘటన చోటుచేసుకుంది. మెల్‌బోర్న్‌లోని బోరోనియాలో గల హిందూ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత వ్యాఖ్యలు రాశారు. ఆస్ట్రేలియాలో ఒక భారతీయ విద్యార్థిపై దాడి జరిగిన ఘటన మరవక ముందే ఈ ఘటన ఆందోళన కలిగిస్తోంది.స్వామి నారాయణ్ ఆలయం వద్ద ఈ నెల 21న ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆలయం గోడలపై హిట్లర్ చిత్రాన్ని వేసి, దానిపై 'గో హోమ్ బ్రౌన్' అని రాశారు. ఇదే ప్రాంతంలోని ఆసియా దేశాల వారు నడిపే హోటళ్లపై కూడా ఇలాంటి విద్వేషపూరిత రాతలే రాసినట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి.ఈ ఘటన తమను దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఇలాంటి చర్యలు భక్తులను, స్వచ్ఛంద సేవకుల హృదయాలను కలచివేస్తున్నాయని హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు మకరంద్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలు శాంతి, భక్తి, ఐక్యతకు నిలయంగా ఉంటాయని, అలాంటి వాటిని లక్ష్యంగా చేసుకొని ఇలా జాత్యాహంకార చేష్టలకు పాల్పడటం సరైనది కాదని ఆయన అన్నారు.ఈ ఘటనను విక్టోరియా ప్రీమియర్ జసింత్ అల్లన్ తీవ్రంగా ఖండించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
శుక్రవారం
25 । జులై । 2025





## వెస్ట్ ఆర్కిటికా దేశమట.. ఆ దేశానికి రాయబారి అట..

**లఖ్‌నవూ–నవభూమి:** వెస్ట్ ఆర్కిటికా, సెబోర్గా, లోడోనియా, పౌల్వియా అనే కాల్పనిక దేశాల పేరుతో భారత్‌లో అనధికారికంగా రాయబార కార్యాలయాన్ని నడుపుతూ.. యువతను ఉద్యోగాల పేరుతో మోసగిస్తున్న కేటుగాడి ఆటను ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) పోలీసులు కట్టించారు. ఈ కేసులో గాజియాబాద్‌కు చెందిన హర్షవర్ధన్ జైన్‌ను అరెస్టుచేసి, అతని నుంచి నకిలీ డిప్లొమాటిక్ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఉన్న నాలుగు వాహనాలు, 12 నకిలీ రాయబార పాస్‌పోర్టులు, విదేశాంగ మంత్రిత్వ శాఖ ముద్రలతో ఉన్న నకిలీ పత్రాలు, రెండు నకిలీ పాన్‌కార్డులు, వివిధ కాల్పనిక దేశాలకు చెందిన 34 స్టాంపులు, రెండు నకిలీ ప్రెస్ కార్డులు, రూ.44.7 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, అనేక షెల్ కంపెనీలకు సంబంధించిన పత్రాలు, 18 నకిలీ డిప్లొమాటిక్ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను సీజ్ చేశారు. నిందితుడిని తదుపరి దర్యాప్తు నిమిత్తం కవినగర్ పోలీసులకు అప్పగించారు. కవినగర్ పోలీసుల కథనం ప్రకారం.. గాజియాబాద్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న హర్షవర్ధన్ జైన్ అందులో 'వెస్ట్ ఆర్కిటికా' అనే కాల్పనిక దేశానికి సంబంధించిన రాయబార కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. తనను తాను ఆ సూక్ష్మ దేశానికి(మైక్రోనేషన్) రాయబారిగా పరిచయం చేసుకునేవాడు. సెబోర్గా, లోడోనియా, పౌల్వియా అనే మైక్రోనేషన్స్‌తో కూడా తనకు సంబంధాలున్నట్లు చెప్పుకొంటూ.. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను మోసగించేవాడు.



## భాషకు అందని యుద్ధ బీభత్సం

భాషలకే తలవంచే దుఃఖం... భావాలకే బ్రతుకు కోల్పోయే బీభత్సం... ప్రపంచ చరిత్రలో ఎన్నో యుద్ధాలు జరిగినా, కొన్ని మాత్రం మానవ మనస్సుని ముక్కలుగా చీల్చేస్తాయి. 2023 అక్టోబరు 7న ప్రారంభమైన గాజా సంక్షోభం కూడా అలాంటిదే. ఇది కాలంతో పోటీ పడే విషాద ఘట్టం మాత్రమే కాదు. ఇది మానవతా విలపాన్ని ప్రతిఫలించే సార్వకాలిక వేదన. హమాస్ అనే సంస్థ ఒక శనివారపు ఉదయాన ఇజ్రాయెల్ భూభాగంపై దాడి చేయడంతో మొదలైన ఈ ఘర్షణ క్షణాల్లోనే ఎన్నో ప్రాణాలను బలిగొంది. కానీ అదే దాడిని దావగా తీసుకొని, గాజా అనే భూభాగాన్ని జీవించలేని పతనపరమైన నరకంగా మార్చే ప్రయత్నం చేసింది ఇజ్రాయెల్.

ప్రతి రణరంగం వెనక ఒక ఆధిపత్య తపన ఉంటుంది. ఒక గాథ ఉంటుంది. ఒక భిన్న దృక్కోణం ఉంటుంది. కానీ కొన్ని దృశ్యాల ముందు వాదనలు అవస్థ పడతాయి. విశ్లేషణలు అర్థరహితమవుతాయి. మనసులు విలపిస్తాయి. గాజా విషయమూ అలాంటిదే. ఇది కేవలం భూభాగాల పోరాటం కాదు. ఇది ప్రజల ఉనికి కోసం జరుపుతున్న పోరాటం. ఇది బాంబుల మీద జీవించే మానవుల గాథ. ఇది ప్రపంచ మౌనాన్ని ప్రశ్నించే అర్ధరాత్రి విలాపం.అక్టోబరు 7, 2023 ఉదయం హమాస్ తీవ్రవాదులు సరిహద్దులను దాటి ఇజ్రాయెల్‌లోకి చొరబడ్డారు. సుమారు 1200 మందిని హతమార్చారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇలా నిర్భయంగా ఉన్న పౌరులను లక్ష్యంగా చేసుకున్నారు. వందలాది మంది బందీలుగా తీసుకుపోయారు. ప్రపంచవ్యాప్తంగా దీనిపై ఖండనలు వెల్లువెత్తాయి. న్యాయానికి నమ్మకంగా ఉండే దేశాలు ఈ దాడిని ప్రాథమికంగా తీవ్ర ఉగ్రవాద చర్యగా పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ మీద హక్కు లేకుండా హింసాత్మక దాడికి పాల్పడిన హమాస్ తీరు ప్రశ్నార్థమనే చెప్పాలి.కానీ ఈ దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయెల్ ప్రారంభించిన ప్రతిఘాత చర్యలు మాత్రం మితిమీరిన విధ్వంసాన్ని సంకేతించాయి. ఈ దాడుల లక్ష్యం హమాస్‌ను నిర్మూలించడం అని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి అమాయక ప్రజలపై జరిగిన దాడులు మాత్రం మానవ హక్కులన్నింటినీ విస్మరించిన ఘాతుకాలుగా నిలిచాయి. గాజా జనాభాలో సగం మంది పిల్లలే ఉండగా, హమాస్ పేరిట వారిపై బాంబుల వర్షం కురిపించడం, మానవతను తుంగలో తొక్కడమే.గాజా ఒక చిన్న భూభాగం. దాదాపు 2 మిలియన్ మంది జనాభా ఉన్న ఈ ప్రాంతం, ఇప్పటికే ఐదున్నర దశాబ్దాలుగా ఇజ్రాయెల్, ఈజిప్ట్, అంతర్జాతీయ రాజకీయాల మధ్య చిక్కుపడిన నరకవాసం. ఆమోదయోగ్యమైన విద్యుత్ సరఫరా లేదు. వైద్య సేవలు నామమాత్రం. తినే తిండి కూడా సహాయసహకారాలమీదే ఆధారపడే పరిస్థితి. అలాంటి ప్రదేశంలో 2023 అక్టోబరు నుంచి ఇప్పటి వరకూ జరిగిన వైమానిక దాడుల వల్ల 40,000 మందికి పైగా అమాయకులు మరణించారని పలువురు స్వతంత్ర సంస్థల అంచనా. అక్షరాలా లక్షలమంది గాయపడ్డారు. అనేక మంది శాశ్వతంగా వికలాంగులయ్యారు.ఇజ్రాయెల్ ఈ దాడులను హమాస్ నిర్మూలన పేరుతో న్యాయసమ్మతంగా చూపించాలనుకుంటున్నప్పటికీ, లక్ష్యంగా పడినవి హాస్పిటళ్లు, రెసిడెన్షియల్ భవనాలు, మసీదులు, స్కూళ్లు. అంతే కాదు, ఆసుపత్రులు, వైద్య సిబ్బంది, రక్తదాన కేంద్రాలపై కూడా బాంబుల వర్షం కురిపించడం వల్ల ఆ గడ్డనే శ్మశానంగా మార్చేశారు. ఈ ఘాతుకాల మధ్య గాజా ప్రజలు కనీస జీవనాధారాలు కోల్పోయారు.ప్రపంచం ఇది చూసింది. మరీ ముఖ్యంగా అమెరికా, ఐరోపా దేశాలు. కానీ ఈసారి వారు స్పందించలేదు. కేవలం హమాస్‌ను ఖండించడం ద్వారా తాము మానవతా వాదులమని చెప్పుకునే దారుణ దూషణలు చేశాయి. ఇజ్రాయెల్‌కు అండగా నిలబడిన అమెరికా, గాజాలో జరుగుతున్న మానవ హననాన్ని 'స్వీయ రక్షణ' అనే పదబంధంతో సమర్థించడమే కాదు, ఆయుధ సహకారాన్ని మరింతగా పెంచింది. మానవ హక్కులపై మాట్లాడే ఐక్యరాజ్యసమితి కూడా తేలికగా స్పందించింది. ఈ మౌనం ఈ ద్వంద్వ నైతికత మానవ చరిత్రలో శాపంగా మిగిలిపోతుంది.ఈ నేపథ్యంలో ఎంతోమంది మేధావులు, రచయితలు, కళాకారులు తమ శబ్దాన్ని వినిపించారు. కానీ ఆ శబ్దం ప్రపంచ రాజకీయ శబ్దపటం ముందు చిహ్నార్థంగా మారిపోయింది. గాజా బీభత్సం ప్రపంచానికి గట్టి ప్రశ్న వేస్తోంది: "మానవ హక్కులు ఎవరి కోసం?"పలువురు చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం, గాజా బీభత్సం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతగా ఉత్కంఠ కలిగించిన సంఘటన. ఫ్రెంచ్ చరిత్రకారుడు జీన్ పియర్ ఫిలియు గాజా పరిస్థితిని 2014 నుంచే అర్థం చేసుకుని, "ఇజ్రాయెల్ ఇప్పటిదాకా 12 సార్లు గాజాపై యుద్ధాలు జరిపింది" అని పేర్కొన్నారు. కానీ 2023 యుద్ధం మాత్రం లక్షల మందిని నిరాశ్రయులను చేసింది.చరిత్రలో మానవుని విలుప్తి చెందిన స్థితికి తీసుకెళ్లే ఘట్టాలేవైనా ఉంటే, వాటిలో గాజా ఘాతుకం ఒకటిగా చర్చకు వస్తోంది. ఇది కేవలం ఒక యుద్ధం కాదు ఇది మానవతకు సవాలుగా నిలిచిన నాటకం.యుద్ధ వ్యతిరేక స్వరం రానవాళికి అవసరమైన ఆవాజ్..గాజా విషాదాన్ని గమనించిన కొందరు రచయితలు, చిత్రకారులు, ఛాయాగ్రాహకులు తమ కళా రూపకాల ద్వారా వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. We see you Gaza అనే నినాదం అంతర్జాలంలో విస్తృతంగా వినిపిస్తోంది. మానవ హక్కుల ఉద్యమాలు, విద్యార్థి సంఘాలు, స్వేచ్ఛా వేదికలు ఈ యుద్ధాన్ని మానవతా ద్రోహంగా అభివర్ణించాయి.కానీ యుద్ధ వ్యతిరేక స్వరం ఇంకా తేలికగా వినిపిస్తోంది. ఆ స్వరం బలంగా మారాలి. అది మార్గదర్శకంగా మారాలి. ఎందుకంటే, గాజాలో చనిపోయిన వారంతా మనుషులే. వారికీ కూడా బతకాల్సిన హక్కుంది. వారి జీవితాలు కూడా విలువైనవే.

గాజా దహనం – ఇది చరిత్రలో మరువలేని మచ్చ. ఇది మానవతను అర్థంచేసుకునే ప్రతి ఒక్కరికి గుండెల్లో త్రాచు పాము లాంటి బాధను మిగిలిస్తుంది. ఈ వ్యాసం పూర్తి చేయడంలో సంతోషం లేదు. ఎందుకంటే ఇది ముగిసిన అంశం కాదు. ఇది ఇంకా కొనసాగుతోంది. ప్రతి బాంబు పేలుడు వెనక ఒక శిశువు కేక ఉంది. ప్రతి భవనం తుడిచిపెట్టిన అనంతరం ఒక కుటుంబం చెదిరిపోతోంది. ఒక సాంఘిక నిర్మాణం కనుమరుగవుతోంది.యుద్ధం ఎప్పుడూ ఓటమినే ఇస్తుంది. మనకు కావలసింది శాంతి. మనిషి గౌరవాన్ని నిలబెట్టే జీవన నిర్మాణం. గాజా దారుణం మనల్ని అలాంటి మార్గాల కోసం ఆలోచింపజేయాలి. అది కేవలం ఫలితం మాత్రమే కాదు –అది ఒక మానవ సమాజ భవిష్యత్తు.

# సోషలిజం ముసుగులో పెట్టుబడిదారీ నియంతృత్వం



ఇది సామాన్య చర్చ కాదు. ఇది చరిత్రను సూటిగా ప్రశ్నించే కాల్పనిక తత్త్వాలపై అంతర్లీనంగా స్పందించే వాస్తవ విశ్లేషణ. కమ్యూనిస్టు సిద్ధాంతానికి మార్గదర్శకంగా చాటిన దేశాలే, ఆ సిద్ధాంతానికి ఎదురు నిలబడి, దాన్ని సిద్దాంతిక పునర్నిర్మాణం కాకుండా, అధికారపు సాంకేతికతగా మార్చిన విధానం ఇది. చరిత్రకు వ్యతిరేకంగా కాదు... కానీ చరిత్ర పాఠాలనూ, పరాజయాలనూ పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని గుర్తు చేసే ఘటనల నేపథ్యం ఇది.రష్యా, చైనా వంటి దేశాలు తమను తాము సోషలిస్ట్ దేశాలుగా పరిచయం చేసుకోవడం ఎంతోకాలంగా కొనసాగుతోన్న రాజకీయ భ్రమ. కానీ వాస్తవానికి ఆ దేశాలలో పనిచేస్తోన్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక విధానాలు పూర్తిగా పెట్టుబడిదారీ నియంతృత్వపు మూలాలపై ఆధారపడ్డవి. అటు రష్యాలో అయినా, ఇటు చైనాలో అయినా – ప్రజల పాలనగా చెప్పుకునే వ్యవస్థ అసలే లేదు. కమ్యూనిజం అనే పదానికి ఆధునిక కాలంలో వచ్చిన అసలైన అవమానం అదే.చైనా పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థను 1980ల నుంచే తన వ్యవస్థలోకి చేర్చుకుంది. కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యంతో నియంత్రిత రాజకీయ వ్యవస్థ, కానీ వ్యాపారానికి మాత్రం సంపూర్ణంగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటం, ప్రయివేటు కంపెనీలను పెంపొందించటం – ఇవన్నీ మార్కెట్ బేస్డ్ వ్యవస్థ లక్షణాలు. రష్యా గర్వంగా చెప్పుకునే తన మార్కెట్ ఓలిగార్క్ వ్యవస్థలు కూడా ఆర్థిక అసమానతల్ని పెంచాయి. ప్రజల స్వేచ్ఛలు, వాణిజ్య స్వేచ్ఛలు, మీడియా స్వేచ్ఛలు – ఇవన్నీ పూర్తిగా రద్దైన లేదా నియంత్రిత రూపంలో మాత్రమే ఉన్నా, ఆ దేశాలపై భారతీయ కమ్యూనిస్టుల కాస్త మక్కువ మాత్రం ఏమాత్రం తగ్గలేదు.కమ్యూనిస్టులు చెప్పే ప్రగతిశీల సామాజిక రూపాంతరాలు, సామూహిక సమానత్వం, వర్గ సమీకరణ... ఇవన్నీ ఓ అందమైన భవిష్యత్ కల. కానీ ఆ కలను నెరవేర్చే మార్గాలుగా అవినీతి, నియంతృత్వం, వ్యక్తి స్వేచ్ఛను అణిచివేత, జాతి నియంత్రణ అనే తత్త్వాలను అనుసరించడమే కామ్రేడ్ పాలిత దేశాల్లో కనిపించింది. చైనాలో టిబెటన్ పిల్లల్ని బలవంతంగా వారి సంస్కృతినుంచి వేరు చేయడం, ప్రభుత్వ బోర్డింగ్ స్కూళ్లలో చేర్చడం ఒక సంస్కృతుల చావుకథ. ఇది సామాజిక నూతన నిర్మాణమా? లేక సంస్కృతిస్వరూపానికి వ్యతిరేకమా? ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘాల నివేదికలు ఇవే చెబుతున్నాయి.ఉత్తర కొరియాలో జరుగుతున్న దారుణాలు మరింత భయంకరంగా ఉంటాయి. కమ్యూనిజం పేరుతో పాలించే ఆ దేశంలో ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా ఒకే కుటుంబానికి విధేయులుగా ఉంటూ... తమ జీవితాలను భయం, ఒత్తిడి, వెట్టి పనుల మధ్య గడుపుతున్నారు. 2014లో యూఎన్ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ నివేదిక స్పష్టంగా చెప్పింది – జైలులో నిర్దోషులను వేయడం, అత్యాచారాలు, బలవంతపు కార్మిక శిబిరాలు – ఇవన్నీ అక్కడ రోజూ జరుగుతున్న దృశ్యాలే. అది కమ్యూనిజం పునాదులపై నిర్మితమైన సమాజమా?ఈ పరిస్థితుల మధ్య భారత కమ్యూనిస్టుల వైఖరి చూసినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. పాలస్తీనా పట్ల అనురాగం చూపుతూ, ఇజ్రాయిల్‌పై విమర్శలు చేస్తూ, కానీ ఉక్రెయిన్‌పై రష్యా చేసిన ఆక్రమణను సమర్థించడం – ఇది ద్వంద్వత భావన కాదు మరేంటి? సామ్రాజ్యవాదం అంటే పశ్చిమ దేశాలదే, కానీ రష్యా దాడులు మాత్రం "తప్పుడు సర్దుబాట్లు", "ఆత్మరక్షణ", "నాటో వ్యతిరేకత" అనే పేర్లతో సమర్థించబడతాయి. వాస్తవంగా చూస్తే, సామ్రాజ్యవాదం దక్షిణానికి, తూర్పునకు, పశ్చిమానికి భిన్నంగా ఉండదు. అది ఆక్రమణ, వ్యాపార నియంత్రణ, రాజకీయ ప్రభావ విస్తరణ అనే లక్షణాల ద్వారా నిర్వచించబడుతుంది. ఆ విషయంలో రష్యా, చైనా, అమెరికా, ఇజ్రాయిల్ ఏ ఒక్క దేశం తక్కువ కాదు.ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన దాడిని స్వేచ్ఛా పోరాటంగా, అణు యుద్ధానికి ముందు అడుగుగా చూస్తూ, దానికి మద్దతుగా నిలబడిన భారత కమ్యూనిస్టులు, అదే సమయంలో ఇజ్రాయిల్‌పై పశ్చిమ దేశాల ద్వంద్వ వైఖరిని తప్పుపడతారు. ఇది నిజానికి ఒక విధమైన సార్వత్రిక నైతికత యొక్క విఫలం. తాము వ్యతిరేకించాలనుకునే అంశాలను ఎంపిక చేసుకోవడం, మిత్రదేశాల దౌర్జన్యాన్ని మౌనంగా గౌరవించడం, ఒక రాజకీయ సిద్ధాంతాన్ని పరిరక్షించేందుకు సత్యాలను తక్కువ చేయడం – ఇవన్నీ కమ్యూనిస్టు వాదనల పరాకాష్ఠ ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

ఒక వేళ మూడవ ప్రపంచ యుద్ధం వస్తే, అది మానవజాతికి విపత్తును తేవడం తప్ప, ప్రపంచంలో విప్లవాల అలల్ని మళ్ళీ తీసుకురాదనే నిజాన్ని చరిత్రే మనకు చెప్పారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత సోవియట్ విప్లవం, రెండవ యుద్ధం తరువాత తూర్పు యూరోప్‌లోని కమ్యూనిస్టు ఉద్యమాలు – ఇవన్నీ ఒక చారిత్రక సందర్భంలో, ఒక ప్రత్యేక దశలో చోటుచేసుకున్నవి. కానీ ఇప్పుడు తలెత్తే యుద్ధం ఏ భద్రతా సూత్రాన్ని గౌరవించదు. అణ్వాయుధాలు కలిగిన అనేక దేశాల మధ్య తలెత్తే ఓ ప్రపంచ యుద్ధం అది ఏ సమాజానికీ విజయం కాదు, ఆఖరుకి మనుగడపై ముప్పే. అలాంటి దానికి మద్దతు పలికే వాదనల్ని ఎలాగైనా పిడివాదమే అనాలి.అలాగే స్టాలిన్ పాలనలో ఉక్రెయిన్‌లో జరిగిన 'హోలోడోమర్' అనే కరువు – ఇది సామూహిక శిక్ష విధానం. అది ఒక కఠిన, చరిత్రను పీడించే అధ్యాయం. ఐదు మిలియన్లకు పైగా ప్రజల మరణానికి కారణమైన ఈ పాలనా దారుణం ఇప్పటికీ కమ్యూనిస్టు వాదకుల చేత ఖండించబడలేదు. కమ్యూనిజం మానవతా విలువల చిహ్నంగా వర్ణించబడితే అలాంటి మృగహృదయ పాలన ఎలా ఆ సిద్ధాంతాన్ని నమ్మదగినదిగా నిలబెడుతుంది? ఇంతమందికి బాధను కలిగించిన పాలకులను ఇప్పటికీ ఆదర్శంగా చెప్పుకునే మనస్తత్వం వింతగా ఉంది. "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అని శ్రీశ్రీ అన్నట్టుగా – ఇది రష్యా, చైనా, ఉత్తర కొరియా చరిత్రకూ వర్తిస్తుంది. కమ్యూనిస్టు దేశాల చరిత్రలో మానవ హక్కుల పరాభవం, వ్యక్తి స్వేచ్ఛల నిరాకరణ, స్వేచ్ఛా మీడియా. ఇవన్నీ పొలిటికల్ ప్రోపగాండాల చాటులో మరిపించలేము.

కమ్యూనిస్టు భావజాలానికి వ్యతిరేకత అవసరం కాదు. కానీ ఆ భావజాలాన్ని ఆధారంగా చేసుకుని మనుగడగా నిలిచిన విధానాలపై విమర్శలు చేయటం అత్యవసరం. ఎందుకంటే, భావజాలం పట్ల నిబద్ధత ఉండాలే గానీ, అది వ్యక్తిగత గౌరవాన్ని, జీవిత హక్కులను అణిచివేస్తే, అది ఇక మార్గదర్శనం కాదు మృత్యుశాసనం అవుతుంది. చరిత్ర మాకు చెబుతోంది కమ్యూనిజం ఒక ఆశగా మొదలై, అధికారం కోసం మారిన సిద్ధాంతంగా మిగిలిపోయిందని. కానీ దాన్ని విమర్శించకుండా దాని పాత కబుర్లనే నమ్ముతూ నడిచే భారత కమ్యూనిస్టులపై విమర్శలు చేయక తప్పదు.

ప్రపంచాన్ని సమానంగా చూడాలి. పాశ్చాత్య సామ్రాజ్యవాదాన్ని విమర్శిస్తూ తూర్పు నియంతృత్వాన్ని సమర్థించడం నైతికమైన స్థితిగతిని చాటదు. ఇది కేవలం పక్షపాత దృష్టికోణాన్ని చూపుతుంది. మార్క్స్ చెప్పిన "ప్రత్యేకించిన వర్గ పోరాటం ద్వారా శోషణ రహిత సమాజం" అనే తత్త్వాన్ని, ప్రాక్టికల్ పాలనలో వ్యక్తిగత నియంత్రణకి ఉపయోగించుకున్న నాయకుల మానసిక స్థితి వేరు. అది సామూహిక సంక్షేమానికి కాక, వ్యక్తిగత అధికారపు కలలకే పునాదిగా మారింది.

కనుక, కమ్యూనిజం భావనను సమర్థించాలనుకునేవారు ముందుగా చరిత్రను తిరిగి చూడాలి. కమ్యూనిజం పేరుతో ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న నరహింసల పుటలను తిరగవేసి, నిజాయితీగా స్పందించాలి. అభివృద్ధి చెందిన సమాజం సాధించాలంటే భావజాలం మాత్రమే కాదు విమర్శా స్వేచ్ఛ, బాధ్యతాయుత పాలన, మానవహక్కుల పరిరక్షణ తప్పనిసరి. వాటిని విస్మరించిన కమ్యూనిస్టు పాలనలు పునఃస్థాపితమైనా, ప్రజలకు మౌలిక హక్కులు లేకుండా, అది ఆవాసస్థలంగా మారుతుందే తప్ప, ఆశావాహక భవిష్యత్తుగా కాదు

## అమ్మ భాష అమృతం

(హిందీ భాషా వివాదంపై కవిత)

*ఓ దేశమా! నీ హృదయంలో ఎన్నెన్నో*
*మాటలు,*
*కానీ ఒకటే భాషకే ఎందుకీ గొడవలాటలు?*

*తెలుగు తల్లి కన్నీటి చుక్క,*
*తమిళ తాయ్ వేదన పుక్కిట,*
*బెంగాలీ బెళ్ళీ, మరాఠీ చిరాకు,*
*నీ ఒడిలో ఎన్నెన్ని భాషల గలగల ప్రవాహాలు.*

*అవి పాటలు, పదాలు, పలుకులు,*
*పల్లెలు, పండుగలు, పరిమళాలు,*
*కానీ ఇప్పుడు ఓ దేశమా, నీ పాలకులు*
*ఒకే గీత మీద నడవాలంటున్నారు.*

*"హిందీ నేర్చుకో", "హిందీ మాట్లాడు",*
*అది మాత్రమే దేశభక్తి అని నినదం.*
*భాషను ప్రేమించు కానీ*
*భాషను ఒత్తిడిగా మోపడం ఎందుకు?*

*ఓ మనసా!*
*భాషలు వర్ణాల వానలైనప్పుడు,*
*ఒకే రంగుతో చిత్రీకరించగలమా?*
*అక్షరాల్లోనే ఆత్మ ఉంటే,*
*అదే భాషలోనే జీవం ఉంటుందా?*

*తమిళం గర్వించుతుంది,*
*తెలుగు తల్లి తళుకుతుంది,*
*మళయాళం మౌనంగా కదులుతుంది,*
*కానీ హిందీ అన్నదే జాతీయంగా పిలిస్తే*
*అది భాష కాదు, ఒక నిర్ణయం అవుతుంది.*

*జాతీయత ఒక్క మాట కాదు,*
*అది అనుభూతి.*
*జాతి గర్వం ఒక్క భాష కాదు,*
*అది సంస్కృతుల సంగమం.*

*ఒకే భాషలో భవిష్యత్తు కాదు,*
*ఒకే గళంలో గీతం కాదు,*
*అన్ని గళాల్లో కలిసే స్వరమే*
*ఈ భారత గానం కావాలి.*

*అన్నీ భాషలు తల్లి మాటలు,*
*ఏ భాషను ముద్దుపెట్టి, మిగిలినదాన్ని ఎందుకు*
*తిట్టాలి?*
*ఇది గుండెమీద చేతివేళ్లను నొక్కినట్టు*
*ఎందుకు మన దేశాన్ని ముక్కలుగా పంచాలి?*

*పలుకుబడి మీద భరింపులుండవు,*
*ప్రేమించు భాషను, కానీ రుద్దకు?*
*మన దేశ గతి భిన్నతల మేళవింపు,*
*హిందీ కాదు దానికి ఏకైక శిరోమణి.*

*ఒక్క మాట భారతీయత అనేది*
*అన్ని భాషల అంగీకారమే.*
*భాషపై ప్రేమ ఉండాలి,*
*కానీ మిగిలిన భాషల పట్ల గౌరవం*
*మరువకూడదు.*

–షహనాజ్

## హిందీ భాషా వివాదం - జాతీయ సమైక్యతా? భాషా భేదాభిప్రాయం?




భారతదేశంలో భాషాపరంగా నెలకొన్న అసమ్మతి, ప్రాంతీయ గుర్తింపుల సమస్యలు, కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు వంటి అంశాల చుట్టూ తిరిగే భాషా వివాదం మళ్లీ మంటలు రగిలిస్తోంది. ప్రత్యేకించి హిందీ భాషకు సంబంధించిన చర్చ పునఃప్రారంభమైంది. హిందీని జాతీయ భాషగా నిర్దేశించాలని బీజేపీ ప్రభుత్వ అభిలాషతో, దానికి వ్యతిరేకంగా విస్తారంగా విరోధం వ్యక్తమవుతోంది. ఇది ఒక్క తమిళనాడు పరిమిత సమస్యగా ఉండకుండా, దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్న భాషా అసహనం సంక్లిష్ట రూపం దాల్చినట్లుగా తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.భారత రాజ్యాంగం ఏకభాషా వ్యవస్థను గుణంగా తీసుకోలేదు. కేంద్రం అధికార భాషగా హిందీని గుర్తించిందికాని, రాష్ట్రాలకు తామే కావలసిన భాషను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఇచ్చింది. ఇంగ్లిష్ అనుసంధాన భాషగా కొనసాగడం కూడా తాత్కాలిక అంగీకారమే అయినా, ఆ తాత్కాలిక వ్యవస్థ శాశ్వతమైనట్టే కొనసాగుతోంది. కానీ హిందీ భాషాభిమానాన్ని కేంద్రం రాజకీయంగా ఎత్తిచూపడమూ, హిందీయేతర ప్రాంతాల్లో హిందీని బలవంతంగా మిగిల్చే ప్రయత్నాలు తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తున్నాయి.ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాల్లో హిందీకి చిత్తశుద్ధితో కాకుండా రాజకీయ అజెండాతో ప్రాధాన్యత ఇవ్వడం స్పష్టంగా కనిపిస్తోంది. "ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నికలు" అనే భావజాలం, బహుళభాషా సమాజంలో అసహనాన్ని పెంచే ప్రయత్నమే అని విమర్శకులు ఆరోపిస్తున్నారు. మాతృభాషా సాంస్కృతిక అస్మితగా భావించే ప్రాంతీయ సమాజాలు, హిందీని తమ మీద రుద్దే కుట్రగా చూస్తున్నాయి.

తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో హిందీ వ్యతిరేక ఉద్యమాలు మళ్లీ ఊపందుకున్నాయి. మహారాష్ట్రలో ఠాక్రే సోదరులు మొదటిసారిగా భాషా అంశంపై ఏకతాటిపైకి రావడం ఈ అంశానికి ప్రాధాన్యం చేకూర్చింది. మమతా బెనర్జీ బెంగాల్ భాషా ఉద్యమాన్ని ప్రకటించి హిందీని "భాషా ఉగ్రవాదం"గా సంబోధించడమూ రాజకీయంగా పెరిగిన ప్రతిఘటనకు ప్రతీకగా మారింది. హిందీపై కేంద్రం చూపుతున్న ప్రాధాన్యం దక్షిణ, తూర్పు భారత రాష్ట్రాల్లో భాషా అసంతృప్తిని మరింతగా రెచ్చగొడుతోంది.అసలు భాష అనేది ఒక చారిత్రక–సాంస్కృతిక వికాసం. అది కేవలం అధికార ప్రకటనలతోనో, విద్యా విధానాల మార్పులతోనో భద్రంగా కొనసాగే వ్యవస్థ కాదు. బలవంతపు భాషా విధానాలు, విద్యావిధులలో మార్పుల ద్వారా హిందీని రుద్దే ప్రయత్నాలు ప్రజాస్వామ్య మార్గాలవేనా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడంలో హిందీని ప్రాధాన్యం ఇవ్వడం, హిందీయేతర రాష్ట్రాలకు విద్యాసంబంధ నిధులపై ఒత్తిడి తెచ్చే విధంగా ప్రవర్తించడమే ఈ విరోధానికి మూలం.ఇప్పటికీ భారతదేశం ఐక్యతను భాషతో కాకుండా, బహుళత్వంతో సాధించిన దేశం. ఇంగ్లిష్, హిందీ, మరెన్నో ప్రాంతీయ భాషలు కలిసి ఈ దేశ సంస్కృతిని నిర్మించాయి. జాతీయ సమైక్యత అనేది భావనల్లో, లక్ష్యాల్లో సాధించాల్సినది కాని, ఏక భాష ద్వారా కాదు. దేశంలోని 22 అధికార భాషలు, వందలాది మాతృభాషలు ఉన్న పరిస్థితిలో హిందీని మాత్రమే ప్రోత్సహించాలనడం అన్యాయం. ఇది బహుళభాషా సమాజానికి విఘాతం కలిగించడమే కాక, దేశ ఐక్యతకు ప్రమాదమే.ఇక్కడ ముఖ్యమైనది – హిందీ వ్యతిరేకత అనేది హిందీ భాషతో నేరుగా సంబంధం లేనిది. హిందీ మాట్లాడే ప్రజల పట్ల వ్యతిరేకత కాక, హిందీని అధికారికంగా, పాలక శక్తుల ద్వారా, ఇతర భాషల పట్ల నిష్క్రియత ప్రదర్శిస్తూ రుద్దే ప్రక్రియ పట్ల వ్యతిరేకత. ఇదే తమిళనాడు, కేరళ, బెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక భాషలపై ప్రేమ, వాటి సంరక్షణకు ప్రయత్నాలే కాకుండా, ఇతర భాషల వలసను నిరసించడం అనేది వారి భాషా హక్కుల కోసం పోరాటమే.

భాష ఒక వింత రాజకీయ ఆయుధంగా మారడాన్ని మనం గతంలో ఎన్నోసార్లు చూశాం. పాక్ నుంచి వేరు రాష్ట్రంగా బంగ్లాదేశ్ ఏర్పడిన తీరును గుర్తుచేసుకోవాలి. అక్కడ ఉర్దూను బలవంతంగా రుద్దే ప్రయత్నమే భాషా ఉద్యమానికి బీజం వేసింది. అదే తరహాలో హిందీని ప్రాధాన్యం ఇచ్చే పేరుతో ఇతర భాషలపై ఆవిష్కృతమవుతున్న కేంద్రపు వ్యూహాలు, అర్థరహితమైన భాషా విధానాలు, మన దేశ భవిష్యత్తు ఏకత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి.ఇప్పటివరకూ వచ్చిన సంఘటనలు సూచిస్తున్నవి భాషను ప్రోత్సహించాలంటే అది ప్రేరణతో జరగాలి, బలవంతంతో కాదు. భాషా సమైక్యత అనేది వివిధతలో ఏకత్వం అనే భావనతో సిద్ధించాలి. భాషా విభేదాలు, ప్రాంతీయ అసంతృప్తులు రాజ్యాంగబద్ధంగా పరిష్కరించాలేగానీ, అధికార భాషల పేరుతో కక్ష తీర్చుకోవడం, బలవంతపు విధానాలు, ప్రాంతీయ గర్వాన్ని అపహాస్యం చేయడం అనైతికమే కాదు, అప్రజాస్వామికం కూడా.హిందీని ఒకే జాతీయ భాషగా నిలపాలన్న తలంపు, దేశంలోని భిన్న భాషా సమాజాలను కలవరపెడుతున్నది. ఇది మళ్లీ దేశంలో భాషా రాజకీయాలను తెరపైకి తీసుకువస్తోంది. జాతీయ సమైక్యత కోసం అవసరమైనది భిన్నతలో ఏకత్వాన్ని అంగీకరించే దృక్కోణం. హిందీని తలకెత్తి మిగిలిన భాషల పట్ల ఉపేక్ష లేకుండా మినహాయించడం, భాషా హక్కుల పట్ల నిర్లక్ష్యం చెయ్యడం దేశ సమైక్యతను చీల్చే చర్యలే అవుతాయి. భారతదేశ భవిష్యత్తు కోసం హిందీకి వ్యతిరేకత కాదు, కానీ హిందీయేతర భాషల పట్ల గౌరవం అవసరం. భాషా స్వేచ్ఛకు గౌరవం ఉంటేనే ప్రజాస్వామ్యానికి పునాది బలపడుతుంది.

## మెండైన జీవితానికి రెండు భావనలు

భక్తి



నిజమైన యోగులు, అంతర్బుద్ధితో భగవంతుడిని దర్శించి అతని యందే ఏకత్వాన్ని పొంది, సమత్వ దృష్టితో సర్వ భూతాలనూ భగవంతుడిలో, భగవంతుడిని సర్వభూతాల్లోనూ దర్శిస్తారు. సమదర్శన (సమవర్తన కాదు) అలవడుతుంది. దీపానికి మసి ఎలాంటిదో మనసునకు ఆలోచనలు అలాంటివే. ఆలోచనల జన్మస్థానాన్ని గమనించి, చెడు ఆలోచనలను అక్కడే నియంత్రించి, ప్రశాంతస్థితిని పొందిన వాని ఆలోచనలలో మసిలాంటి చెడు భావనలు పొడచూపవు. యోగయుక్తులైన వారి మనసులలో మైత్రి, కరుణ, సంతోషం, ఉపేక్షలు వెలుగు చూస్తాయి. మైత్రి అంటే సకల జీవుల పట్ల స్నేహభావన, ప్రేమ, దయను చూపడం. కరుణ అంటే ఇతరుల బాధలకు స్పందించి, వాటిని తగ్గించడానికి ప్రయత్నించడం. సంతోషం అంటే ఇతరుల సంతోషాన్ని చూసి ఆనందించడం. ఉపేక్ష అంటే సుఖదుఃఖాలు, మంచి చెడులు, లాభనష్టాలు లాంటి భౌతిక విషయాలపై సమతుల్యతను కలిగి ఉండి, వాటిపై మమకారం లేకుండా ఉండగలగడం. ఫలితంగా మనసు ప్రశాంతమై సమత్వాన్ని పొందుతుంది. సమదర్శన సాధ్యపడుతుంది.యోగ సాధనలో మనసుకు సున్నితత్వం, సహానుభూతి అలవడుతుంది. వ్యక్తిగత ఎదుగుదల, సమాజంతో సత్సంబంధాలు ఏర్పడటానికి వ్యక్తిలో సున్నితత్వం, సహానుభూతులు అవసరం. భావోద్వేగాలను అదుపు చేసుకోవడం, సమాజాన్ని అవగాహన చేసుకోవడం సున్నితత్వం. దీని కారణంగా తప్పు జరిగినప్పుడు క్షమాపణ చెపుతూ, ప్రవర్తనను సరిచేసుకోవడానికి ప్రయత్నిస్తాం. ఇతర జీవుల కష్టసుఖాలలో, భయాలలో, వారి జీవన పరిధులలో అనుబంధాన్ని పెంచుకుంటాం, ఆత్మీయ తను పంచుకుంటాం. తద్వారా ప్రపంచంతో పటిష్ఠమైన అనుబంధాలు ఏర్పడుతాయి.ఇతరులు చెప్పేది శ్రద్ధగా వినడం, ఇతరుల భావాలను అర్థం చేసుకోవడం, ఇతరులతో ఆత్మీయతను పంచుకోవడం, పెంచుకోవడమే సహానుభూతి. దీనివల్ల సకల జీవులను ఒకటిగా కలిపే మానవత్వమనే బంధం పరిమళిస్తుంది, సమాజంతో సంబంధాలు పెరుగుతాయి. సున్నితత్వం, సహానుభూతిని అలవరుచుకోవడం వల్ల వ్యక్తి మానసిక సమత్వాన్ని సాధిస్తాడు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను అధిగమించే సన్నద్ధత అలవడుతుంది. దయ, కరుణ, మైత్రి లాంటి ఉత్తమ గుణాలు వెలుగుచూస్తాయి. స్వీయ అవగాహన పెరుగుతుంది. ఆత్మ నిగ్రహణ అలవడుతుంది. వ్యక్తిగత బలాబలాలు, అంచనాలు అవగతం అవుతాయి. ఆధ్యాత్మిక భౌతిక జీవితాలను సమన్వయం చేసుకునే అంతర్గత సామర్థ్యం జాగృతమవుతుంది.వ్యక్తిలో సున్నితత్వం, సహానుభూతి నెలకొనడం వల్ల సహకార మనస్తత్వం వెలుగుచూస్తూ.. భౌతిక జీవిత వ్యవహారాలలో, ఎదుటివారి భావాలను అర్థం చేసుకోవడం, తద్వారా సమస్యలను పరిష్కరించడానికి, అభిప్రాయ భేదాలను, వివాదాలను నివారించడానికి సులువవుతుంది. సున్నితత్వం, సహానుభూతుల వల్ల వ్యక్తిగత భావోద్వేగాలను నిర్వహించుకోవడం, ఒత్తిడిని అధిగమించడం సాధ్యమవుతుంది. సహానుభూతి అనేది మానవ జీవ లక్షణం. మనచుట్టూ ఉండే ప్రపంచంతో సత్సంబంధాలను ఏర్పరుచుకొని వాటిని దీర్ఘకాలం కొనసాగించే ప్రయత్నం చేయడం సహానుభూతితో మాత్రమే సాధ్యపడుతుంది.

# నవ విశ్వం





## నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో మాజీ ఎస్పీకి పదేళ్ల జైలుశిక్ష

**చండీఘడ్-నవభూమి:** నకిలీ ఎన్‌కౌంటర్‌కేసులో మాజీ ఎస్పీకి పదేళ్ల జైలుశిక్ష విధించింది సీబీఐ కోర్టు. పంజాబ్‌లోని బియాస్‌లో ఎస్‌హెచ్‌వోగా చేసిన పరంజిత్ సింగ్‌కు ఈ శిక్ష పడింది. అతని వయసు 67 ఏళ్లు. 1993లో ఇద్దరు కానిస్టేబుళ్లను అమృత్‌సర్‌లో ఫేక్ ఎన్‌కౌంటర్ చేసినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. అయితే ఎస్పీగా అతను రిటైర్ అయ్యాడు. ఈ కేసులో మరో ముగ్గుర్ని దోషులుగా తేల్చింది కోర్టు. ఇన్‌స్పెక్టర్ ధరంసింగ్, ఏఎస్‌ఐ కశ్మీర్ సింగ్, ఏఎస్‌ఐ దర్బారా సింగ్‌లను దోషులుగా ప్రకటించారు. ఈ కేసులో మరో నిందితుడు ఎస్‌ఐ రామ్ లుబియా .. విచారణ సమయంలో మృతిచెందాడు. కానిస్టేబుల్ సుర్ముక్ సింగ్, కానిస్టేబుల్ సుఖ్వీందర్ సింగ్‌ను 1993, ఏప్రిల్ 18వ తేదీన పోలీసులు తీసుకెళ్లారు. వాళ్లను అక్రమంగా బంధించారు. ఆ తర్వాత మజీతా పోలీసులు ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను ఫేక్ ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. నాలుగు రోజుల తర్వాత ఆ ఇద్దరి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. సుర్ముక్‌ను అప్పటి ఇన్‌స్పెక్టర్ పరంజిత్ సింగ్, సుఖ్వీందర్‌ను ఎస్‌ఐ రామ్ లుబియా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఓ స్కూటరు చోరీ కేసులో ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను విచారించారు. నాలుగు రోజుల తర్వాత జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మిలిటెంట్లను కాల్చి వేసినట్లు మజీతా పోలీసు ధరం సింగ్ ప్రకటించారు. ఎన్‌కౌంటర్ అంశంలో విచారణ అవసరం లేదని పోలీసులు ఆ కేసును క్లోజ్ చేశారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1995, డిసెంబర్ 26వ తేదీన ఈ కేసులో సీబీఐ విచారణ మొదలుపెట్టారు. బాధితుల పేరెంట్స్ వాంగ్మూలాన్ని తీసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఇద్దర్ని సుఖ్వీందర్, సుర్ముక్‌గా సీబీఐ విచారణలో తేల్చారు. 1997, ఫిబ్రవరి 28వ తేదీన సీబీఐ కేసును రిజిస్టర్ చేసింది.

## హృదయ స్పందన రేటులో తేడాలు.. సీఎం స్టాలిన్ ఆరోగ్యంపై బులెటిన్ విడుదల



**చెన్నై-నవభూమి:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ సమయంలో సీఎంకు తలతిరగడంతో కుటుంబ సభ్యులు అన్నా సలైలోని గ్రీమ్స్ రోడ్డులోని అపోలో హాస్పిటల్ కు తరలించారు. మూడు రోజులుగా సీఎం అక్కడే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఆరోగ్యంపై అపోలో వైద్యులు బులెటిన్ విడుదల చేశారు. సీఎంకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో హృదయ స్పందన రేటులో వేరియేషన్స్ కనిపించిందని పేర్కొన్నారు. వాటిని సరిచేసేందుకు చికిత్స చేసినట్లు వెల్లడించారు.'సీఎంకు గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాం. ఈ పరీక్షల్లో సీఎం తలతిరుగుడుకు హృదయ స్పందన రేటులో కొన్ని తేడాలే కారణంగా తేలింది. దీనిని సరిచేసేందుకు ఇవాళ ఉదయం కార్డియాలజిస్ట్ డాక్టర్ జి. సెంగుట్టువేలు నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం సలహా మేరకు చికిత్స జరిగింది. ఈరోజు నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్ష కూడా సాధారణమే. ప్రస్తుతం సీఎం క్షేమంగా ఉన్నారు. రెండు రోజుల్లో ఆయన తన సాధారణ విధులను తిరిగి ప్రారంభిస్తారు' అని అపోలో వైద్యులు బులెటిన్‌లో తెలిపారు.

## ఇండియన్ టెకీలను తీసుకోవద్దు.. గూగుల్, మైక్రోసాఫ్ట్‌కు ట్రంప్ ఆదేశాలు !





**న్యూఢిల్లీ-నవభూమి:** గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి మేటి టెకీ కంపెనీలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. విదేశీ ఉద్యోగులను తీసుకోవడం ఆపేయాలన్నారు. ముఖ్యంగా ఇండియా లాంటి దేశం నుంచి టెకీలను రిక్రూట్ చేసుకోవద్దు అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఏఐ సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా కంపెనీలు స్వదేశంలో ఉద్యోగాలు క్రియేట్ చేయడంపై ఫోకస్ పెట్టాలన్నారు. చైనాలో ఫ్యాక్టరీలు నిర్మించడం కానీ, భారతీయ టెకీ ఉద్యోగులను రిక్రూట్ చేయడం లాంటివి వద్దన్నారు. టెకీ కంపెనీలు ప్రదర్శిస్తున్న గ్లోబల్ మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. ఇలాంటి విధానం వల్ల అనేక మంది అమెరికన్లు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. అమెరికా స్వేచ్ఛను వాడుకుని కొన్ని టాప్ టెక్ కంపెనీలు అధిక లాభాలు గడించినట్లు తెలిపారు. ఆ కంపెనీలు విదేశాల్లో ఎక్కువగా పెట్టుబడి పెట్టాయన్నారు. ట్రంప్ అధ్యక్ష హయంలో ఇక రోజులు ఉండవని ఆయన అన్నారు.

## హిమాచల్ లోయలో పడిన బస్సు.. 5గురు మృతి, 20 మందికి గాయాలు



**సిమ్లా-నవభూమి:** హిమాచల్ ప్రదేశ్ లోని మండి జిల్లాలో గురువారం ఉదయం బస్సుప్రమాదం జరిగింది. హెచ్‌ఆర్టీసీకి చెందిన బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో అయిదుగురు మృతిచెందగా, 20 మంది గాయపడ్డారు. సుమారు 25 మీటర్ల లోతుకు బస్సు దూసుకెళ్లింది. సర్కాఘాట్ నుంచి దుర్గాపూర్‌కు ఆ బస్సు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. సర్కాఘాట్ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగినట్లు మండి ఎస్పీ సాక్షీ వర్మ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. అయిదుగురు మృతిచెందారు. గాయపడ్డవారిని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్రిటికల్‌గా ఉన్న ప్యాసింజెర్లను బిలాస్‌పూర్ ఎయిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలను ఇంకా వెల్లడించలేదు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతున్నది. అవసరమైన చర్యలు తీసుకుంటామని, బాధితుల సంఖ్యను వెల్లడించనున్నట్లు ఎస్పీ సాక్షీ వర్మ తెలిపారు.

## రోడ్డుపై తలపడ్డ రెండు గుర్రాలు.. ఆటోలో ఇరుక్కుపోయి..



**జబల్‌పూర్-నవభూమి:**మధ్యప్రదేశ్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. నడిరోడ్డుపై రెండు గుర్రాలు తీవ్రంగా తలపడ్డాయి స్థానికులను బెంబేలెత్తించాయి. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.జబల్‌పూర్‌లో రద్దీగా ఉండే నాగరత్‌చౌక్ వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రెండు గుర్రాలు నడిరోడ్డుపై తీవ్రంగా తలపడ్డాయి. ఫైటింగ్ చేసుకుంటూ ముందుగా ఓ షోరూమ్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించాయి. ఆ తర్వాత రోడ్డుపైకి వచ్చి అందరినీ హడలెత్తించాయి. ఈ క్రమంలో ఓ గుర్రం రోడ్డుపై ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలోకి దూకి అందులోనే ఇరుక్కుపోయింది. ఎటూ కదల్లేక నానా తంటాలు పడింది. స్థానికులు దాన్ని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. దాదాపు 20 నిమిషాల పాటూ అశ్వం ఆటోలోనే చిక్కుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## ఎమర్జెన్సీ కోటా రూల్స్ మార్చిన రైల్వేశాఖ

**న్యూఢిల్లీ-నవభూమి:** ఎమర్జెన్సీ కోటా(ఈక్యూ) టికెట్ల కన్ఫర్మేషన్ కోసం రైల్వేశాఖ రూల్స్‌ను మార్చేసింది. సాధారణంగా వీఐపీలు, రైల్వే ఉద్యోగులు, మెడికల్ ఎమర్జెన్సీ ఉన్నావాళ్లు మాత్రమే ఈ కోటాలో టికెట్లు తీసుకుంటారు. అయితే చార్ట్ ప్రిపరేషన్‌కు ముందు గతంలో ఈక్యూ కోసం దరఖాస్తు సమర్పిస్తే, ఆ ప్రయాణికులు ఎమర్జెన్సీ కోటాలో టికెట్లు కన్ఫర్మ్ అయ్యేవి. ఇప్పుడు 8 గంటల ముందే ప్యాసింజర్ చార్ట్ ప్రిపేర్ చేస్తున్న నేపథ్యంలో ఈక్యూ టికెట్ల దరఖాస్తులను కూడా ముందుగా చేసుకోవాలని రైల్వేశాఖ తెలిపింది.

## అసలు ఆ దేశమే లేదు.. కానీ, ఇండియాలో ఎంబసీ.. వీడు మాములోడు కాదు!



**లక్నో-నవభూమి:**ఘరానా మోసానికి తెరతీసిన ఓ కేటుగాడి గుట్టురట్టు చేశారు ఉత్తరప్రదేశ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ఓ వ్యక్తి నకిలీ ఎంబసీని ఏర్పాటు చేసి ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నాడు. అసలు లేని దేశానికి ఎంబసీ పెట్టి, ఖరీదైన కార్లకు స్టిక్కర్లు వేసి, దౌత్య పాస్‌పోర్టులు సృష్టించి మోసాలకు తెరతీశాడు. ప్రముఖ నేతలతో పరిచయం ఉన్నట్లుట నకిలీ ఫోటోలను చూపిస్తూ పలువుర్ని నమ్మించాడు. అయితే, అతడి పాపం పండి చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు.


నిందితుడు హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తి ఒక పెద్ద ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. దానిని " వెస్ట్‌ఆర్కిటికా " పేరుతో ఎంబసీగా మార్చేశాడు. వెస్ట్ ఆర్కిటికా అనేది అంటార్కిటికాలోని ఒక ప్రాంతం. ఒకప్పుడు యూఎస్ నౌకాదళ అధికారి దీనిని దేశంగా ప్రకటించుకున్నాడు. కానీ దీనికి ఎటువంటి గుర్తింపు లేదు. జైన్ దీని పేరుతో విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చాలా మందిని నమ్మించాడు. అంతేకాదు మనీలాండరింగ్ కూడా చేస్తున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు అభియోగాలు మోపారు. యువతను నమ్మించేందుకు జైన్ చాలా తీవ్రంగా ప్రయత్నించాడు. రాష్ట్రపతి, ప్రధాని వంటి ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫోటోలను చూపించాడు. గతంలో 2011లో కూడా శాటిలైట్ ఫోన్ కలిగి ఉన్నాడని అతనిపై కేసు నమోదయింది. ఇటీవల ఎంబసీ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు అసలు విషయం తెలుసుకుని నకిలీ ఎంబసీ గుట్టు రట్టు చేశారు. వెస్ట్ ఆర్కిటికాతో పాటు 12 ఇతర దేశాల దౌత్య పాస్‌పోర్టులు, విదేశాంగ శాఖ స్టాంపులు ఉన్న పేపర్లు, 34 దేశాల స్టాంపులు, రూ.44 లక్షల డబ్బు, దౌత్య నంబర్‌ప్లేట్లు, ఖరీదైన కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**అసలు వెస్ట్ ఆర్కిటికా అనే దేశం ఉందా?**

2001లో అమెరికా నేవీ అధికారి ట్రావిస్ మెక్‌హెన్రీ వెస్ ఆర్కిటికాను దేశంగా ప్రకటించాడు. తనను తాను రాజుగా ప్రకటించుకున్నాడు. అంటార్కిటికాలో 6,20,000 చదరపు మైళ్ల మేర తనదే అని చెప్పాడు. ఆ దేశానికి 2,536 మంది పౌరులు ఉన్నారని చెబుతున్నా అక్కడ ఎవరూ నివసించరు. అంటార్కిటిక్ ఒప్పందంలోని కొన్ని లొసుగులను ఉపయోగించుకొని మెక్‌హెన్రీ తనను తాను పాలకుడిగా ప్రకటించుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం అంటార్కిటికాను శాంతియుత పనులకు, పరిశోధనలకు మాత్రమే ఉపయోగించాలి. మిలిటరీ కార్యక్రమాలు, అణ్వాయుధాలు, వ్యర్థాలు పడేయడానికి ఉపయోగించకూడదు. ప్రైవేటు వ్యక్తులకు ఈ నిబంధనలు వర్తించవు. ట్రావిస్ ఈ విషయాన్ని ఆసరాగా చేసుకున్నాడు.జైన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తాను ఆ దేశానికి చెందిన సంపన్నుడినని చెప్పుకున్నాడు.

2017 నుంచి దౌత్య కార్యాలయం నడుపుతున్నట్లు తెలిపాడు. అయితే ఆర్కిటిక్ ఉత్తర ధ్రువంలో ఉండగా అంటార్కిటికాలో ఎలా వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మారింది. "జేమ్స్ బాండ్ లా ఉండాలనుకుని అడ్డంగా దొరికిపోయాడు" అని పోలీసులు తెలిపారు. అంటే జైన్ ఒక సినిమా హీరోలా గొప్పగా ఉండాలని చూసి చివరికి దొరికిపోయాడని పోలీసులు అన్నారు.

## అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయం.. భారత్-అమెరికా సంయుక్త ప్రయోగం, నిసార్ శాటిలైట్‌తో ఎలాంటి మార్పులు?




**న్యూయార్కు-నవభూమి:** అంతరిక్ష పరిశోధనల్లో శక్తిమంతమైనవిగా పేరున్న రెండు దేశాలు కలిసి ప్రయోగం చేపడితే.. అదే, నిసార్ భారత్, అమెరికా కలిసి చేపట్టిన నిసార్ ఉపగ్రహం ప్రయోగం గురించి ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తున్న ఈ శాటిలైట్ ప్రయోజనాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ప్రకృతి విపత్తుల నిర్వహణ, భూ వాతావరణంలో మార్పుల అధ్యయనం, సముద్రాల అధ్యయనంలో ఊహించని మార్పులు చోటు చేసుకోనున్నాయి. రక్షణ వ్యవహారాల్లోనూ ఈ ఉపగ్రహం కీలకం కానుంది. అలాగని ఈ ప్రాజెక్టు లాంచ్ ప్యాడ్ పైకి ఎక్కడం అంత తేలికేం కాలేదు. దీని వెనుక నాసా, ఇస్రో శాస్త్రవేత్తల పదేళ్ల కృషి ఉంది. అంతరిక్ష రంగంలో అప్రతిహతంగా దూసుకెళ్తున్న భారత్.. మరో మెట్టు ఎక్కి చేపట్టిన ఈ మిషన్ ఆసక్తికర వివరాలు..నాసా (, ఇస్రో కలిసి ప్రయోగిస్తున్న ఈ శాటిలైట్‌కు అని పేరు పెట్టారు. సుమారు రూ.12,500 కోట్ల ఖర్చుతో ఈ మిషన్‌ను చేపట్టారు. ఈ ఉపగ్రహాన్ని జూలై 30న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ ద్వారా సాయంత్రం 5:40 గంటలకు ప్రయోగించేందుకు ముహూర్తం నిర్ణయించారు. ఈ రాకెట్.. నిసార్ ఉపగ్రహాన్ని భూమికి 743 కి.మీ. ఎత్తులో, 98.40 డిగ్రీల కోణంలో భూ కక్ష్యలో ప్రవేశపెడుతుంది.

కొత్త టెక్నాలజీని వాడుతున్నారు. ఇందులో రెండు రకాల రాడార్లు ఉన్నాయి. ఇవి దట్టమైన అడవుల్లో కూడా సమాచారాన్ని సేకరించగలవు. భూ పొరల్లో కదలికలు, భూమిపై తేమ శాతాన్ని కూడా కచ్చితంగా అంచనా వేయగలుగుతుందంటే నిసార్ శాటిలైట్ ఎంత కీలకమైనదో అర్థం చేసుకోవచ్చు. భూమిని పరిశీలించే వాటిలో ఇప్పటివరకు చాలా ఖరీదైనది ఈ ప్రయోగం.

నిసార్ ప్రత్యేకతలు

2,392 కిలోల బరువు ఉన్న నిసార్ ఒక ప్రత్యేకమైన భూ పరిశీలన శాటిలైట్.

ఇందులో నాసా -బ్యాండ్ , ఇస్రో -బ్యాండ్ ఉన్నాయి.

డ్యూయల్-ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపర్చర్ రాడార్‌తో భూమిని పరిశీలించే మొట్టమొదటి ఉపగ్రహం ఇదే.

ఈ నిసార్ శాటిలైట్ భూగోళ మొత్తాన్ని స్కాన్ చేయనుంది.

12 రోజుల వ్యవధిలోనే పగలు, రాత్రి డేటాతో పాటు వాతావరణ సమాచారాన్ని కూడా అందించనుంది.

నిసార్‌లోని రాడార్లు రోజుకు సుమారు 80 డేటాను ఉత్పత్తి చేస్తాయి. అంటే సుమారు 150.. 512 జీబీ హార్డ్ డ్రైవ్‌లను నింపేంత డేటాను అందిస్తుంది.

నిసార్ అందించే డేటాను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసి.. స్టోర్ చేసి, క్లౌడ్ ద్వారా అందరికీ అందుబాటులో ఉండేలా చేయనున్నారు.

నిసార్ అంటే నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ అని అర్థం. ప్రస్తుతం భూమిపై జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి నాసా-ఇస్రోలు ఈ నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధం అవుతున్నాయి. ఈ చారిత్రాత్మక మిషన్.. భూ ఉపరితలం, మంచు పర్వతాలపై జరుగుతున్న చిన్న చిన్న మార్పులను గతంలో ఎన్నడూ లేనివిధంగా పూర్తి వివరాలతో నమోదు చేయనుంది. వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాల పర్యవేక్షణ, సముద్రపు మంచు, హిమానీనదాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి హై రిజల్యూషన్ ఫోటోలను షేర్ చేస్తుంతి.

నిసార్ ప్రయోజనాలు

**1. భూమిపై కదలికలు**

భూమిపై ప్రతి కదలికలను నిసార్ పసిగడుతుంది. అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూమిని పరిశీలించేందుకు స్వీప్‌సార్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. భూమి, ఉపరితల భూ పొరలు, మంచు కదలికలు, వృక్ష సంపదలో మార్పులను ఇది కొలుస్తుంది. నిసార్ శాటిలైట్.. సెంటీమీటర్ల మార్పులను కూడా కొలవగలదని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నిసార్ శాటిలైట్ అందించే డేటా ప్రపంచవ్యాప్తంగా సహజ వనరులు, ప్రమాదాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని నాసా పేర్కొంది. వాతావరణ మార్పుల ప్రభావాలు, వాటి వేగాన్ని అర్థం చేసుకునేందుకు శాస్త్రవేత్తలకు సమాచారాన్ని అందిస్తుందని తెలిపింది.

**2. సముద్రాల అధ్యయనం**

ఉపగ్రహం నీటి లోతును కూడా కొలుస్తుంది. దీన్ని 'బాతిమెట్రిక్ సర్వే' అంటారు. ఇది కరిగే హిమానీనదాలు, సముద్ర మట్టం పెరుగుదల, కార్బన్ నిల్వలలో మార్పులను అర్థం చేసుకొని, చర్యలు తీసుకునేందుకు దోహదపడుతుంది.

3. ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టడం

నిసార్ శాటిలైట్ భూమి పొరల్లో కదలికలు, సముద్ర భూభాగంలో మార్పులను కూడా గుర్తించగలదు. తద్వారా సునామీలు, భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడటం లాంటి ప్రకృతి వైపరీత్యాలను ముందే గుర్తించడానికి ఆస్కారం కలుగుతుంది. ఈ ఉపగ్రహం ద్వారా పర్యావరణ వ్యవస్థ, కార్బన్ సైకిల్, భూమి వాతావరణంలో మార్పులను, ఇతర ప్రభావాలను తెలుసుకోవచ్చు. తద్వారా ప్రజలకు వెంటనే హెచ్చరికలు జారీ చేయడం మరింత సులభం అవుతుంది.

**4. రక్షణ వ్యవహారాల్లో కీలకం**

ఈ శాటిలైట్ ద్వారా తీర ప్రాంతాలను పరిశీలించడం, ఓడలను కనిపెట్టడం, శత్రు దేశాల కదలికలపై నిఘా ఉంచడం కూడా వీలవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

భారత్, అమెరికా జాయింట్ ఆపరేషన్

నాసా, ఇస్రోల మధ్య మొదటి ఉమ్మడి ఉపగ్రహ మిషన్‌గా ఈ నిసార్ నిలవనుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వాషింగ్టన్‌లో భేటీ అయిన నరేంద్ర మోదీ-డొనాల్డ్ ట్రంప్‌లు ఈ మిషన్‌ను భారత్-అమెరికా పౌర అంతరిక్ష సహకారానికి కీలకమైన సంవత్సరంగా అభివర్ణించారు. నిసార్‌లో భారత్, అమెరికా సమాన భాగస్వామ్యం ఉంది. అంతేకాకుండా నాసా, ఇస్రో మధ్య తొలి హార్డ్‌వేర్ సహకారాన్ని ఈ ప్రయోగం సూచిస్తుంది. ఈ ప్రయోగానికి కావాల్సిన రాడార్ సిస్టమ్‌లు, కమ్యూనికేషన్ టెక్నాలజీ, సైంటిఫిక్ డివైజ్‌లను నాసా అందించింది. స్పేస్ క్రాఫ్ట్, లాంచింగ్ వెహికల్, ఆపరేషనల్ సపోర్ట్‌ను ఇస్రో అందిస్తోంది. నాసా తరఫున జేపీఎల్ సంస్థ ఈ ప్రాజెక్టుకు పనిచేస్తుండగా.. బెంగళూరులోని యూఆర్ రావు ఉపగ్రహ కేంద్రం, అహ్మదాబాద్‌లోని ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఇస్రో వైపు పనిచేస్తున్నాయి.

## కోహినూర్ డైమండ్.. సామ్రాజ్యాల అంతం చూసిన ఈ వజ్రం అసలైన కథ ఇదే!



**న్యూఢిల్లీ-నవభూమి:**అమృతం తాగి అమరత్వం పొందిందేమో కోహినూర్.. అనేలా ఈ వజ్రం ఆశ్చర్య పరుస్తోంది. రాజ్యాలు, రాజులు చరిత్రలో కలిసిపోయినా.. చరిత్ర పుటలన్నీ తన పేరుతో నింపేసుకుంటోంది. తనను దక్కించుకున్నామని విర్రవీగిన వారిని కాలగర్భంలో కలిపేసి.. తాను ఎవ్వరికీ సొంతం కాదని ఎలుగెత్తి చాటుతోంది. ప్రపంచంలో తనకు పోటీలేదని, తన మెరుపునకు ఏదీ సాటిలేదని సగర్వంగా నిలుస్తోంది. కోహినూర్ పేరు తెలియని వారుండరేమో గానీ.. ఈ వజ్రం చరిత్ర గురించి మాత్రం వినుండరు!పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన 'హరిహర వీరమల్లు' సినిమాలో కోహినూర్ ప్రస్తావన ఉంది. కథ మొత్తం కోహినూర్ వజ్రం చుట్టే తిరుగుతందట. తెలుగు గడ్డపై పుట్టి ఎందరో పాలకుల చేతులు మారి బ్రిటీష్ రాణి కిరీటంలోకి చేరిన ఈ వజ్రం గురించి ఇప్పుడు చర్చ జరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కోహినూర్ వజ్రం గురించి ఆసక్తికర వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

కోహ్-ఇ-నూర్ అంటే వెలుగులు విరజిమ్మే కొండ అని అర్థం. కోహినూర్ ఎక్కడ పుట్టిందో అనే అంశంపై చాలా ఊహాగానాలున్నాయి. అయితే, చాలా మంది చరిత్ర కారులు.. వజ్రాలకు ప్రసిద్ధి చెందిన గోల్కొండ ప్రాంతంలో (అంటే ఇప్పటి రాయలసీమ, ఆంధ్రప్రదేశ్) మొదటిసారి కోహినూర్ వజ్రం దొరికిందని చెబుతారు. కచ్చితంగా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కొల్లూరులో లభించిందని అంటారు.కోహినూర్ మొదటి యజమానులు కాకతీయులేనని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. ఆ కాలంలో ఈ వజ్రం కాకతీయుల కులదేవత, వరంగల్‌లో ఉన్న భద్రకాళి అమ్మవారి ఆలయంలో అలంకరణగా ఉండేదని కొందరంటారు. ఇక మరికొందరు.. అమ్మవారికి ఎడమ కన్నుగా ఉండేదని చెబుతారు. దీనిపై కచ్చితమైన సమాచారం మాత్రం లేదు.

**హరి హర వీరమల్లు మూవీ రివ్యూ**

కాకతీయ సామ్రాజ్యపు చివరి రాజు ప్రతాపరుద్రుడి కాలంలో ఈ వజ్రం తురుష్కుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చరిత్రకారులు తెలిపారు. తురుష్కులు.. కాకతీయ రాజ్యంపై ఎనిమిది సార్లు దండెత్తినట్లు విలస తామ్రశాసనం, కలువ చెరువు శాసనాల ద్వారా తెలుస్తోంది. ముస్లిం చరిత్రకారులు చేసిన రచనల్లో 5 సార్లు దండయాత్ర చేసినట్లు పేర్కొన్నాయి.ఢిల్లీ సుల్తాను అల్లాఉద్దీన్ ఖిల్జీ 1304లో కాకతీయ రాజ్యంపైకి మాలిక్ కాఫుర్‌ను యుద్ధానికి పంపించాడు. కాఫుర్‌తో ప్రతాపరుద్రుడు సంధి చేసుకున్నాడని.. సంధిలో భాగంగా అతడి వద్ద నుంచి అపారమైన సంపద తీసుకున్నాడని చరిత్రకారులు పేర్కొన్నారు. ఇందులో కోహినూర్ డైమండ్ కూడా ఉందట.

14వ శతాబ్దం ప్రారంభం నుంచి ఖిల్జీ రాజ వంశాల దగ్గరే కోహినూర్ వజ్రం ఉందట. 1526 నాటికి ఇబ్రహీం లోడీని ఓడించి మొఘల్ రాజ్యాన్ని స్థాపించిన బాబర్ చేతికి ఈ వజ్రం వచ్చింది. 'బాబర్ నామా'లో ఈ వ్రజం గురించి ప్రత్యేకంగా రాశాడు బాబర్. దాన్ని తనకు సుల్తాన్ ఇబ్రహీం లోడి బహుమతిగా ఇచ్చాడని పేర్కొన్నాడు. ప్రపంచం మొత్తంమీద ఒక్క రోజు ఉత్పత్తి అయ్యే సంపద.. కోహినూర్ వజ్రంతో సమానమని నాడు బాబర్ పేర్కొన్నాడు.

ఆ తర్వాత తాజ్ మహల్ కట్టించిన షాజహాన్ చేతికి కోహినూర్ వజ్రం చేరింది. షాజహాన్ దాన్ని నెమలి సింహాసనంలో పొందుపరిచాడు. ఢిల్లీ ఎర్ర కోటలోని దివాన్-ఇ- ఖస్‌లో ఈ నెమలి సింహాసనాన్ని ఏర్పాటు చేశారు. నాడు ప్రపంచంలోనే అత్యంత ధనవంతులుగా మొఘల్స్ ఉండేవారు. అలా బాబర్ నుంచి ఔరంగజేబు వరకు ఈ డైమండ్ మొఘల్ వంశ వారసుల చేతులు మారుతూ వచ్చింది.

కోహినూర్‌కు పేరు పెట్టింది అతడే..

1739లో పర్షియన్ రాజు నాదిర్ షాభారత్‌పైకి దండయాత్రకు వచ్చాడు. ఔరంగజేబు మనవడైన సుల్తాన్ మహమ్మద్ రాజ్యంపై కన్నేశాడు. ఈ క్రమంలో సుల్తాన్ మహమ్మద్ నాదిర్ షాకు లొంగిపోయాడు. అత్యంత ఖరీదైన వజ్రాన్ని నాదిర్ చేతుల్లో పెట్టాడు సుల్తాన్ మహమ్మద్. దీంతో ఆ వజ్రం నాణ్యత, మెరుపును చూసి నాదిర్ షా.. దానికి కోహినూర్ (%ఖశీష్త్ర-ఇ-చీశీశీ%) అని పేరు పెట్టాడు. కోహినూర్ అంటే వెలుగులు విరజిమ్మే కొండ అని అర్థం. అంతకుముందు వరకూ దీన్ని 'శమంతక మణి' అని పిలిచేవారట. ద్వాపర యుగంలో సత్యభామ తండ్రి దగ్గర ఉన్న మణి ఇదేనని చెబుతారు.కోహినూర్‌ను ఎత్తుకెళ్లిన నాదిర్ షా.. పర్షియా (ఇరాన్) వెళ్లిపోయాడు. అక్కడ నాదిర్ షా కోహినూర్‌ను.. తన బంగారు సింహాసనంలో పొదిగినట్లు కొందరు అంటారు. అయితే ఢిల్లీలో ఉన్న బంగారం సింహాసనాన్ని తీసుకెళ్లాడని ఇంకొందరు చెబుతారు. ఇదిలా ఉండగా.. 1747లో నాదిర్ షా దారుణంగా హత్యకు గురయ్యాడు. దీంతో కోహినూర్ వజ్రం.. నాదర్ జనరల్స్‌లో ఒకడైన అహ్మద్ షా దుర్రాని చేతుల్లోకి వెళ్లింది. ఆఫ్గనిస్థాన్‌లో దుర్రాని సామ్రాజ్యాన్ని స్థాపించింది ఇతనే. కోహినూర్ ఇక్కడే దాదాపు 70 ఏళ్లు ఉంది. కోహినూర్‌ను అహ్మద్ షా దుర్రాన్ని వారసుడు.. షుజా దుర్రాని 1813లో తిరిగి ఇండియాకు తీసుకువచ్చాడు. అప్పుడే.. సిక్కు రాజ్యాం స్థాపించిన మహారాజా రంజిత్ సింగ్‌కు ఇచ్చాడు. దీనికి ప్రతిఫలంగా అఫ్గాన్ రాజ్యాన్ని షా షుజా దుర్రాని దక్కించుకునేందుకు రంజిత్ సింగ్ సహాయం చేశాడు. ఆ సమయంలోనే సిక్కుల స్వయం ప్రతిపత్తికి కోహినూర్ ఓ సింబల్‌గా మారింది.

## భారత్-పాక్ గగనతల వివాదం..

### పాకిస్థాన్ విమానాలపై నిషేధం పొడిగింపు, ఎప్పటి వరకంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశం తన గగనతలంలోకి పాకిస్థాన్ విమానాల ప్రవేశంపై విధించిన నిషేధాన్ని ఆగస్టు 24వ తేదీ వరకు పొడిగించింది. బుధవారం రోజు కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి పాక్‌కు చెందిన అన్ని రకాల విమానాలపై ఈ నిషేధం ఉంటుందని స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మళ్లీ ఈ పొడగింపు చేశారు. దీనికి ప్రతిస్పందనగా.. పాకిస్థాన్ కూడా భారతీయ విమానాలను తమ గగనతలంలోకి అనుమతించకుండా విధించిన నిషేధాన్ని ఆగస్టు 24వ తేదీ వరకు పొడిగించింది.ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ గగనతలంలోకి పాక్ ప్రవేశించకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధాన్ని విధించింది. మొదట మే 24వ తేదీ వరకు గగన తలాన్ని మూసివేయగా.. దాన్ని మళ్లీ జూన్ 24వ తేదీ వరకు పొడగించింది. ఆ తేదీ దగ్గరకు రావడంతో.. మళ్లీ జులై 24వ తేదీ వరకు పొడగించింది. ఇప్పుడు ఈ తేదీ కూడా దగ్గరకు వచ్చిన నేపథ్యంలోనే మరోసారి ఆగస్టు 24వ తేదీ వరకు పొడగించింది. ఇదే తరహాలో పాకిస్థాన్ సైతం తన గగన తలంలోకి భారత్ విమానాలకు నిషేధం విధించింది.ఈ పరిణామాల మధ్యనే భారత వైమానిక దళం రాజస్థాన్‌లో భారత్-పాకిస్థాన్ సరిహద్దు వెంబడి భారీ స్థాయి విన్యాసాలను ప్రారంభించింది. జూలై 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఈ వ్యాయామాలు బార్మర్ నుంచి జోధ్‌పూర్ వరకు విస్తరించి ఉన్న ప్రాంతాలను కవర్ చేస్తాయి. ఇలాంటి సైనిక కార్యకలాపాల సమయంలో పౌర విమానాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు 'నోటీస్ టు ఎయిర్‌మెన్' జారీ చేశారు. ఇది సాధారణంగా విమానాలను అనుమతించని ప్రత్యేక గగనతల ప్రాంతాలను సూచిస్తుంది. పౌర ప్రాణ నష్టాన్ని నివారించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.ఈ ప్రాంతంలో వైమానిక విన్యాసాలు నిర్వహించడం, గగనతల నిషేధాన్ని పొడిగించడం వంటి చర్యలు సరిహద్దులో భద్రతను బలోపేతం చేయడంలో భారత్ నిబద్ధతను తెలియజేస్తున్నాయి. ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ మే 7వ తేదీన 'ఆపరేషన్ సింధూర్'ను ప్రారంభించింది. ఆ సమయంలో కూడా ఇలాంటి నోటమ్‌నే జారీ చేసింది. అది పాకిస్థాన్‌తో ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది.

ఇలా ఇరు దేశాల మధ్య ఉన్న వివాదం వలన అంతర్జాతీయ విమానయాన మార్గాలు కూడా ప్రభావితం అవుతున్నాయి. ఫలితంగా ప్రయాణ సమయాలు పెరిగి, ఖర్చులు అధికమవుతున్నాయి. ఇరు దేశాలు శాంతియుత పరిష్కారం కోసం చర్చలు జరుపుతున్నప్పటికీ.. సరిహద్దుల్లోని ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



# వర్షాకాలంలో తినాల్సిన పదార్థాలు



వర్షాకాలం రాగానే మన ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం అవుతుంది. ఈ కాలంలో తేమ ఎక్కువగా ఉండటంతో వైరస్‌లు, బ్యాక్టీరియా వేగంగా వ్యాపిస్తాయి. అందుకే మన ఆహారపు అలవాట్లను సజాగ్రత్తగా అనుసరించాలి. అల్లం, అవల, అజ్వైన్ వంటి పదార్థాలు వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. వేడి ద్రవ పదార్థాలు, సూపులు, అల్లం టీ వంటి పానీయాలు శరీరాన్ని వేడిగా ఉంచుతాయి. అరటిపండు, అవిసె ఆకులు, అమృతవల్లి వంటి ప్రకృతినిర్మిత పదార్థాలు శక్తిని ఇవ్వడమే కాదు, జీర్ణవ్యవస్థను కూడా బలపరుస్తాయి. పొడిగా వండిన భోజనాలు, కొవ్వు తక్కువగా ఉండే ఆహారం వర్షాకాలానికి తగినవే. పుచ్చకాయ, మెలన్ వంటి నీటిమిక్కిలి పండ్లను పరిమితంగానే తీసుకోవాలి, ఎందుకంటే వర్షాకాలంలో అవి సులభంగా పాడవుతాయి. బయట ఫుడ్ తీసుకోవడం, రోడ్డుపై అమ్మే పదార్థాలు తినడం వల్ల హానికరమైన సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. అందుకే ఇంట్లోనే తయారు చేసిన స్వచ్ఛమైన ఆహారాన్ని, వేడి పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. తీపి పదార్థాల్లో పాలతో చేసిన మిఠాయిలను వర్షాకాలంలో వదిలేయడమే మంచిది, ఎందుకంటే అవి త్వరగా పాడవుతాయి. అంతేగాక, వేపాకులు, నిమ్మకాయ, పుదీనా వంటి చల్లదనాన్ని కలిగించే పదార్థాలను జాగ్రత్తగా వినియోగించాలి, ఎందుకంటే ఇవి కొన్నిసార్లు జలుబుకు దారితీసే అవకాశమూ ఉంటుంది. వర్షాకాలంలో శరీరాన్ని లోపల నుంచి బలపరిచే పోషక పదార్థాలను సరైన మోతాదులో తీసుకోవడం ఆరోగ్యానికి అవసరం.

# దివ్యాంశి కథ

## యువతకు స్ఫూర్తి, దేశానికి గర్వకారణం

**దివ్యాంశి భౌమిక్ పేరు ఇప్పుడు టేబుల్ టెన్నిస్ ప్రపంచంలో కొత్త ధ్వని. ఉజ్బెకిస్తాన్ తాష్కెంట్‌లో జరిగిన 'ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్'లో ఆమె సాధించిన స్వర్ణం ఒక్కటే కాదు - అది భారతీయ టేబుల్ టెన్నిస్‌కు కొత్త దిక్సూచి. ముప్పై ఆరేళ్ల తరువాత మనదేశం ఆ టైటిల్‌ను తలచుకోవడం ముదావహం. కానీ ఆ పతకానికి వెనుక దాగిన కృషి, త్యాగం, కుటుంబం బలగం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, కరోనా సమయంలో జరిగిన మార్పులు అన్నీ కలసి వచ్చిన సాధన గాథ ఇది.**



దివ్యాంశి మొదట్లో టేబుల్ టెన్నిస్‌ను ఒక ఆటగానే చూసింది. ముంబైలో ఓ మంచి స్కూల్‌లో చదువుకుంటున్న ఆమెకు క్రీడ తప్పనిసరి. స్కూల్ నియమాల మేరకు టేబుల్ టెన్నిస్‌ను ఎంపిక చేసింది. కానీ అది ఆమె జీవితాన్ని మార్చేస్తుందని ఎవరు ఊహించగలరు? ఆ ఆడకూ, దాని పట్ల ఆమె ఆసక్తికీ మధ్య నలుగురి కథలు ఉన్నాయి కుటుంబంతో మొదలయ్యే కథలు.

తండ్రి రాహుల్ ఒక బహుళజాతి సంస్థలో ఉన్నత స్థాయి ఉద్యోగి. మాంద్యం సమయంలోనూ, కరోనా సమయంలోనూ పనిలోనూ ఇంటికీ సమయాన్ని కేటాయించిన వ్యక్తి. అక్క హితాంశితో కలిసి ఆటలాడుతూ దివ్యాంశి కొద్దిగా కొద్దిగా గేమ్ పట్ల ఆసక్తి పెంచుకుంది. కరోనా లాక్‌డౌన్ దానికే అనుకూలంగా మారింది. ఇంట్లో టేబుల్ టెన్నిస్ మెజానైన్‌లో నిలబడినప్పుడు ఆటే ఊపిరి అయిపోయింది.

ఈ ఆసక్తి ఒక్కసారిగా అవకాశాలుగా మారలేదు. మొదట్లో స్థానిక క్లబ్ కోచ్ వద్ద శిక్షణ. తర్వాత మొదటి రాష్ట్రస్థాయి పోటీలో సెమీ ఫైనల్స్‌కు చేరడంతో తండ్రికి స్పష్టమైంది అమ్మాయి ఆటను ప్రేమిస్తుంది. కుటుంబం పూర్తి స్థాయిలో మద్దతివ్వడమే ఆమె గమ్యానికి మొదటి మెట్టు అయింది.

2022 నాటికి ఆమె రాష్ట్ర జట్టులో చోటు సంపాదించింది. జాతీయ స్థాయిలో ఏడు పతకాలు సాధించింది. అంతే కాదు, అంతర్జాతీయ స్థాయిలో పదకొండు WTTC యూత్ కంటెండర్ టైటిల్స్ గెలుచుకుంది.

2023 వరల్డ్ యూత్ ఛాంపియన్ షిప్ డబుల్స్‌లో స్వర్ణ పతకం ఆమె మలుపు.

అయితే ఏషియన్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె సాధించిన గెలుపు ఒక చరిత్ర. చైనా క్రీడాకారిణుల ఆధిపత్యాన్ని ఛేదిస్తూ, మూడు చైనా క్రీడాకారిణులను ఓడించి స్వర్ణం గెలవడం అనేది ఆమె అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఘట్టం. అండర్-15 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న దివ్యాంశికి ఇప్పుడు ప్రతి అడుగు ఒలింపిక్ లక్ష్యంపై కేంద్రీకృతమైంది.

క్రీడలో సాంకేతికత ఒక్కటే కాదు మానసిక మౌలికత కూడా అత్యంత అవసరం. "ప్రతి మ్యాచ్ ఏదో ఒక పాఠం నేర్పుతుంది. అంతటితో ఆగిపోవాలన్న ఆలోచనే నాకు ఉండదు" అంటుంది దివ్యాంశి. శారీరక శ్రమ, మానసిక శాంతి, వ్యూహాత్మక ఆలోచనలు ఆమె ఆటలో ప్రతిబింబిస్తాయి. బెంగళూరులో జరిగే కోచింగ్ క్యాంప్స్‌కు తరచూ ప్రయాణాలు, వాటి మధ్యలో పరీక్షలకు సిద్ధమవడం, చదువును నిర్లక్ష్యం చేయకూడదన్న వ్యక్తిగత బాధ్యత - ఈ సమతుల్యతే ఆమెని మరింత స్పష్టతతో ముందుకు నడిపిస్తోంది.

తండ్రి తల్లిదండ్రుల ఒత్తిడి లేదన్న మాట వాస్తవమే. కానీ దివ్యాంశి తన విద్యా ప్రాధాన్యతను ఎప్పుడూ మరచిపోలేదు.



రాత్రివేళల్లో చదువు, ఉదయాన్నే శిక్షణ, పతకాల వెనుక ఉన్న అసలైన పోరాటం ఇది. ఈ పోరాటంలో ఆమె ఒంటరి కాదు - కుటుంబం, కోచ్‌లు, టీమ్‌మెంబర్స్ అందరూ ఆమెకు అండగా నిలిచారు. ఒక వ్యక్తి ఎదుగుదల కుటుంబ వ్యవస్థపై ఎంతవరకు ఆధారపడుతుందో ఆమె కథ సాక్ష్యంగా నిలుస్తోంది.

2028 ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే ఆమె తుదిలక్ష్యం. "ఒలింపిక్స్‌లో గెలిస్తే దేశానికి అందం, క్రీడాకారుడికి గౌరవం, కుటుంబానికి గర్వం" అంటుంది దివ్యాంశి. ఆమె మాటల్లో ఆశ, కళ్లలో ఆత్మవిశ్వాసం, ఆటలో ధైర్యం ఉన్నాయి. మరి ఇలాంటి కథలు మనలో ప్రతి చిన్నారికి కొత్త ఆశను పుట్టించవు కదా? ఒక్క దివ్యాంశి కాదు - భారత క్రీడా రంగంలో యువత పునర్నిర్మాణం చేస్తోంది. ఆమె విజయం, ఒక స్ఫూర్తి. దేశంలో ఉన్న క్రీడాకారిణులలో పల్లె, పట్టణం, మధ్యతరగతి కుటుంబాల నుంచి వస్తున్న ప్రతిభను గుర్తించాలన్న అవసరాన్ని ఈ కథ గుర్తు చేస్తోంది. ప్రభుత్వ స్థాయిలో మరింత శిక్షణా అవకాశాలు, మౌలిక వసతులు కల్పిస్తే మరెన్ని దివ్యాంశిలు దేశానికి పతకాలు తీసుకురాగలరన్న ఆశ ఉంది.

దివ్యాంశి భౌమిక్ పేరు ఇప్పుడు పతకాలతో పోలికగా మారింది. "రాకెట్ పడితే పతకాల పంట" అన్న మాట ఆమె జీవితం మీద వాస్తవం అయ్యింది. ఓ బాలికగా మొదలైన ఆమె ప్రయాణం - ఒక యోధురాలిగా మారిన క్రీడాపథం - నవభూమికి ప్రత్యేకంగా వెలుగుల్ని ప్రసరించగల కథ.

# ఊబకాయానికి ఇది కూడా కారణమే



ఆహారపు అలవాట్లపై ఒక మహిళా దృష్టికోణం..పగలంతా అలసిపోయిన శరీరంతో, మనసంతా కుటుంబానికి అంకితమై ఉండే అమ్మ చేతులు, సాయంత్రం స్టౌవ్ మీద దిగి వంట మీద పడతాయి. ఇంటి కోసం, పిల్లల ఆరోగ్యం కోసం, భర్త తృప్తికోసం... ఇలా చూస్తే ప్రతి వంట కూడా ప్రేమతో ముడిపడి ఉంటుంది. కానీ అదే వంట... అదే కుటుంబ భోజనాల పద్ధతి... ఆరోగ్యానికి శత్రువవుతుందని మీరు ఊహించారా?

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తాజా అధ్యయనం ప్రకారం, మన ఇంట్లో అందరికీ ఒకే విధంగా వండే అలవాటు అదే ఊబకాయానికి కారణం కావచ్చు. కుటుంబంలో శారీరక శ్రమ వేరు, వయస్సు వేరు, ఆరోగ్య అవసరాలు వేరు కానీ అన్నింటికీ ఒకే వంట... దీన్నే వైద్యులు 'పోషక అసమతుల్యత' అంటున్నారు.

ముఖ్యంగా మహిళలు... తింటే చివరకి తింటారు, మిగిలిందంతా తింటారు. వాళ్లకు పోషకాలు అవసరమే అన్నదే మర్చిపోతారు. శ్రమ ఉంది, జీవితం ఉంది, బాధ్యతలూ ఉన్నాయి - కానీ శరీరానికి కావాల్సిన పౌష్టికాహారమే లేదు.



**వంట వనరుగా మారాలంటే?**

ఒక పెద్ద మార్పు మొదలవ్వాలంటే చిన్న అలవాటు చాలు. వంటపనిలో భాగస్వామ్యం మొదలు కావాలి. వంటగది ఒక్కరి రాజ్యంగా కాక, కుటుంబ ఆరాధనగా మారాలి. భర్తలు, పిల్లలు... అందరూ చేతులు కలిపితే, భారమేమీ కాదు రోగ్యమే సిద్ధిస్తుంది.

పిల్లల అవసరాలకు తగిన కూరగాయలు, భర్త ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నూనె వంటలు, తల్లిగా తినాల్సిన పోషకాలతో కూడిన ప్రత్యేక వంటలు... ఇలా సన్నివేశం మారాలి.

మిల్లెట్స్, ఆవిరి కూరలు, సంప్రదాయ రుచులు

అన్నం బదులు మిల్లెట్స్ (సిరిధాన్యాలు), వేపుడు బదులు ఆవిరి కూరలు, తీపి బదులు పండ్ల మాధుర్యం ఇలా మనం ఎంచుకునే ప్రతి చిన్న మార్పు శరీరాన్ని తేలిక చేస్తుంది, మనసుని తృప్తి చేస్తుంది.

అందుకే కుటుంబమంతా కలిసి వంట చేస్తే, అది ఊబకాయం కంటే ఒబేసిటీకి చికిత్స అవుతుంది. నిత్యం సెడెంటరీ లైఫ్‌స్టైల్‌లో కూర్చున్న జీవితం నుంచి బయటపడేందుకు ఇది ఒక మంచి అడుగు.

వ్యాయామం, నియమిత భోజనాలు తప్పనిసరి

రాత్రిపూట ఆలస్యంగా తినటం, టీవీ ముందు తినటం, శారీరక కదలిక లేకపోవడం... ఇవన్నీ ఒక్కొక్కటిగా చొరబడి శరీరాన్ని చీల్చేస్తాయి. కాబట్టి కనీసం రోజుకు అరగంట సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి. కుటుంబమంతా కలిసి ఇంట్లోనే భోజనం చేయాలనే నిబద్ధత ఉండాలి.

కుటుంబంలో ఆరోగ్య సంస్కృతి మొదలు పెట్టండి

ఈ కథ ఒక మహిళకే కాదు ప్రతి ఇంటి కథే. వంటతో ప్రేమను చూపించే దారిలో, ఆ ప్రేమతోపాటే ఆరోగ్యాన్ని చేరవేయగలగాలి. మన భోజనం... మన జీవన విధానం... మన ఆరోగ్యం ఇవన్నీ కుటుంబమంతా కలసి పంచుకునే బాధ్యత. ప్రేమతో వడ్డించే ప్రతి తినుబండారంలో పోషకాలు ఉండాలి అదే నిజమైన 'సహ పాఠం'!



# ఆహారం జీర్ణం కాలేదా ?

## ఈ చిట్కాలు పాటించండి..!



తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే ఎవరికైనా ఇబ్బందిగానే ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు అజీర్ణం కారణంగానే వస్తాయి. ఇవి వచ్చాయంటే ఎవరైనా మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరికి జీర్ణాశయంలో మంట పుడుతుంది కూడా. ముఖ్యంగా పొట్ట పై భాగంలో ఇలా అనిపిస్తుంది. కొవ్వు పదార్థాలు, ఫ్రై చేయబడిన ఆహారం, ఇతర జంక్ ఫుడ్స్ తినడం కారణంగా ఎవరికైనా అజీర్ణ సమస్య వస్తుంది. అలాగే వేళ తప్పించి భోజనం చేయడం, మద్యపానం, ధూమపానం, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్ తదితర కారణాల వల్ల కూడా కొందరిలో అజీర్ణ సమస్య వస్తుంటుంది. అయితే కింద సూచించిన పలు చిట్కాలు పాటిస్తే అజీర్ణ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరి ఆ **చిట్కాలు ఏమిటో ఇప్పుడు చూద్దామా..!**

1. అజీర్ణ సమస్యకు అల్లం చక్కని పరిష్కారాన్ని చూపుతుంది. ఒక గ్లాస్ నీటిలో కొద్దిగా అల్లం ముక్కలు వేసి ఆ నీటిని బాగా మరిగించాలి. అనంతరం అల్లంలో ఉండే సారం ఆ నీటిలోకి చేరుతుంది. అప్పుడు ఆ నీటిని వేడిగా ఉండగానే తాగేయాలి. ఇలా చేయడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. అజీర్ణ సమస్య బాధించదు. అలాగే అల్లం ముక్కలను దంచి రసం తీసి ఆ రసాన్ని సేవించినా చాలు, సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.
2. ఒక గ్లాస్ నీటిలో కొద్దిగా బేకింగ్ సోడాను కలిపి తాగితే అజీర్ణ సమస్య బాధించదు. నీటికి బదులుగా తేనె, నిమ్మరసంలను కూడా ఉపయోగించవచ్చు.
3. ఒక గ్లాస్ నీటిలో 1 టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలిపి తాగితే అజీర్ణ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అవసరం అనుకుంటే ఆ మిశ్రమంలో తేనె కూడా కలుపుకోవచ్చు.
4. ఒక గ్లాస్ నీటిలో కొన్ని సోంపు గింజలను వేసి బాగా మరిగించాలి. అనంతరం ఆ నీటిని వడకట్టి వేడిగా ఉండగానే తాగాలి. దీంతో ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.
5. గుప్పెడు వాము తీసుకుని అందులో కొంత ఉప్పు వేసి బాగా నలిపి ఆ మిశ్రమాన్ని తినాలి. వెంటనే నీరు తాగాలి. దీంతో గ్యాస్, అసిడిటీ, అజీర్ణం తగ్గుతాయి.



# అందానికి ఆజ్యం

భారతీయుల ఆహారంలో నెయ్యికి ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. ఆరాధనలోనూ నెయ్యికి అగ్రాసనమే. ఆజ్యం, ఘృతం దీనికి పర్యాయపదాలు. మనం ఇష్టంగా ఆరగించే నెయ్యిలో ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఈ కారణంగానే దీన్ని వందల ఏండ్లుగా భారతీయ సంప్రదాయ సౌందర్య సాధనాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు. ఆజ్యం అందం పెరగడానికీ ఉపకరిస్తుందన్నమాట!



**మాయిశ్చరైజర్‌గా**

నెయ్యి చర్మానికి సహజ మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడుతుంది. ఇందులో ఉన్న ఫ్యాటీ ఆమ్లాలు పొడిబారిన చర్మానికి పోషణనిస్తాయి. తేమనిస్తాయి. కొంచెం నెయ్యి తీసుకుని ముఖానికి, శరీరానికి సున్నితంగా మర్దనా చేస్తే సరి. పొడిబారిన చర్మం మళ్లీ హైడ్రేట్ అయిపోతుంది.

**పెదవులకు పూతగా**

మృదువైన పెదవుల కోసం నెయ్యిని పల్చటి పొరలా పూసుకోవాలి. ఇలా చేస్తే పొలుసులు బారిన పెదవులకు హైడ్రేషన్ లభించి తేమతో ఉంటాయి.

**హెయిర్ కండిషనర్**

నెయ్యిని కొద్ది పరిమాణంలో తీసుకోవాలి. దాన్ని గోరువెచ్చగా వేడిచేయాలి. మాడు, వెంట్రుకలకు పట్టించి ఓ గంటపాటు ఉండనివ్వాలి. తర్వాత షాంపూతో కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కురులకు, మాడుకు మంచి పోషణ లభిస్తుంది. వెంట్రుకలు మృదువుగా, మెరుస్తూ ఉంటాయి.

**వయసు పెరుగుదలకు అడ్డుకట్ట**

నెయ్యిలోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయలతో పోరాడతాయి. నెయ్యిని పూసుకొంటే ముఖం మీద ముడతలు, గీతలు తగ్గిపోతాయి.

**కంటికింద వలయాలు**

కండ్ల కింద ఏర్పడే నల్లటి వలయాలు, చర్మం సాగుదలను అరికట్టాలంటే కొద్ది మొత్తంలో నెయ్యిని పడుకునే ముందు కండ్ల కింద రుద్దుకోవాలి.

**చర్మం పైపొరకు రక్షణగా..**

చర్మం పైపొర సంరక్షణలో, దాన్ని మృదువుగా ఉంచడంలోనూ నెయ్యి సహకరిస్తుంది.

**పాదాలకు మలాం**

పొడిబారిన, పగుళ్లిచ్చిన మడమలకు పడుకునే ముందు నెయ్యి రాసుకోవాలి. తర్వాత సాక్స్ వేసుకోవాలి. అలా రాత్రంతా ఉంచాలి. దీంతో మొండి చర్మం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**మేకప్ రిమూవర్**

మేకప్ తొలగించుకోవడానికి నెయ్యి సహజమైన రిమూవర్‌గా పనికివస్తుంది. ముఖానికి నెయ్యిని ఐప్లై చేసి మేకప్ పోయేవరకు సున్నితంగా మర్దనా చేయాలి. తర్వాత గోరువెచ్చటి తడిగుడ్డతో తుడుచుకోవాలి. దీంతో చర్మం శుభ్రపడుతుంది. మాయిశ్చరైజ్ కూడా అవుతుంది.




## సానుకూల సంకేతాలతో మార్కెట్ దూకుడు




**ముంబై-నవభూమి:** అమెరికా, జపాన్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలతో ఆసియా మార్కె ట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నడుమ బుధవారం మన ఈక్విటీ మార్కెట్ దూకుడు ప్రదర్శించింది. బ్యాంకింగ్, ఆయిల్ రంగాల షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 539.83 పాయింట్లు లాభపడి 82,726.64 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 599.62 పాయింట్ల లాభంతో 82,786.43ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్ల లాభంతో 25,219.90 వద్ద క్లోజయింది. హెచ్‌డీఎఫ‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ఒక దశలో 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకినా చివరికి 1 శాతం లాభంతో ముగిశాయి.లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 29న ప్రారంభమై 31న ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.150-158గా కంపెనీ ప్రకటించింది.ముంబై: ఎస్‌బీఐ జారీ చేసిన క్యూఐపీ సూపర్ డూపర్ హిట్టయింది. ఇష్యూ ప్రారంభమైన తొలి రోజే నాలుగింతలకుపైగా సబ్‌స్క్రైబ్ అయింది. ఈ క్యూఐపీ ద్వారా రూ.25,000 కోట్లు సమీకరించాలని ఎస్‌బీఐ భావించగా, ఇష్యూ ప్రారంభమైన కొద్ది సేపటికే రూ.1.12 లక్షల కోట్లకు బిడ్స్ అందాయి. ఇందులో మూడింట రెండు వంతుల బిడ్స్ విదేశాల నుంచి వచ్చినట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఎస్‌బీఐ ఆర్థిక పునాదులపై మదుపరులకు ఉన్న నమ్మకానికి ఈ క్యూఐపీ సబ్‌స్క్రిప్షన్ ఒక ఉదాహరణ అన్నారు.

## టాటా సన్స్ చైర్మన్‌కు పెరిగిన జీతం.. 155.8 కోట్ల వేతనం అందుకున్న చంద్రశేఖరన్



**న్యూఢిల్లీ-నవభూమి:** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్( 2024-25 వార్షిక సంవత్సరంలో 155.81 కోట్ల వేతాన్ని ఆర్జించారు. అంతకుముందు వార్షిక సంవత్సంతో పోలిస్తే ఆ మొత్తం 15 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. 2024 వార్షిక సంవత్సరానికి చంద్రశేఖరన్ 135 కోట్లు ఆర్జించారు. కంపెనీ వార్షిక రిపోర్టు ద్వారా ఈ విషయం తెలిసింది. ఫైనాన్షియల్ ఇయర్ 25లో ఆయన జీతం రూపంలో 15.1 కోట్లు, ఇక ఇతర కమీషన్, లాభాల్లో భాగంగా 140.7 కోట్లు ఆర్జించారు. వాస్తవానికి గత వార్షిక సంవత్సరంలో టాటా సన్స్ కంపెనీ తన లాభాల్లో 24.3 శాతం కోల్పోయింది. అయితే అలాంటి సమయంలో టాటా సన్స్ చైర్మెన్‌కు జీతాన్ని పెంచడం చర్చనీయాంశమైంది. గత ఏడాది టాటా సన్స్ లాభాలు 34,654 కోట్ల నుంచి రూ.26,232 కోట్లకు పడిపోయాయి.

## కస్టమర్ల ఖాతాల నుంచి కోట్ల రూపాయల దోపిడీ.. పరారీలో ఎస్‌బీఐ క్లర్క్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో ప్రముఖ ప్రభుత్వ బ్యాంకైన ఓ ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి సంచలన మోసం వెలుగులోకి వచ్చింది. ఓ క్లర్క్ అనేక మంది కస్టమర్ల ఖాతాల నుంచి కోట్ల రూపాయలు తీసుకుని, పరారైన ఘటన సంచలనం రేపుతోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, క్రెడిట్ లిమిట్‌ల నుంచి డబ్బు కాజేసిన ఈ మోసగాడు, బ్యాంక్ కస్టమర్ల జీవితాలను ఆర్థికంగా గందరగోళంలోకి నెట్టాడు. ఈ ఘటన పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లోని సదీక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో చోటుచేసుకుంది.ఈ క్రమంలో బుధవారం ఉదయం సదీక్ బ్రాంచ్‌కు వచ్చిన కస్టమర్లు తమ ఖాతాలు ఖాళీ అయిన విషయం తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. వృద్ధులు, మహిళలు తమ జీవితకాల సేవింగ్స్ ఒక్క రాత్రిలో గల్లంతైన సంగతి తెలిసి పలువురు కన్నీరు పెట్టుకున్నారు. మా జీవితంలో సంపాదించిన డబ్బు అంతా పోయిందని, ఇక ఏం చేయాలో తెలియడం లేదని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. మరికొంత మంది సైతం వారి మనీ పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.కస్టమర్ల ఖాతాల నుంచి అనుమానాస్పద ఉపసంహరణలు జరిగినట్లు గుర్తించిన బ్యాంక్ అధికారులు, రికార్డులను పరిశీలించగా, భారీ మొత్తంలో డబ్బు గల్లంతైనట్లు తేలింది. ఈ మోసానికి కారణం బ్యాంక్ క్లర్క్ అమిత్ ధింగ్రా అని అధికారులు నిర్ధారించారు. అతను కస్టమర్ల అనుమతి లేకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లను బ్రేక్ చేసి, నామినీ పేర్లను మార్చి, డబ్బును ఇతర ఖాతాలకు బదిలీ చేశాడు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు.పరమ్‌జిత్ కౌర్ అనే కస్టమర్ తన భర్తతో కలిసి ఉన్న రూ. 22 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా ఖాళీ అయిన విషయం తెలిసి కన్నీరు మున్నీరైంది. మాకు ఎలాంటి సమాచారం లేకుండానే డబ్బు అదృశ్యమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మరో కస్టమర్ సందీప్ సింగ్, తన నాలుగు ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఒక్కటి రూ. 4 లక్షలు) ఇప్పుడు కేవలం రూ. 50,000 మాత్రమే మిగిలాయని చెప్పాడు. మా కష్టార్జితం ఇలా పోతుందని ఊహించలేదని బాధను వ్యక్తం చేశాడు.ప్రస్తుతం ఈ మోసం విలువ సుమారు రూ. 5 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బ్యాంక్ అధికారులు ఈ ఘటనపై సమీక్ష నిర్వహిస్తున్నారు. కస్టమర్ల డబ్బు తిరిగి ఇప్పిస్తామని వారు హామీ ఇచ్చారు. బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ సుశాంత్ అరోరా, తాను ఇటీవలే బ్రాంచ్‌లో చేరానని, కస్టమర్ల ఫిర్యాదులతోనే ఈ మోసం గురించి తెలిసిందని చెప్పారు. సదీక్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ నవదీప్ భట్టి, క్లర్క్ అమిత్ ధింగ్రాపై నాలుగు ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## బంగారం, వెండి ధరలు

**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం, వెండి ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. వరుసగా రెండో రోజు వీటి ధరలు (%+శీశ్రీస ఖఅస ాఅశ్రీజవతీ ాతీఅఎవం ౹శీఝుఎ%) పుంజుకున్నాయి. ఈ క్రమంలో జులై 24, 2025 ఉదయం 6:20 గంటల సమయానికి, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,040 పెరిగి రూ.1,02,340కి చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.93,810 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో, వెండి ధర కూడా కిలోకు రూ.1,000 పెరిగి రూ.1,19,100కి చేరుకుంది. ఈ ధరల పెరుగుదల ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఆందోళన కలిగిస్తోంది. అయితే పెట్టుబడిదారులకు ఇది మంచి అవకాశంగా మారింది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు**


ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,02,340గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,810గా నమోదైంది. వెండి ధర కిలోకు రూ.1,19,100 వద్ద కొనసాగుతోంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,02,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,960గా ఉంది. ఢిల్లీలో వెండి ధర కిలోకు రూ.1,19,100గా నమోదైంది.

ఆ ప్రాంతాల్లో కూడా..చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,02,340, 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,810గా ఉంది. ఇక్కడ వెండి ధర కిలోకు రూ.1,19,100గా ఉంది. ముంబైలో కూడా ఇదే స్థాయిలో ధరలు నమోదయ్యాయి. ఇక్కడ 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,02,340, 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,810, వెండి ధర రూ.1,19,100గా ఉంది. కోల్‌కతా, బెంగళూరు, పూణే వంటి నగరాల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది.

ధరల పెరుగుదలకు కారణాలు..ఈ ధరల పెరుగుదలకు అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలు ఉన్నాయి. అమెరికా డాలర్ బలపడటం, ఆసియా మార్కెట్లలో డిమాండ్ పెరగడం వంటి అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి.

# మళ్లీ దెబ్బ కొట్టిన ట్రంప్..

## భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వొద్దు..



**వాషింగ్టన్-నవభూమి:**భారతీయులకు మరో సారి షాక్ తగిలింది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ .. తాజాగా చేసిన ప్రకటన దిగ్గజ కంపెనీల్లో ఉద్యోగం కోసం చూసే వారి ఆశల్ని ఆవిరి చేస్తుందని చెప్పొచ్చు. ట్రంప్ మరోసారి 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని బలంగా వినిపించారు. ఇది భారతీయుల్ని గట్టి దెబ్బ కొట్టింది. గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా ఇతర అమెరికా ప్రధాన కేంద్రంగా పనిచేసే దిగ్గజ టెక్ కంపెనీలు.. భారతీయుల్ని నియమించుకోవడం కాకుండా.. అమెరికన్లకే ఉద్యోగాలు ఇవ్వాలని.. అమెరికాపైనే ప్రధానంగా దృష్టి సారించాలని తీవ్ర హెచ్చరిక చేశారు. అంటే భారతీయుల్ని నియమిం చుకోవద్దంటూ వార్నింగ్ ఇచ్చారు.బుధవారం రోజు.. వాషింగ్టన్ డీసీలో జరిగిన ప్రతిష్టాత్మక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సదస్సులో మాట్లాడిన ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.టెక్ కంపెనీల గ్లోబల్ మైండ్‌సెట్‌ను ట్రంప్ విమర్శించారు. అమెరికాలో లభిస్తున్న స్వేచ్ఛను అడ్డం పెట్టుకొని.. చాలా వరకు టెక్ కంపెనీలు ఇతర దేశాల్లోనే ఎక్కువగా పెట్టుబడులు పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది అమెరికన్లు .. ఈ కంపెనీలు తమను పట్టించుకోవడమే లేదన్న భావనలో ఉన్నట్లు పేర్కొన్నారు.
'అమెరికాలోని పెద్ద పెద్ద టెక్ సంస్థలు.. చైనాలో కంపెనీల్ని నిర్మిస్తూ.. భారతీయ ఉద్యోగుల్ని నియమించుకుంటున్నాయి. ఇక్కడి ప్రజల అవకాశాల్ని పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యం చేయడం బాగా లేదు. ట్రంప్ పాలనలో ఇలా కుదరదు.' అని స్పష్టం చేశారు.ౕౕ ఇంకా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పోటీలో విజయం సాధించాలంటే.. సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరని ట్రంప్ ఉద్ఘాటించారు. అమెరికాలోని టెక్ కంపెనీలు అమెరికా ప్రాధాన్యాల కోసమే పనిచేయాలని.. తమకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ౕౕ ఈ సందర్భంగా ఏఐ గురించి కీలకంగా మాట్లాడారు ట్రంప్. దేశంలో ఏఐ ఆవిష్కరణల్ని ప్రోత్సహించాలని, అభివృద్ధికి సహకరించాలని కోరారు. దానికి ఉన్న అడ్డంకుల్ని తొలగించి.. వృద్ధిని మరింత వేగవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వ నిధులతో తయారయ్యే ఏఐ టూల్స్.. రాజకీయంగా తటస్థ వైఖరితో ఉండేలా చూడాలన్నారు.

# మీ డబ్బులకు భద్రత

## అధిక వడ్డీ.. టాప్-5 పోస్టాఫీసు పథకాలు ఇవే




**:న్యూఢిల్లీ-నవభూమి:** ఎలాంటి రిస్క్ లేకుండా స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి పోస్టాఫీసు పొదుపు పథకాలు మంచి ఎంపికగా చెప్పవచ్చు. వీటిల్లో మంచి వడ్డీ రేటుతో పాటు గ్యారెంటీ రిటర్న్స్ ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ హామీ ఉండడంతో నిశ్చింతగా ఉండవచ్చు. దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించేందుకు ఈ పథకాలను కేంద్ర ప్రభుత్వమే అందిస్తోంది. దీంతో ఎలాంటి ఆందోళన అవసరం ఉండదు. చాలా తక్కువ పెట్టుబడితో ప్రారంభించవచ్చు. ప్రస్తుతం బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించేస్తున్న సమయంలో చాలా మంది పోస్టాఫీసు పథకాల వైపు చూస్తున్నారు. ఇందులో మీ పెట్టుబడికి భద్రత లభించడంతో పాటు అధిక వడ్డీ రేట్లు ఉన్నాయి. మరి అలాంటి 5 బెస్ట్ పోస్టాఫీస్ పథకాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్**

60 సంవత్సరాలు పైబడిన వారితో పాటు 50 ఏళ్ల తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారు ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ స్కీమ్‌లో వడ్డీని మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తారు. ప్రతి ఏడాది ఏప్రిల్, జులై, అక్టోబర్, జనవరి నెలల్లో ఒకటవ తేదీనే వడ్డీని అకౌంట్లో జమ చేస్తారు. ప్రస్తుతం ఈ స్కీమ్ ద్వారా 8.2 శాతం వస్తోంది.

కేటగిరీలో పన్ను ప్రయోజనాలు ఉంటాయి. ఇందులో ప్రస్తుతం 7.1 శాతం వడ్డీ లభిస్తోంది. ఇందులో కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ వస్తుంది. అంటే వడ్డీపైన వడ్డీ లభిస్తుంది. కనీసం 15 సంవత్సరాలు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 5 సంవత్సరాలు ఒకసారి పొడిగించుకోవచ్చు.

**పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్**

నెల నెలా చేతికి కొంత డబ్బు అందాలనుకునే వారికి ఈ స్కీమ్ బెస్ట్ అని చెప్పవచ్చు. ఇందులో ప్రస్తుతం 7.4 శాతం వడ్డీ లభిస్తోంది. ఇందులో 5 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఆ తర్వాత పెట్టుబడి మొత్తం తిరిగి చెల్లిస్తారు. లేకుంటే మరో 5 ఏళ్లు పొడిగించుకోవచ్చు. సింగిల్ ఖాతాతో రూ.9 లక్షలు, జాయింట్ ఖాతాతో రూ.15 లక్షలు జమ చేయవచ్చు. అయితే వడ్డీపై ట్యాక్స్ ఉంటుంది.

**కిసాన్ వికాస్ పత్ర**

10 సంవత్సరాల్లో తమ పెట్టుబడిని రెండింతలు చేసుకోవాలని చూసే వారికి ఈ స్కీమ్ మంచి ఎంపిక. రూ.1 లక్ష పెడితే రూ. 2 లక్షలు అందుకోవచ్చు. వార్షికంగా 7.5 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ వడ్డీ రేటుతో చూస్తే 115 నెలలు అంటే 9 ఏళ్ల 5 నెలల్లోనే పెట్టుబడి రెట్టింపు అవుతుంది.

# ఇన్ఫోసిస్ గుడ్‌న్యూస్.. 20 వేల నియామకాలు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ ఐటీ రంగంలో నియామకాలు.. వేతన పెంపుదలపై.. ఎన్నో సందేహాలు నెలకొన్న తరుణంలో దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నుంచి శుభవార్త అందింది. తాజాగా విడుదల చేసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాల సమయంలో కీలక ప్రకటన చేసింది. కంపెనీ ఉన్నతాధికారులు.. ఉద్యోగ నియామకాలు, వేతనాల పెంపుదల, బోనస్‌లపై కీలక ప్రకటనలు చేశారు. ఈ త్రైమాసికంలో ఉద్యోగులకు 'అధిక' వేరియబుల్ పే (బోనస్) చెల్లించినట్లు, భవిష్యత్తులో నియామకాలు కొనసాగుతాయని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జయేష్ సంఘరాజ్‌కా బుధవారం తెలిపారు.ఈ పరిణామాలు ఐటీ ఉద్యోగార్థులకు.. కంపెనీలోని ప్రస్తుత ఉద్యోగులకు ఆశల్ని రేకెత్తించగా, అట్రిషన్ రేటు (ఉద్యోగం వదిలి వెళ్లే వారి సంఖ్య) పెరుగుదల మాత్రం కొంత ఆందోళన కలిగిస్తోంది. వేతనాల పెంపుపై కీలక ప్రకటన చేసిన ఇన్ఫోసిస్.. గతేడాది వేతనాల పెంపు ఆలస్యం కాగా.. దానిని ఈ ఏడాదిలో విడుదల చేసినట్లు వెల్లడించింది. 2025 జనవరి నుంచి మొదటి దశ వేతన పెంపు అమల్లోకి వచ్చిందని.. ఇదే సమయంలో 2025, ఏప్రిల్ 1 నుంచి రెండో విడత అమలైందని స్పష్టం చేసింది.అయితే తదుపరి వేతనాల పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కంపెనీ ఉన్నతాధికారి సీఎఫ్ఓ సంఘరాజ్‌కా వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రస్తుత త్రైమాసికంలో ఉద్యోగులకు 'అధిక' వేరియబుల్ పే చెల్లించినట్లు తెలిపారు. టీసీఎస్ కూడా దాదాపు 70 శాతం మంది జూనియర్లకు 100 శాతం వేరియబుల్ పే చెల్లించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇన్ఫోసిస్ కూడా ఇదే బాటలో గుడ్‌న్యూస్ చెప్పింది.

**పెరిగిన అట్రిషన్ రేటు..**

జూన్ 2025లో స్వచ్ఛందంగా ఉద్యోగం వదిలి వెళ్లే వారి రేటు (సిబ్బంది వలసల రేటు) 14.4 శాతానికి పెరిగింది. ఇదే ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ ఇతర ప్రత్యర్థి కంపెనీల్లోకి వెళ్తున్నారన్నమాట. 2025 జూన్ 30 నాటికి కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,23,788 గా ఉంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య 8 వేలకుపైగా పెరిగింది. ప్రస్తుత ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 9 శాతం పెరిగి రూ. 6,921 కోట్లకు చేరుకుంది.

**20 వేల నియామకాలు..**

ఇక్కడ ఇన్ఫోసిస్ చెప్పిన శుభవార్త ఏంటంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 20 వేల మంది ఫ్రెషర్లను (తాజా ఉత్తీర్ణులు) నియమించుకోనున్నట్లు వెల్లడించింది.
"మీరు మా నియామకాల సంఖ్యలను చూస్తే, మా మొత్తం ఉద్యోగుల సంఖ్య ఈ సమయంలో స్థిరంగా ఉంది. ఇంకా మా వినియోగం 85 శాతం వద్ద గరిష్ట స్థాయికి చేరుకుంది. కాబట్టి, మేము నియామకాలు కొనసాగిస్తాము. సంవత్సరం ప్రారంభంలో మేము ప్రకటించిన దానికి అనుగుణంగా నియామకాలు కొనసాగిస్తామని మేము ఆశిస్తున్నాం." అని జయేష్ సంఘరాజ్‌కా అన్నారు.

## ఉద్యోగులకు గుడ్ న్యూస్.. సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగింపు





**న్యూఢిల్లీ-నవభూమి:**ఆదాయపు పన్ను శాఖ పన్ను రిటర్నులు దాఖలు చేసే వారికి గుడ్ న్యూస్ తెలిపింది. ఈ క్రమంలో దీని గడువును జులై 31, 2025 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు పొడిగించింది. ఈ పొడిగింపునకు కారణం ఆదాయపు పన్ను శాఖ పోర్టల్‌లో ఫారమ్‌లు, ఈ-ఫైలింగ్ సౌకర్యాలలో జాప్యం, జీతం పొందే ఉద్యోగస్తుల కోసం గడువును పెంచారు. ఈ నిర్ణయం వల్ల ఇంకా రిటర్న్ దాఖలు చేయని వారు అనుకున్నంత సమయాన్ని పొందగలుగుతారు.ఈ గడువు పొడిగింపు ఉన్నప్పటికీ, స్వీయ-మదింపు పన్ను చెల్లించాల్సిన వారు మాత్రం జులై 31, 2025 లోపు చెల్లించాలి, లేకపోతే సెక్షన్ 234%ూా% కింద జరిమానా వడ్డీ విధించబడవచ్చు. గడువులోపు దాఖలు చేయకపోతే, ఆదాయం రూ. 5 లక్షలకు మించిన వారు రూ. 5,000 జరిమానా, ఆదాయం రూ. 5 లక్షల కంటే తక్కువ ఉన్నవారు రూ. 1,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది దీంతోపాటు ఆలస్య రిటర్న్‌లు, సవరించిన రిటర్న్‌ల దాఖలు కోసం గడువు డిసెంబర్ 31, 2025 వరకు ఉంటుంది.చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఫారమ్ యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ లో సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ ఫారమ్‌లు ఆదాయం,ఇతర ఆర్థిక లావాదేవీల వివరాలను కలిగి ఉంటాయి. ఈ సమస్యల కారణంగా రిటర్న్ దాఖలు చేయడంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. కాబట్టి, దాఖలు చేసే ముందు ఈ ఫారమ్‌లలోని వివరాలను జాగ్రత్తగా సరిచూసుకోవాలి.2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి, భూమి, లేదా షేర్లు విక్రయించిన వారికి రెండు ఆప్షన్లు ఉన్నాయి. పాత పద్ధతి (ఇండెక్సేషన్‌తో) లేదా కొత్త పద్ధతి (ఇండెక్సేషన్ లేకుండా). ఇండెక్సేషన్ అనేది ఆస్తి కొనుగోలు ధరను ద్రవ్యోల్బణం ఆధారంగా సర్దుబాటు చేసి, పన్ను భారాన్ని తగ్గించే పద్ధతి. ఉదాహరణకు, జులై 23, 2024 తర్వాత కొనుగోలు చేసిన ఆస్తి విక్రయిస్తే, మొత్తం కొనుగోలు ధరపై పన్ను విధించబడుతుంది. ఇండెక్సేషన్ లేకపోవడం వల్ల పన్ను భారం కొంత ఎక్కువగా ఉండవచ్చు. కాబట్టి, ఆస్తి విక్రయించే ముందు ఈ నిబంధనలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.%ఖ=% దాఖలు చేసిన తర్వాత కూడా ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసు రావచ్చు. ఈ నోటీసులు %ఱణా% అసమానతలు, ఆదాయం తప్పుగా నమోదు లేదా ఇతర సమస్యల కారణంగా రావచ్చు. నోటీసు వచ్చినప్పుడు, గడువులోపు స్పందించి, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలి. నోటీసులో పేర్కొన్న వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైతే నిపుణుల సలహా తీసుకోవాలి. గడువు తప్పితే, జరిమానా లేదా ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

## ఫ్లాట్ కొనడమంటే అతిపెద్ద ఆర్థిక తప్పిదం.. ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ అధిపతి వార్నింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** సొంత ఇల్లు అంటే అనేక మందికి ఓ విజయం, భవిష్యత్తుపై భరోసా.. జీవితానికి స్థిరత్వం. అందుకే ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని అనేక మంది తమ సొంతింటి కలను నిజం చేసుకుంటారు. అయితే, భారీ ఈఎమ్ఐలతో ఫ్లాట్ కొనడం అంటే జీవితంలో అతిపెద్ద తప్పు చేస్తున్నట్లేనని కంప్లీట్ సర్కిల్ క్యాపిటల్ సంస్థ ప్రెసిడెంట్ ఆదిత్య కొడవార్ భారీ స్టేట్‌మెంట్ ఇచ్చారు. లింక్డ్‌ఇన్ వేదికగా ఆయన పెట్టిన పోస్టుపై ప్రస్తుతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.భారీ ఈఎమ్ఐలతో ఫ్లాట్ కొనడమంటే అతిపెద్ద వ్యక్తిగత ఆర్థిక తప్పిదమని ఆయన తేల్చి చెప్పారు. భారతీయులు అనేక మంది 8 నుంచి 9 శాతం వడ్డీతో రుణం తీసుకుని ఫ్లాట్ కొన్నాక దాన్ని 3 నుంచి 4 శాతం రాబడి వచ్చేలా అద్దెకు ఇస్తున్నారని చెప్పారు. ఇది పెద్ద తప్పిదమని స్పష్టం చేశారు. 'దీనికి ఫ్లాట్ నిర్వహణ ఖర్చులు, ఇతర చార్జీలను కలుపుకుంటే రాబడి 2 నుంచి 3 శాతానికే పరిమితమవుతుంది. ఇది అతిపెద్ద రియలెస్టేట్ ఉచ్చు. ఇందులో పడొద్దు. ఈ విషయం ఇప్పుడు అందరికీ తెలిసిపోయింది' అని రాసుకొచ్చారు.ఈ సూచనతో అనేక మంది నగర జీవులు ఏకీభవించారు. రియల్ ఎస్టేట్ ఆస్తులతో ఆశించిన ఆదాయం రాకపోగా వడ్డీల భారం పెరుగుతోందని అన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో అద్దెల ద్వారా రాబడి 2 నుంచి 3 శాతంగానే ఉంటోంది. ప్రస్తుతమున్న ఇంటి లోన్‌ల వడ్డీ రేట్ల కంటే ఇది చాలా తక్కువ. స్థిరాస్తులతో ఆర్థిక భరోసా కచ్చితమన్న భావన అన్ని సందర్భాల్లో నిజం కాదని కొందరు ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మరింత రాబడులను ఇస్తూ, సులువుగా నగదుగా మార్చుకోగలిగే పెట్టుబడి సాధనాలు అనేకం అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీలు, బాండ్స్, యాన్యుయిటీ ఉత్పత్తుల వంటివి స్థిరాస్తులకు మంచి ప్రత్యామ్నాయమని చెబుతున్నారు.

# బంపర్ రిటర్న్స్.. రూ. లక్ష పెడితే కోటికిపైనే వచ్చింది





**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు సంపాదించే దాంట్లో నుంచి ఏమైనా పెట్టుబడుల కోసం కేటాయిస్తున్నారా..? మరి వేటిల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు? పెట్టుబడుల కోసం మనకు చాలానే ఆప్షన్లు ఉంటాయని చెప్పొచ్చు. రిస్క్ ఉన్న పథకాలు ఉంటాయి. రిస్క్ లేకుండా గ్యారెంటీ రిటర్న్స్ అందించే స్కీమ్స్ కూడా ఉంటాయి. రిస్క్ లేకుండా అంటే కేంద్ర ప్రభుత్వం అందించే పోస్టాఫీస్ పథకాలు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆర్బీఐ బాండ్లు ఇలాంటివి ఉంటాయి. వీటిల్లో రిస్క్ అస్సలు లేకుండా మీ పెట్టుబడులపై నిర్ణీత కాల పరిమితికి రిటర్న్స్ అందుకోవచ్చు. అయితే ఇక్కడ ద్రవ్యోల్బణాన్ని అధిగమించేలా రిటర్న్స్ మాత్రం ఆశించలేం.అందుకే కాస్త ఎక్కువ రాబడి అందించే పథకాలు కూడా ఉంటాయి. వీటిల్లో స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటివి ఉంటాయి. అయితే ఇక్కడ రిస్క్ ఎక్కువే ఉంటుందని చెప్పొచ్చు. రిస్క్ ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో మంచి లాభాలు అందుకోవచ్చని నిపుణులు చెబుతుంటారు. అంటే ఏదో ఇన్వెస్ట్ చేశాం కదా అని వెంటనే లాభాలు రావాలంటే రావు. దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందించే పథకాలు చాలానే ఉంటాయి. ఇక్కడ కాంపౌండింగ్ అంటే వడ్డీపై వడ్డీ వల్ల లాంగ్ రన్‌లో రాబడి ఎక్కువగా ఉంటుందని చెబుతుంటారు.ఇక ఇప్పుడు ఇలా మనం దీర్ఘకాలంలో అద్భుత స్థాయిలో లాభాలు అందించిన బెస్ట్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ గురించి మనం తెలుసుకుందాం. 30 సంవత్సరాల వ్యవధిలో దాదాపు 6 ఈక్విటీ ఫండ్స్ రూ. లక్ష లంప్ సమ్ (ఒకేసారి) పెట్టుబడిని రూ. 1 కోటికిపైగా చేశాయి. మొత్తం 16 ఫండ్స్.. మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్నాయి. వీటిల్లో రెండు ఫండ్స్ రూ. లక్ష పెట్టుబడిని రూ. 2 కోట్లకుపైగా కూడా చేయడం విశేషం. ఈ రెండూ ఫ్రాంక్లిన్ మ్యూచువల్ ఫండ్ నుంచే ఉండటం విశేషం.మరి 30 సంవత్సరాల వ్యవధిలో ఏ ఫండ్ ఎంత రిటర్న్స్ ఇచ్చిందనేది ఇప్పుడు తెలుసుకుందాం. ఫ్రాంక్లిన్ ఇండియా మిడ్ క్యాప్ ఫండ్ సగటున 19.5 శాతం రాబడి అందించగా.. రూ. 1 లక్ష పెట్టుబడి ఈ సమయంలో రూ. 2.81 కోట్లు అయింది. ఫ్రాంక్లిన్ ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్ చూస్తే లక్ష పెట్టుబడితో రూ. 2.47 కోట్లు చేసింది.ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్బీఐ స్కీమ్స్ కూడా ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ సగటున 18.89 శాతం సీఏజీఆర్ అందించగా.. రూ. లక్ష పెట్టుబడి ఇక్కడ రూ. 1.98 కోట్లు అయింది. ఫ్రాంక్లిన్ ఇండియా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లో రూ. లక్ష పెట్టుబడి రూ. 1.65 కోట్లు అయింది. ఎస్బీఐ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ లక్ష పెట్టుబడిని రూ. 1.37 కోట్లు చేసింది. ఆదిత్యా బిర్లా ఎస్ఎల్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ రూ. లక్ష పెట్టుబడిని రూ. 1.16 కోట్లు చేసింది.గమనిక: మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌కు లోబడి ఉంటాయి.

గత రాబడులు భవిష్యత్తుకు హామీ కావు. కాబట్టి వీటిల్లో ఇన్వెస్ట్ చేసే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ శుక్రవారం 25 । జులై । 2025

# ఇరకాటంలో పడ్డ రాజీవ్ కనకాల.. నోటీసులు పంపిన రాచకొండ పోలీసులు



తెలుగు సినీ నటుడు రాజీవ్ కనకాల భూ లావాదేవీ వివాదంలో చిక్కుకున్నారు. ఈ వ్యవహారంలో రాచకొండ పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. మరోవైపు, అదే కేసులో సినీ నిర్మాత విజయ్ చౌదరిపై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. వివరాలలోకి వెళితే ..హైదరాబాద్ శివారులోని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ, పసుమాముల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 421 వెంచర్‌లో రాజీవ్ కనకాల కు ఓ ఫ్లాట్ ఉంది. ఈ ఫ్లాట్‌ను ఆయన కొన్ని నెలల క్రితం విజయ్ చౌదరికి విక్రయించారు. అధికారిక రిజిస్ట్రేషన్ కూడా జరిగిందని సమాచారం.అయితే, విజయ్ చౌదరి అదే ఫ్లాట్‌ను ఎల్బీనగర్‌కు చెందిన శ్రవణ్ రెడ్డి అనే వ్యక్తికి రూ. 70 లక్షలకు విక్రయించారు. దాంతో లావాదేవీ ముగిసినట్లయింది. కానీ తర్వాత అసలు సమస్య మొదలైంది.శ్రవణ్ రెడ్డి తన ఫ్లాట్‌ను పరిశీలించేందుకు వెళ్లినప్పుడు, సదరు ప్లాట్ ఎక్కడా కనిపించకపోవడం, ఆ స్థలంలో ఆనవాళ్లు లేకపోవడం గమనించారు. తనను నకిలీ స్థలంతో మోసగించారన్న అనుమానంతో, విజయ్ చౌదరిని సంప్రదించగా, మళ్లీ అమ్మనని, దీనిపై వివాదం నడుస్తోందని,ఏదైన ఉంటే కూర్చొని మాట్లాడుకుందాం అని చెప్పి తప్పించుకున్నాడట. గట్టిగా అడిగితే అంతు చూస్తానని బెదిరించాడంటూ శ్రవణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నవచిత్ర



# రంగు లేదు బక్కగా కనిపిస్తోందని విమర్శించారు: వాణీ కపూర్



వాణీ కపూర్ తాజా ఇంటర్వ్యూలో తాను వర్ణ వివక్షను ఎదుర్కొన్నట్టు తెలిపింది. యష్ రాజ్ ఫిలింస్ అస్థాన కథానాయికగా పాపులరైంది వాణీ కపూర్. ఈ భామకు ఆదిత్య చోప్రా మార్గదర్శకుడిగా నిలిచాడు. అతడు వరుసగా తమ బ్యానర్ సినిమాల్లో వాణీకి అవకాశం కల్పించాడు. అయితే వాణీ కెరీర్ ఆశించిన స్థాయికి మాత్రం చేరుకోలేదు. ఈ భామకు నటిగా నిరూపించుకునే గొప్ప అవకాశాలు కూడా రాలేదు. కేవలం కమర్షియల్ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో మాత్రమే నటించింది. ఇదిలా ఉంటే, వాణీ కపూర్ తాజా ఇంటర్వ్యూలో తాను వర్ణ వివక్షను ఎదుర్కొన్నట్టు తెలిపింది. తన శరీరం తగినంత తెల్లగా లేదని విమర్శలొచ్చాయని తెలిపారు. రంగు లేదు బక్కగా కనిపిస్తోంది! అంటూ కొందరు విమర్శించిన విషయాన్ని తాజాగా గుర్తు చేసుకుంది. సన్నగా పొడవుగా ఉండటం కూడా తనకు సమస్యలు తెచ్చి పెట్టిందని అన్నారు. తదుపరి ఓటీటీలో వాణీ నటించిన %-%మండలా మర్డర్స్%-% విడుదలకు సద్ధమైంది. వాణీ గన్ చేతపట్టి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ లా కనిపిస్తోంది. ఈ షోలో తన నటనతో ఆకట్టుకుంటే, అది మరిన్ని అవకాశాలను కల్పిస్తుంది. గొప్ప నటప్ర దర్శనతో హృదయాలను గెలుచుకుంటే పెద్ద తెర అవకాశాలు పెరుగుతాయనడంలో సందేహం లేదు.

# విజయ్ దేవరకొండకు మరోసారి ఈడీ నోటీసులు



బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో హీరో విజయ్ దేవరకొండకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి నోటీసులు జారీచేసింది. వచ్చే నెల 11న విచారణకు రావాలని ఆదేశించింది. అయితే ఇప్పటికే విజయ్‌తోపాటు రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మి తదితరులకు ఈడీ తాఖీదులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న విచారణకు రావాలని తెలిపింది. అయితే ముందస్తు కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌లు ఉన్న కారణంగా ఆ రోజున విచారణకు హాజరుకాలేనని విజయ్ దేవరకొండ ఈడీకి సమాచారం ఇచ్చారు. మరో తేదీ కావాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 11న కచ్చితంగా విచారణకు రావాలంటూ తాజాగా స్పష్టంచేసింది. ఇకే కేసులో రానా దగ్గుబాటిని కూడా అదే రోజున విచారించనుంది.మరోవైపు నటులు ప్రకాశ్‌రాజ్ ఈ నెల 30న, మంచులక్ష్మి ఆగస్టు 13 తేదీల్లో తమ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. కాగా, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి ఈడీ మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతోంది. ఈ యాప్‌ల ద్వారా కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయని ఈడీ అనుమానిస్తోంది. దీంతో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ కేసులు నమోదు చేసింది.

# మహిళ రిసెప్షనిస్ట్‌పై దాడిపై స్పందించిన జాన్వీకపూర్



మహారాష్ట్రలోని కళ్యాణ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌పై దాడి ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. 25 ఏళ్ల రిసెప్షనిస్ట్ సోనాలి కలసార్‌పై గోకుల్ ఝా అనే వ్యక్తి దారుణంగా దాడి చేశాడు. అపాయింట్‌మెంట్ లేకుండా డాక్టర్ ఛాంబర్‌లోకి వెళ్లడానికి అనుమతించనందుకే ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. వైరల్ అయిన సీసీటీవీ ఫుటేజీలో, గోకుల్ ఝా రిసెప్షనిస్ట్‌ను కాలుతో తన్ని, ఆమె జుట్టు పట్టుకుని లాగి, నేలకేసి కొట్టడం స్పష్టంగా కనిపించింది. అక్కడే ఉన్న కొందరు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, అతను తన దాడిని కొనసాగించాడు. ఈ దాడిలో రిసెప్షనిస్ట్‌కు తీవ్ర గాయాలవడంతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అతడిపై పోలీసు కేసు నమోదు కాగా పలువురు ఈ ఘటనపై స్పందిస్తున్నారు.
తాజాగా ఈ ఘటనపై నటి జాన్వీ కపూర్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో జాన్వీ రాసుకోస్తూ.. ఇలాంటి వ్యక్తులు కచ్చితంగా జైలులో ఉండాలి. అసలు ఇలాంటి ప్రవర్తనను ఎవరైనా ఎలా సమర్థిస్తారు? ఎదుటి వ్యక్తిపై చేయి చేసుకోవడానికి వారికి ఎంత ధైర్యం? మానవత్వం లేకుండా ఇలాంటి హేయమైన చర్యకు పాల్పడిన వారికి కనీసం పశ్చాత్తాపం, అపరాధ భావం కూడా ఉండవా? ఈ ప్రవర్తన చూశాక ఎవరైనా వారితో కలిసి ఉండాలని కోరుకుంటారా? ఇది అత్యంత అవమానకరమైన, అమానుషమైన చర్య. మనం ఇలాంటి ప్రవర్తనను ఎప్పటికీ క్షమించకూడదు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించి, నిందితుడిని కఠినంగా శిక్షించకపోతే అది మనందరికీ నిజంగా సిగ్గుచేటు. ఈ వ్యక్తి జైలుకు వెళ్లాల్సిందే! అంటూ జాన్వీ పోస్టు చేసింది.

# ఎవరు ఊహించని విధంగా మహేష్- జక్కన్న చిత్రం.. సీక్రెట్ లీక్ చేసింది మరెవరో కాదు..!




తెలుగు సినిమా ఇండస్ట్రీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం ఒడియన్ సినిమా స్థాయిని అంతర్జాతీయంగా తీసుకెళ్లిన క్రియేటివ్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి ఇప్పుడు మహేష్ బాబుతో మరో వండర్ క్రియేట్ చేయబోతున్నాడు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై వరల్డ్ వైడ్ బజ్ ఉంది. ఇప్పటిదాకా ప్యాన్ ఇండియా సినిమా కూడా చేయని మహేష్‌ని, ఏకంగా ఇంటర్నేషనల్ స్టార్‌ని చేసేందుకు రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మాస్, యాక్షన్, అడ్వెంచర్, ఎమోషన్, విజువల్స్ఇలా ప్రతి యాంగిల్‌లోనూ ది బెస్ట్ అనిపించుకునేలా తెరకెక్కించి శభాష్ అనిపించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో జక్కన్న వర్క్ చేస్తున్నట్టు తెలుస్తుంది.టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు, వర్సటైల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ SSMB29 అంచనాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్‌లో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఆయన తన తాజా చిత్రం 'సర్జమీన్' ప్రమోషన్లలో భాగంగాగురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ..ఇప్పటివరకు ఎవ్వరూ ఊహించని విధంగా రాజమౌళి ఈ కథను తెరకెక్కిస్తున్నారు. ఇది ఓ అద్భుత దృశ్య కావ్యం. రాజమౌళి ఎంచుకునే ప్రతీ కథా భారీగా ఉంటుందనే సంగతి తెలిసిందే. ఈ చిత్రం కూడా అలానే ఉంటుంది. ఆయన కథను చెప్పడంతో పాటు, విజువల్స్‌తో వండర్ క్రియేట్ చేయడంలో అసాధారణ ప్రతిభ కలిగిన దర్శకుడు అని అన్నారు.అంతేకాకుండా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులకు ఓ విజువల్ ట్రీట్‌గా నిలవనుందని పృథ్వీరాజ్ సుకుమారన్ హామీ ఇచ్చారు. ఇది మహేశ్ బాబు కెరీర్‌లోనే కాకుండా, ఇండియన్ సినిమా స్థాయిలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా కనిపిస్తోంది. రాజమౌళి గత చిత్రాలు బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ లాంటి బ్లాక్‌బస్టర్ విజయం సాధించగా, ఈ చిత్రం వాటికన్నా మరింత విస్తృతంగా తెరకెక్కుతుందని టాక్. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినీ ప్రేమికులతో పాటు, ఇతర భాషల ఆడియెన్స్ కూడా ఈ చిత్రంపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు పృథ్వీరాజ్ వ్యాఖ్యలతో ఈ ప్రాజెక్టుపై మరింత హైప్ ఏర్పడింది.

# సోషల్ మీడియా అవసరం : రెజీనా



పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, సోషల్ మీడియా పదాలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఎందుకంటే ఇప్పటి రోజుల్లో సోషల్ మీడియాదే ఎక్కడైనా హవా. సినిమా పబ్లిసిటీ, ప్రమోషన్స్ విషయంలో దానిదే కీలక పాత్ర. అదే సమయంలో పీఆర్ లేకుండా చిత్ర పరిశ్రమ మనుగడ సాధించడం కష్టమని అంతా చెబుతుంటారు. ఇప్పుడు ఆ రెండింటిపై హీరోయిన్ రెజీనా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మోడల్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన రెజీనా.. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఓ కోలీవుడ్ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత శివ మనసులో శృతి సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టారు.అప్పటి నుంచి వరుసగా కోలీవుడ్, టాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ మెప్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నో విభిన్నమైన రోల్స్ లో నటించిన రెజీనా.. ఇండస్ట్రీలోకి 20 ఏళ్లు కంప్లీట్ అయిన సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన జర్నీ, ఎదురైన సవాళ్లు, పరిశ్రమలో నెలకొన్న వాస్తవాలు గురించి ఓపెన్ గా మాట్లాడారు. తనకు ఎలాంటి ఫిల్మ్ బ్యాక్ గ్రౌండ్ లేదని.. ఎంతో కష్టపడి ఎదిగినట్లు రెజీనా గుర్తు చేసుకున్నారు. అయితే సినిమాల్లోకి వచ్చిన మొదట్లో కేవలం సెట్ కు వెళ్లడం, సినిమాలో నటించడం, మళ్లీ ఇంటికి వచ్చేయడం.. ఇంతేనా అని ఎప్పుడూ అనుకునేదాన్ని అని చెప్పారు. పీఆర్, సోషల్ మీడియా అవసరం లేదని అనుకున్నట్లు పేర్కొన్నారు. కేవలం తన యాక్టింగ్ చేసి ఛాన్సులు రావాలని, పబ్లిసిటీ చూసి కాదు అనుకునేదాన్ని అని చెప్పిన రెజీనా.. కొంత కాలం అయ్యాక వాటి అవసరమేంటో తెలిసి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా తనకు సంబంధించిన విషయాలు ఆడియన్స్ కు చేరువుతున్నానని రెజీనా కసాండ్రా వెల్లడించారు. అయితే కెరీర్ లో ఒక దశలో విసుగొచ్చి, 2015-16లో యాక్టింగ్ మానేయాలనుకున్నానని చెప్పిన రెజీనా.. చేతిలో ఉన్న సినిమాలు పూర్తి చేసి కెరీర్‌కు ఎండింగ్ పలకాలనుకున్నానని తెలిపారు. కానీ 2018 నుంచి మళ్లీ అవకాశాలు క్యూ కట్టాయని, అందుకే అప్పటి నుంచి భిన్నమైన పాత్రల్లో నటించడం మొదలుపెట్టానని పేర్కొన్నారు. తెలుగు రాకపోవడం వల్ల, టాలీవుడ్ లో ఇబ్బంది పడ్డానని అమ్మడు.. ఇప్పుడు క్లియర్ గా

# హరిహర వీరమల్లు పబ్లిక్ టాక్.. ఆడియన్స్ రియాక్షన్ ఏంటి?



దాదాపు రెండేళ్ల తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న మూవీ హరిహర వీరమల్లు కాగా, ఈ చిత్రం కోసం ప్రేక్షకులు కొన్ని నెలలుగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ వచ్చారు. పలు వాయిదాల తర్వాత ఎట్టకేలకి జులై 24న మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గత రాత్రి ప్రీమియర్ షోస్ కూడా వేశారు. ప్రస్తుతం బెనిఫిట్ షోస్ నడుస్తున్నాయి. పలు ప్రదర్శనలతో అభిమానుల ఉత్సాహం తారా స్థాయికి చేరుకుంది. కాకినాడ, పిఠాపురం, తుని, అమలాపురం, రాజమండ్రి వంటి ప్రాంతాల్లోని థియేటర్ల వద్ద పవన్ అభిమానులు పెద్ద ఎత్తున గుమిగూడారు. "బాబులకు బాబు.. కళ్యాణ్ బాబు!" అంటూ నినాదాలతో ఆ ప్రాంతాలు మార్మోగాయి.ఫ్యాన్స్ మాత్రమే కాదు, స్థానిక యువత కూడా థియేటర్ ప్రాంగణాల్లో కటౌట్లకు పాలాభిషేకాలు, హారతులు చేసి తమ అభిమానాన్ని ఘనంగా చాటుకున్నారు.థియేటర్ బయట జనం గుమిగూడడంతో కొన్ని చోట్ల ప్రధాన రహదారులలో ట్రాఫిక్ జామ్ అయింది.జులై 23వ తేదీ రాత్రి 9 గంటల నుంచే తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం రాత్రంతా వేచిచూసిన అభిమానుల ఆనందం అవధులు దాటింది. కొందరు మీడియాతో తమ అభిప్రాయాన్ని పంచుకోగా, మరి కొందరు సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు. చారిత్రక కథను డైరెక్టర్లిద్దరూ బాగా చూపించారని చెప్పుకొస్తున్నారు. సినిమా తమకు ఎక్కడా బోర్ కొట్టలేదని.. కీరవాణి మ్యూజిక్ కూడా ఈ చిత్రానికి హైలెట్ అని అంటున్నారు.. పార్ట్1లో ప్రతీ క్యారెక్టర్‌ని కూడా మొదటి నుంచి ఎండింగ్ వరకు చాలా బాగా డిజైన్ చేసి చూపించారని, పార్ట్ 2లో ఈ పాత్రలకి సంబంధించి ప్రతీదానికి వివరణ ఉంటుందని అంటున్నారు.పవన్ యాక్షన్, ఎలివేషన్ సీన్లు ఎంతగానో ఆకట్టుకున్నాయని అభిమానులు చెప్పుకొస్తున్నారు. గ్రాఫిక్స్ కూడా అదిరిపోయినట్లు కామెంట్ చేస్తున్నారు. ఇక సినిమాకి పాజిటివ్ టాక్ వచ్చిన నేపథ్యంలో, అభిమానులు థియేటర్ వద్ద హారతులు, పాలాభిషేకాలు చేయడంతో పాటు తమ అభిమాన హీరోకు దిష్టి తీయాలని ప్రత్యేక పూజలు చేశారు. ఫ్యాన్స్ మాత్రమే కాదు, స్థానిక ప్రజలూ ఈ వేడుకల్లో భాగమవుతూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి చారిత్రక చిత్రానికి పవన్ కళ్యాణ్ లాంటి నటుడే తగిన వాడు. ఈ పాత్రను ఆయన తప్ప మరెవ్వరూ పోషించలేరు అని కొనియాడుతున్నారు. సమాజానికి మంచి సందేశం అందించేలా చిత్రాన్ని రూపొందించినందుకు కూడా ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కొత్త అవతారం ఎత్తిన సదా.. ఆమె చేసిన రిస్క్ చూస్తే గూస్‌బంప్స్ గ్యారెంటీ..!




సదా పేరు చెబితే చాలామందికి 'జయం' సినిమాలో ఆమె చెబుతున్న "వెళ్ళవయ్యా వెళ్ళు అనే డైలాగ్ వెంటనే గుర్తొస్తుంది. ఆ సినిమా ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ, తన టాలెంట్‌తో అతి తక్కువ సమయంలో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అంతేకాదు, లెజెండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అపరిచితుడు'లో అవకాశం దక్కించుకుంది. దీంతో సౌత్ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయినా, ఆమె కెరీర్ ఊహించినంత ముందుకు సాగలేదు.'అపరిచితుడు' తర్వాత సదా సరైన స్క్రిప్ట్‌లు ఎంచుకోలేకపోయింది. వరుస ఫ్లాపులతో ఆమె క్రేజ్ తగ్గుతూ వచ్చింది. సినిమాలు ఆశించిన స్థాయి చేరకపోవడంతో పాటు, కొన్ని గోల్డెన్ ఆఫర్స్‌ను వదులుకోవడం కూడా ఆమె కెరీర్‌కు ఎదురుదెబ్బ అయ్యింది. చంద్రముఖి సినిమాలో మొదటగా జ్యోతిక పాత్రకు సదాకే అవకాశం వచ్చింది. కానీ 'అపరిచితుడు' షూటింగ్ కారణంగా డేట్స్ కుదరక, ఆ అవకాశాన్ని కోల్పోయింది. శేఖర్ కమ్ముల 'ఆనంద్' చిత్రం కోసం కూడా మొదటగా సదానే అని అనుకున్నారు. కానీ ఆమె ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించడంతో మరో హీరోయిన్‌కి ఆ అవకాశం దక్కింది.ఇలా సదా అప్పుడు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో తన కెరీర్ సందిగ్ధంలో పడ్డట్టు అయింది. అయితే సిల్వర్ స్క్రీన్ దూరమైనా, సదా బుల్లితెరపై కొన్నాళ్లు తన హవా కొనసాగించింది.

# రిషబ్ పంత్ గాయం పట్ల స్పందించిన సాయి సుదర్శన్..అభిమానుల ఆందోళన



**మాంచెస్టర్-నవభూమి:** ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నాలుగో టెస్ట్ తొలి రోజు ఉత్కంఠభరితంగా ముగిసింది. ఈ మ్యాచులో కలచివేస్తున్న విషయం ఏంటంటే రిషబ్ పంత్ గాయంపై వచ్చిన అప్‌డేట్. యువ బ్యాట్స్‌మన్ సాయి సుదర్శన్ (%ూఖఱ ూబఎస్త్ఝతీయఖఅ%) దీనిపై కీలక వ్యాఖ్యలు చేయడంతో భారత అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఆటలో పంత్ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, గాయం కారణంగా అతడి లభ్యతపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో మ్యాచ్ కంటే ప్రస్తుతం పంత్ ఆరోగ్యంపై చర్చ మొదలైంది.వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్, సాయి సుదర్శన్‌తో కలిసి దూకుడుగా ఆడుతూ 48 బంతుల్లో 37 పరుగులు చేశాడు. ఆ క్రమంలో రెండు ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టాడు. అయితే, చివరి సెషన్‌లో క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడబోయి, బంతి అతని కుడి కాలి బూట్‌పై బలంగా తాకింది. ఇంగ్లాండ్ జట్టు %ూదీఔ% కోసం అప్పీల్ చేసినా, అంపైర్ తిరస్కరించాడు. బెన్ స్టోక్స్ తీసుకున్నాడు, కానీ పంత్ బ్యాట్‌కు బంతి తగిలినట్లు తేలడంతో అది విఫలమైంది.అయినప్పటికీ, 27 ఏళ్ల పంత్ తీవ్ర నొప్పితో బాధపడ్డాడు. మైదానంలో లింపింగ్ చేస్తూ, తన ప్యాడ్‌లను తీసేశాడు. భారత జట్టు ఫిజియో వెంటనే అతన్ని పరిశీలించగా, పరిస్థితి మెరుగుపడకపోవడంతో పంత్‌ను ఆసుపత్రికి తరలించారు. సాయి సుదర్శన్ మాట్లాడుతూ, పంత్ స్కాన్‌ల కోసం వెళ్లినట్లు, ఈరోజు రాత్రి ఫలితాలు తెలుస్తాయని చెప్పాడు. అతను త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నప్పటికీ, పంత్ ఆడకపోతే జట్టులోని ఇతర బ్యాట్స్‌మన్‌లు బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపాడు.

# జాతీయ క్రీడా పాలన బిల్లు.. క్రీడా రంగంలో మేలి మలుపు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే దిశగా కీలక ముందడుగు పడింది. 'జాతీయ క్రీడా పాలన బిల్లు'ను కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు దేశ క్రీడా రంగంలో మరింత జవాబుదారీతనం ఉండేలా నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్‌ఎస్‌బీ) ఏర్పాటు కానుంది. జాతీయ క్రీడా పాలన బిల్లు చట్టంగా మారాక..అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ)లు ఎన్‌ఎస్‌బీ నుంచి గుర్తింపు పొందాల్సి ఉంటుంది.నేషనల్ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ (ఎన్‌ఎస్‌టీ) ఏర్పాటుకు కూడా ప్రతిపాదన చేశారు. ఈ ట్రిబ్యునల్‌కు సివిల్ కోర్టు అధికారాలుంటాయి. సమాఖ్యల ఎన్నికలు, అథ్లెట్ల ఎంపికల్లో వివాదాలను ఈ బోర్డు పరిష్కరిస్తుంది. ట్రిబ్యునల్ నిర్ణయాలను సుప్రీంకోర్టులోనే సవాలు చేయాల్సి ఉంటుంది.70 ఏళ్లు దాటినా కొనసాగొచ్చు..క్రీడా సమాఖ్యల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వయస్సు పరిమితిలో సడలింపులకు కొత్త బిల్లు వీలు కల్పించింది. ఎన్నికల్లో పోటీ చేసే సమయానికి వయసు 70 దాటకూడదు. అయితే, ఆయా సమాఖ్యల అంతర్జాతీయ కమిటీల నిబంధనలు అనుమతిస్తే 70 నుంచి 75 సంవత్సరాలు కలిగిన వ్యక్తులు పదవిలో కొనసాగొచ్చు.

నవక్రీడ

# సింధు ముందంజ



**చాంగ్జౌ-నవభూమి:** భారత షట్లర్లు పీవీ సింధు, ఉన్నతి హుడా, డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి చైనా ఓపెన్‌లో శుభారంభం చేశారు. సింగిల్స్ మొదటి రౌండ్లో సింధు 21-15, 8-21, 21-17తో మియాజకి (జపాన్)పై, ఉన్నతి 21-11, 21-16తో గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలిచారు. రెండో రౌండ్లో సింధుతో ఉన్నతి అమీతుమీ తేల్చుకోనుంది. సాత్విక్/చిరాగ్ ద్వయం 21-13, 21-9తో జపాన్ జోడీ మిత్సుహాషి/ఒకమురను అరగంటలోనే ఇంటిబాట పట్టించింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**